


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




హైదరాబాద్ | 23-03-2026 సోమవారం | సంపుటి : 27 | సంచిక : 20 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal Follow us on

# ఇద్దరికి ఇంటిదారి?

## వారి స్థానంలో అదే వర్గానికి చెందిన ఇద్దరికి మంత్రివర్గంలో చోటు!

**హైదరాబాద్, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలకాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంది. వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. అయితే సామాజిక వర్గ సమీకరణాలను పరిగణలోకి తీసుకుని.. ఎవరిని తొలగిస్తున్నారో వారిని అదే సామాజిక వర్గ నేతతో భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో కొనసాగుతున్న మంత్రుల్లో ఒకరు, లేదా ఇద్దరిని తప్పించి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకురావాలని యోచిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవుల నుంచి తప్పించిన వారికి ప్రమోషన్లు ఇచ్చి పార్టీలో ఉన్నత పదవులు కట్టబెట్టాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఏ సామాజిక వర్గ మంత్రిని తొలగిస్తున్నారో.. కొత్తగా అవకాశం కల్పించే వారిని కూడా అదే సామాజిక వర్గం నుంచి తీసుకురావాలని తెలుస్తోంది. ఇక మంత్రివర్గం నుంచి తీసేసిన వారిని వారి సీనియారిటీని ఆధారంగా చేసుకుని.. సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి సంబంధించి ఆయా మంత్రులకు ఇప్పటికే పార్టీ హైకమాండ్ సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అందుకు ఆ నేతలు కూడా సానుకూలంగానే అంగీకరించినట్లు హస్తం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత మంత్రులను తప్పించడం



**కేబినెట్ మార్పులపై ఆసక్తికర చర్చ**

తోపాటు.. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న మరో 2 మంత్రి పదవులను కూడా భర్తీ చేసేందుకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేసేందుకు ఆయా జిల్లాల ప్రాతినిథ్యం, సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావిస్తోంది. కేబినెట్ విస్తరణపై పార్టీలో అంతర్గత వివాదాలు రాకుండా ఉండేందుకు పక్కాగా ప్రణాళికలు చేస్తోంది. తప్పించిన మంత్రుల స్థానాలను అదే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలతోనే భర్తీ చేయాలనే నిర్ణయించినట్లు సమాచారం. ఇక మంత్రి పదవుల నుంచి తప్పించిన వారు.. అవమానంగా భావించకుండా ఉండేందుకు..

మిగతా 2లో

# స్కిల్స్‌లో పాలిటెక్నిక్‌లు

## ఎటిసిలు కూడా • రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 22 (ఎఎంఎస్) :** తెలంగాణలోని స్కిల్స్ వర్సిటీ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను ఈ వర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ, పరిశ్రమల శాఖ ఆదివారం ఉన్నత విద్యాశాఖకు దీనిని బదిలీ చేసింది. దీంతో సాంకేతిక విద్యా బోర్డు రద్దు కానుంది. యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి, ఉపాధి అవకాశాలు పెంచడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిని మరింత విస్తరించాలని డిసైడ్ అయింది. రాష్ట్రంలోని సాంకేతిక విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ.. పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (గతంలో ఐటీఐలు) ఈ



యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ విప్లవాత్మక మార్పు ద్వారా నైపుణ్యాభివృద్ధికి ఒకే గొడుగు కింద సమగ్ర వేదికను అందించడమే కాకుండా, ఇప్పటివరకు పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న ఈ వర్సిటీని ఇకపై ఉన్నత విద్యాశాఖ కిందికి మారుస్తూ నిర్ణయం తీసుకుంది. 2024 ఆగస్టులో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి ఛాన్సలర్‌గా వ్యవహరిస్తుండగా, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్న ఈ వర్సిటీ.. ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో శాశ్వత ప్రాంగణాన్ని నిర్మించుకుంటోంది. కేవలం వందల సంఖ్యలో కాకుండా, వేలాది మంది యువతకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ ఇవ్వాలంటే ప్రస్తుతం ఉన్న విద్యాశాఖ, సాంకేతిక విద్యాశాఖ మరియు కార్మికశాఖల పరిధిలోని కళాశాలల సహకారం అనివార్యమని ప్రభుత్వం గుర్తించింది.

మిగతా 2లో

# రైతు కంట ఆనందం

## 70 లక్షల మంది ఖాతాల్లో రూ.3600 కోట్లు

## తొలి విడత రైతు భరోసా నిధులు

**పంట మార్పిడి అవసరం: సిఎం రేవంత్ రెడ్డి**

**నర్మెట్ట రైతు ఉత్సవాల వేదిక మీద సిఎం రేవంత్ విడుదల**

**సిద్ధిపేట జిల్లాలో రూ. 775.72 కోట్లతో అభివృద్ధి పనులు**

**సిద్ధిపేట, నర్మెట్ట, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం సుభిక్షంగా ఉండదు అని నేను బలంగా నమ్ముతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్మెట్ట రైతు ఉత్సవాలు వేదిక నుంచి మాట్లాడుతూ అన్నారు. అందుకే రైతుల సంక్షేమం విషయంలో ఎక్కడా లోటు రాకుండా చూస్తున్నామని చెప్పారు. "రైతుల కళ్లలో ఆనందం చూడాలని ఇవాళ రైతు భరోసా నిధులు విడుదల చేశాం. 45 రోజుల్లో మూడు విడతలుగా 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల కోసం ప్రతీ నెల రూ. 2533 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లో ప్రతీ నెల రూ.5500 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నాం. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించుకుంటున్నాం . ప్రజా ప్రభుత్వంలో రైతు సంక్షేమం కోసం రెండేళ్లలో లక్ష కోట్లకుపైగా ఖర్చు చేశాం. దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా నిలిచింది అని వెల్లడించారు. వ్యవసాయంలో మార్పు రావాలి. రైతులు పంట మార్పిడి విధానం అనుసరించాలి. గతంలో ప్రాంతాల వారీగా వివిధ రకాల పంటలు పండించేవారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పండ్ల తోటలు ఎక్కువగా కనిపించేవి. వరి ఒక్కటే కాదు... అన్ని రకాల పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈసారి 71 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశాం. కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నులకు మించి కొనడం లేదు. అందుకే పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి. అందుకు



రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో మంత్రులు

### సిద్ధిపేట నుంచి గెలిపిస్తే మంత్రిని చేస్తా

2029లో సిద్ధిపేట నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపిస్తే మంత్రిని చేస్తా. 1984 నుంచి 2029 వరకూ ఇక్కడ ఒకే కుటుంబం అధికారంలో ఉంది. 2029 మళ్లీ వస్తాం.. సిద్ధిపేటలో మళ్లీ సమావేశం పెడతాం. కొంతమంది అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. ప్రభుత్వానికి ప్రతిపక్షాలు సూచనలు చేయాలి. అభివృద్ధికి అడ్డుపడతామంటే ఎలా?, చెట్టుకు పట్టిన పురుగును ఎలా వదిలించాలో తెలుసు. అన్ని నియోజకవర్గాలను సమాన దృష్టితో చూస్తాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

అవసరమైన ప్రణాళికలు తీసుకురావాలి . కేంద్రం ప్రభుత్వ సహకారంతో రైతులు పండించే పంటలను లాభసాటిగా మారుస్తాం. పామాయిల్ పంట 3 లక్షల ఎకరాలకు చేరింది. పది లక్షల ఎకరాలు సాగుచేసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. కొడంగల్ నియోజకవర్గంలో కూడా ఆయిల్ పామ్ కర్మాగారం నిర్మించాలని మంత్రి తుమ్మల గారిని కోరుతున్నా. ఇది మంచి లాభసాటి వ్యవసాయం.. వ్యవసాయంలో 12,728 గ్రామ పంచాయితీలకు అంకా పూర్ స్ఫూర్తి కావాలి. ప్రతీ గ్రామాన్ని అంకాపూర్ లా తీర్చి దిద్ది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి ఉద్బోధించారు. అంతర్జాతీయ మార్కెట్ లో పంటలను ఎగుమతులు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. తెలంగాణలో పండే ప్రతీ పంటను లాభసాటిగా మార్చడమే బంగారు తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఆర్టీసీ బస్సులకు ఆడబిడ్డల్ని యజమానులను చేశాం . కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. పట్టణాల్లోనూ మహిళా సంఘాల సభ్యుల సంఖ్యను పెంచండి. ఇప్పటి వరకు బ్యాంకు లాంకేజీల ద్వారా 57 వేల కోట్ల రుణాలు అందించాం. అదానీ అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలు సోలార్ విద్యుత్ తయారు చేస్తున్నారు అని వివరించారు.

**ఆడబిడ్డలు ఆర్థికంగా నిలబడాలి**

ఆడబిడ్డలకు ఆర్థికంగా అర్థ భాగస్వామ్యం వచ్చినప్పుడే దేశ ఎకానమీ అభివృద్ధి చెందుతుంది. మీరు ఆర్థికంగా నిలబడండి.. ఎదగండి.. మీ అభివృద్ధి కోసం ఇక్కడి నుంచైనా నిధులు తెస్తా, విద్యా కమిషన్ సూచన మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ప్రారంభిస్తాం. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చి దిద్దుతాం. ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేస్తాం. ఏటీసీలు ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం. నైపుణ్యం ఉన్న విద్య వైపు మనం అడుగులు వేయాలి. వ్యవసాయంలో కొత్త విధానాలు అనుసరించాలి. దేశాల మధ్య యుద్ధం నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఎరువుల కొరత వచ్చే ప్రమాదం ఉందిజ కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని మోదీని కలిసి మన రాష్ట్రానికి అత్యధిక యూరియా తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. ఇది రాజకీయాలకు సమయం కాదు.. సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

మిగతా 2లో



# ఇరాన్ భీషణ దాడులు

- ఇజ్రాయిల్ అణు ఇంధన కేంద్రం సమీపంలో ఇరాన్ క్షిపణులు
- 100 –200 మంది గాయపడినట్లు ఇజ్రాయెట్ ప్రకటన
- దాడుల్లో 200 మంది చనిపోయారు : ఇరాన్
- ఈ ప్రాంతంలో 30 శాతం జనాభా భారతీయులే
- డిమోన నగరంలో నివసిస్తున్న 7500 మంది భారత సంతతి
- ఇరాన్ మిస్సైల్స్ పరిధిలో ఐరోపా రాజధానులు
- తొలిసారిగా సుదూర క్షిపణులను ప్రయోగించిన ఇరాన్

**ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తాం : ట్రంప్**

**వుదయం డెస్క్, మార్చి 22 :** ఇజ్రాయెల్ అణు కేంద్రం ఉన్న ఇజ్రాయెల్ దక్షిణ నగరమైన డిమోనా, అరాద్ పై దాడి జరిగినట్టు వీడియోలు చూపుతున్నాయి. ఈ దాడుల్లో 100 మంది గాయపడినట్టు ఇరాన్ ప్రకటించింది. ఐతే ఈ దాడిలో 200 మంది ఇజ్రాయెలీలు మరణించిన ఇరాన్ చెబుతున్నది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు ఆ అణు కేంద్రం ప్రాంతం పరిసరాల్లో గల రక్షణ వ్యవస్థలను ఛేదించడం ఇదే తొలిసారి. యుద్ధం ప్రారంభమై నాలుగవ వారంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ఈ యుద్ధం తీవ్రమవుతోందని ఈ దాడులు స్పష్టం చేస్తున్నాయి. అణు పరిశోధనా కేంద్రానికి 20 కిమీల దూరంలో దిమోనా ఉండగా, ఉత్తరానికి 35 కిమీల దూరంలో అరాద్ ఉంది. సోషల్ మీడియాపై షేర్ చేసిన దాడులు ఈ లక్ష్యాలను తాకడం కనిపిస్తోంది. అయితే, ఈ వీడియోలను ధృవీకరించడం ఇదే తొలిసారి.

మిగతా 2లో

# కొత్త బిల్డింగ్ రూల్స్

- టీడీఆర్ వినియోగం, హై-రైజ్ భవనాల గుర్తింపు
- సెట్‌బ్యాక్ సడలింపులపై మార్గదర్శకాలు, ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్, మార్చి 22 (ఎఎంఎస్) :** తెలంగాణలో భవన నిర్మాణ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు చేసింది. ఇందులో భాగంగా 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ - 2012'కు కీలక సవరణలు చేస్తూ ఆదివారం జీవో.95విడుదల చేసింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ జీవోలో టీడీఆర్ వినియోగం, హై-రైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

**హై-రైజ్ భవనాల కొత్త నిర్వచనం**

ఇకపై 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే 'హై-రైజ్' భవనాలుగా పరిగణిస్తారు. పారిశ్రామిక భవనాల్లో ఉండే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, బాయిలర్ రూములు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులు, ఇతర నిర్మాణ ఫీచర్లను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు.

**చిన్న ప్లాట్లకు నిబంధన:** 750 చ.మీ నుండి 2000 చ.మీ మధ్య ఉండే ప్లాట్లలో 18 మీటర్ల నుండి 21 మీటర్ల ఎత్తు వరకు భవనాలు నిర్మించాలంటే టీడీఆర్ వినియోగం తప్పనిసరి.

**భారీ భవనాలపై లోడింగ్:** 10 అంతస్తుల నుండి 20 అంతస్తుల లోపు ఉండే భవనాలకు 10 అంతస్తుల పైబడిన బిల్ట్-అప్ ఏరియాపై 3 శాతం టీడీఆర్ లోడింగ్ ఉండాలి. 20 అంతస్తుల పైబడిన భవనాలకు 20 అంతస్తుల పైబడిన ఏరియాపై 5 శాతం టీడీఆర్ వినియోగించాల్సి ఉంటుంది.

**సమర్పణ విధానం:** బిల్డింగ్ పర్మిషన్ సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలి. మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్

మిగతా 2లో

# ఇరాన్ క్షిపణుల పరిధిలో ఐరోపా !

## యుద్ధం పశ్చిమాసియా పరిధి మించే ప్రమాదం

**వుదయం డెస్క్, మార్చి 22 :** ఇరాన్ దళాలు శనివారం తొలిసారిగా సుదూర క్షిపణులను ప్రయోగించాయి. దీంతో ఈ ఘర్షణ పశ్చిమాసియా ఆవలకు విస్తరించిందని, ఐరోపా రాజధానులు కూడా లక్ష్యంగా మారవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ అణు కేంద్రం సమీపంలో డజన్ల కొద్దీ ప్రజలు గాయపడ్డారు.హిందూ మహాసముద్రంలోని అమెరికా-బ్రిటన్ సైనిక స్థావరం డీగో గార్సియాపై రెండు 4,000 కిలోమీటర్ల పరిధి గల బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైనిక అధిపతి ఐయాల్ జమీర్ తెలిపారు. ఈ సంఘర్షణలో ఇరాన్ సుదూర క్షిపణులను ఉపయోగించడం ఇదే మొదటిసారి అని ఇజ్రాయెల్ సైన్యం అభివర్ణించింది. ఈ క్షిపణులు ఇజ్రాయెల్‌పై దాడి చేయడానికి ఉద్దేశించినవి కావు. వాటి పరిధి ఐరోపా రాజధానుల వరకు విస్తరించి ఉందని, బెర్లిన్, పారిస్ , రోమ్ అన్నీ ప్రత్యక్ష ముప్పు పరిధిలోనే ఉన్నాయని రాయిటర్స్ ఉటంకించిన ఒక ప్రకటనలో జమీర్ తెలిపారు. దీనిపై స్పందిస్తూ, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో ఐరోపాపై దాడికి కుట్ర పన్నుతోందని గానీ, లేదా అలా చేసే సామర్థ్యం



దానికి ఉందని గానీ తెలిపే ఎటువంటి అంచనా తమ వద్ద లేదని బ్రిటన్ గృహనిర్మాణ శాఖ కార్యదర్శి స్టీవ్ రీడ్ ఆదివారం పేర్కొన్నారు. ప్రస్తుతం వినిపిస్తున్న వాదనలను సమర్థించే ఎటువంటి అంచనా మా వద్ద లేదు, అని రీడ్ బిబిసితో అన్నారు. వారు ఐరోపాను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపే ఎటువంటి అంచనా గురించి కూడా నాకు తెలియదు; ఇక వారు ప్రయత్నిస్తే ఆ దాడిని విజయవంతంగా చేయగలరనే మాటకు అసలు ఆస్కారమే లేదు, అని ఆయన వివరించారు. ఇజ్రాయెల్ రహస్య అణు రియాక్టర్ డిమోనాకు ఆగ్నేయంగా సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉంది. డిమోనా, అరాద్ రెండూ దేశంలోని అతిపెద్ద సైనిక స్థావరాలలో ఒకటైన నెవాటిమ్ ఎయిర్ బేస్‌తో సహా అనేక సైనిక స్థావరాలకు సమీపంలో ఉన్నాయి. అటువంటి ప్రదే శంపై ఇరాన్ ఆదివారం దాడులు చేసిం ది. శనివారం ఉదయం నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడి చేశాయని ఇరాన్ మీడియా పేర్కొంది. అటువంటి దాడి గురించి తమకు తెలియదని ఇజ్రాయెల్ చెప్పగా, అంతర్జాతీ య అణుశక్తి సంస్థ అధిపతి తాము దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆ తర్వాత, దక్షిణ బుషెహర్ ఓడరేవులోని ఒక ప్రయాణీకుల టెర్మినల్‌పై, సమీపంలోని ఖర్గ్ ద్వీపంలో ఉన్న ఒక ఖాళీ నౌకపై దాడులు జరిగినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ఇరాన్ చమురు ఎగుమతులలో దాదాపు మొత్తం ఈ ద్వీపం నుండే జరుగుతుంది. ఒకవేళ వాషింగ్టన్ ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడి చేయాలని లేదా భూతల దళాలను మోహరించాలని నిర్ణయించుకుంటే, ఈ ద్వీపాన్ని ఒక సంభావ్య లక్ష్యంగా పరిగణిస్తున్నారు.

# సీనియర్ మంత్రులతో ప్రధాని మోడీ కీలక భేటీ



**న్యూఢిల్లీ, మార్చి 22 (వుదయం) :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోడీ ఆదివారం సాయంత్రం తన నివాసంలో సీనియర్ మంత్రులతో కీలక సమావేశా న్ని నిర్వహించారు. పెట్రోలియం, విదుర్యత్, ఎరువు రంగాలకు సంబంధించి పరిస్థితిని సమీక్షించారు. దేశవ్యాప్తంగా నిరాటంకంగా ఇంధనాన్ని సరఫరా చేయడం, స్థిరమైన లాజిస్టిక్స్, సమర్థవంతమైన పంపిణీ గురించి సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, ఎస్. జయశంకర్, జె.పి. నడ్డా, హర్దీప్ పురీ సహా సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వం ఇప్పటికే సానుకూల చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం ప్రపంచ పరిణామాలను నిరంతరం సమీక్షిస్తూ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభానికి దారితీసిందని పది రోజుల కిందట మోడీ పేర్కొన్న విషయం తెలిసిందే.

మిగతా 2లో

# ఇరాన్ భీషణ దాడులు

మొదటి పేజీ తరువాయి

ఈ క్షిపణులు తాకినప్పుడు ప్రజలు వాళ్లిల్లో ఉన్నట్టు కనిపించింది. పౌర ప్రాంతంలో ఇవి పడటంతో పలు భవనాలు శనివారం రాత్రి కుప్పకూలిపోయాయి. ఇరాన్ ప్రధాన అణు శుద్ధి కేంద్రంపై దాడులు జరిగిన అనంతరం ఈ దాడులు జరిగాయి. శనివారంనాడు ఇరాన్‌లోని నంతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా అరాద్ నగరంలో 10 అపార్ట్‌మెంట్ భవనాలు భారీగా దెబ్బ తినగా, మూడు తీవ్రంగా దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. సుమారు 64మంది వ్యక్తులను ఆసుపత్రులకు తీసుకువెళ్లారు. పశ్చిమాసియా ప్రాంతంలో అణ్వాయుధాలు కలిగిన నగరం ఇజ్రాయెల్ ఒక్కటే అని వార్తలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆ దేశ నాయకులు ఖరారు చేయరు ఖండించరు. ఇలా ఉండగా, ఇజ్రాయెలీ కేంద్రం దెబ్బతిన్నట్టుగా కానీ, అసాధారణ రేడియేషన్ స్థాయిలు పెరిగినట్టుకానీ తమకు వార్తలు అందలేదని ఐరాస న్యూక్లియర్ వాచ్ డాగ్ ఎక్స్‌పై పేర్కొంది. కాగా, ఈ ప్రాంతంలో దాదాపు 30 శాతంమంది భారత సంతతికి



చెందినవారు ఉండడంతో దీనిని లిటిల్ ఇండియా అని కూడా పిలుస్తారు. భారత- యూదు సమాజానికి చెందిన అనేకమంది 1950-1960 దశకాలలో ఇజ్రాయెల్‌కు వలసవెళ్లారని ఇజ్రాయెల్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. వీరిలో అత్యధికులు మహారాష్ట్రకు చెందిన వారు కాగా, కేరళ, కోల్‌కతాకు చెందిన వారు కూడా ఉన్నారు. వీరంతా డిమోన్ ప్రాంతంలో స్థిరపడ్డారు. ఇటీవల మిజోరాం, మణిపూర్‌కు చెందిన కొందరు భారత యూదులు కూడా అక్కడకు వలస వెళ్లారు. ఈ నగరంలో ప్రస్తుతం దాదాపు 7,500 మంది భారత సంతతికి చెందిన ప్రజలు నివసిస్తున్నారు. వీరు అనర్గళంగా మరాఠీలో మాట్లాడగలరు. అక్కడక్కడా హిందీ మాటలు కూడా వినిపిస్తాయి. ఇక్కడి భారతీయుల్లో అత్యధికులు వజ్రాల వ్యాపారులుగా, ఐటీ నిపుణులుగా కొనసాగుతున్నారు. ఆహారం మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలనూ వీరు పాటిస్తారు. ఓనం, దీపావళి వంటి పండగలను ఘనంగా నిర్వహిస్తారు. డిమోనాతో పాటు హైఫా, టెల్ అవీవ్, అరద్, నెతన్యా, అఫులా వంటి నగరాల్లోనూ భారత సంతతి వారు ఉన్నారు.

## ఇద్దరికి ఇంటిదారి?

మొదటి పేజీ తరువాయి

వారికి ఉన్నత పదవులు ఇచ్చి హైకమాండ్ భావిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. అలాంటి వారికి పార్టీలో కీలకమైన, గౌరవప్రదమైన సీడబ్ల్యూసీ, ఏఐసీసీ పదవులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మంత్రివర్గ విస్తరణలో బీసీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. ఇందులో భాగంగానే బీసీల్లో సంఖ్యాబలం ఎక్కువ ఉన్న మున్నూరు కాపులు, ఎస్టీల్లో ఎక్కువ జనాభా ఉన్న లంబాడీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కాంగ్రెస్ నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈసారి శాసనమండలి నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ నేతకు కూడా మంత్రి పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చే సమయంలోనే మంత్రి పదవి ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్లు సమాచారం. కేబినెట్‌లో మార్పుల సందర్భంగానే చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులను కూడా భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఇందులో భాగంగానే అసెంబ్లీ, మండలి విప్‌ల నియామకాలు ఇటీవలె చేపట్టినా.. చీఫ్ విప్ నియామకాలను మాత్రం వాయిదా వేసినట్లు చర్చ జరుగుతోంది. మంత్రి పదవి రాని సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు కేబినెట్ హోదా ఉండే చీఫ్ విప్ పదవి ఇవ్వాలని భావిస్తున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిని ఇస్తున్నట్టు గతేడాది జూన్‌లో ప్రకటించగా.. తనకు ఆ పదవి ఇష్టం లేదని.. మంత్రి పదవి కావాలని ఆయన కాంగ్రెస్ పెద్దలకు తేల్చి చెప్పేశారు. దీంతో ఇంతవరకు కూడా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదు. చీఫ్ విప్, డిప్యూటీ స్పీకర్ పదవులకు కేబినెట్ హోదా ఉండటంతో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా వీటిని కూడా భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

## స్కిల్స్‌లో పాలిటెక్నిక్‌లు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలోని 113 పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి వస్తాయి. ఫలితంగా, ఇన్నాళ్లు ఈ కాలేజీల సిలబస్, పరీక్షల నిర్వహణ చూస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి రద్దు కానుంది. అలాగే, కార్మికశాఖ పరిధిలో ఉన్న 63 ప్రభుత్వ ఏటీసీలు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ వర్సిటీ కిందకే వస్తాయి. విదేశాల్లో ఉద్యోగాల కల్పన కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ, ఇంటర్మీడియట్ స్థాయిలోని వొకేషనల్ కోర్సులు కూడా ఈ నూతన వ్యవస్థలో భాగం కానున్నాయి. తెలంగాణ విద్యా కమిషన్ అందించిన 'విద్యా విధానం-2026' సిఫార్సుల మేరకు ఈ ఏకీకృత విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ మార్పుల వల్ల సిలబస్ రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు పెద్దపీట వేయడం సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ అధికారిక బదిలీ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంస్కరణలు పూర్తయితే.. తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సొంతం చేసుకుని, గ్లోబల్ జాబ్ మార్కెట్‌లో రాణించేందుకు మార్గం సుగమం అవుతుందని అంటున్నారు.

## రైతు కంట ఆనందం

మొదటి పేజీ తరువాయి



ఎన్నికలప్పుడే రాజకీయాలు, ఎన్నికలు ముగిసాక రాష్ట్ర అభివృద్ధినే ముఖ్యం. ఆయిల్ పామ్ కంపెనీ ఇక్కడున్న ఎమ్మెల్యే కోసం కాదు.. రైతుల కోసం నేను వివక్ష చూపను.. నాది వివక్ష చూపే తత్వం కాదని సిఎం పేర్కొన్నారు. మేం పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం కాదు, వివక్ష గురించి మాట్లాడాలంటే ఆనాడు కొడంగల్ కు ఎన్ని నిధులు ఇచ్చారో చర్చిద్దాం రండి, పదేళ్లు ప్రజలు మిమ్మల్ని ఆశీర్వదించారు.

### *2029 లో మళ్లీ అధికారం మాదే*

వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో ఎమ్మెల్యేగా గెలిపించిన వాళ్లను మంత్రినిచేసే బాధ్యత మా మంత్రులు వివే క్, దామన్నకు అప్పగిస్తున్నా.. కొన్నేళ్లుగా ఈ ప్రాం తంలో ఒకే కుటుంబం నుంచి శాసన సభ్యులుగా ఉంటున్నారు. మార్పు చేసి చూడండి.. మంచి జ రుగుతుందో లేదో చూడండి. మళ్లీ 2029 లో వస్తాం.. సిద్దిపేటలో గెలిపించిన వ్యక్తిని మంత్రిని చేస్తాం. సిద్దిపేటపై ఎలాం టి వివక్ష చూపాల్సిన అవసరం మాకు లేదు. 119 నియోజకవర్గాలతో సమానంగా చూస్తామని సిఎం అన్నారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో భిన్నాభిప్రాయాలు**

ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధిపైనే నా దృష్టి అని సీఎం చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కానీ వారి నియోజకవర్గాల్లో కూడా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ మా నిజాయితీ నిరూపించుకున్నామన్నారు. నర్మెట్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు నేను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయి. కావాలనుకుంటే నేను ఈ ఫ్యాక్టరీని కొడంగల్ కు తీసుకువెళ్లకపోయేవాడినా? కానీ ఇక్కడి రైతుల కోసం ఇక్కడే నిర్మించాం. ఆ తర్వాతే తన నియోజకవర్గానికి ఒకటి ఇవ్వమని మంత్రులను కోరుతున్నానని చెప్పారు. నేను వివక్ష చూపడంలేదన్నారు. వివక్ష గురించి మాట్లాడితే 2014 నుంచి 2023 వరకు కొడంగల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారు? మేమొచ్చాక ఈ ప్రాంతానికి నేను ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు తీద్దామన్నారు. వివక్ష మా ఇంట వంట లేదన్నారు. బీఆర్ఎస్ నేతలను చూసి చూసి ప్రజలను వేయమన్నారు. పేదల కోసం పని చేస్తాం తప్ప రాజకీయ నాయకుల కోసం మేము పని చేయామన్నారు. నాకు వ్యవసాయం తెలుసని చీడపురుగులకు ఏ మందు వేయాలో తనకు బాగా తెలుసన్నారు.

**సిద్దిపేట నియోజకవర్గంలో శంకుస్థాపనలు/ ప్రారంభోత్సవాల వివరాలు:**

రూ.300 కోట్లతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం. రూ.141.34 కోట్లతో సిద్దిపేట మున్సిపాలిటీలో నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులకు శంకుస్థాపన. రూ.78 కోట్లతో ఎన్సాన్‌పల్లిలో జిల్లా జైలు భవనం ప్రారంభోత్సవం. రూ.15 కోట్లతో ఎన్సాన్‌పల్లిలో 50 పడకల సమీకృత ఆయుష్ ఆసుపత్రి ప్రారంభోత్సవం. రూ.3.60 కోట్లతో ఎన్సాన్‌పల్లి లో సెంట్రల్ మెడిసిన్ స్టోర్ ప్రారంభోత్సవం. రూ.1.43 కోట్లతో నంగునూరు మండలం గట్లమల్యాలలో PHC భవనం ప్రారంభోత్సవం. రూ.1.43 కోట్లతో సిద్దిపేట మున్సిపాలిటీలోని అంబేద్కర్ నగర్ లో నిర్మించిన UPHC భవనం ప్రారంభోత్సవం.

**గజ్వేల్ నియోజకవర్గంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

రూ.200 కోట్లతో గజ్వెల్ నియోజకవర్గంలోని కొండపాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన. రూ.16.62 కోట్లతో మర్కూక్ లోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ లో అదనపు మౌలిక సదుపాయాలకు శంకుస్థాపన. రూ.8.65 కోట్లతో మర్కూక్ లో సమీకృత మండల కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవం. రూ.9.65 కోట్లతో జగదేవ్‌పూర్ లో సమీకృత మండల కార్యాలయాల సముదాయం ప్రారంభోత్సవం.





## సీనియర్ మంత్రులతో ప్రధాని మోడీ కీలక భేటీ

మొదటి పేజీ తరువాయి

ఇది భారత్‌కు ఒక అగ్ని పరీక్షగా మారిందని, శాంతి, సహనంతో ఈ పరిస్థితులను ఎదుర్కోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందన్నారు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి, అమెరికా ,ఇజ్రాయెల్ ఉమ్మడిగా, ఇరాన్‌పై దాడి చేసిన సందర్భంలో ప్రధానమంత్రి అనేక మంది ప్రపంచ నాయకులతో సంభాషించారు. ఇజ్రాయెల్ తో పాటుగా పొరుగున గల గల్ఫ్ దేశాలపై దాడి చేసి ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంది. ప్రపంచ ఇంధనంలో 20 శాతం రవాణా అయ్యే కీలకమైన నౌకా రవాణా మార్గమైనహొర్ముజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఈ సంఘర్షణ తర్వాత, ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీనిని దాటడానికి అనుమతించింది. ఈ దిగ్బంధనం కారణంగా భారతదేశంతో సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. ఈ సంఘర్షణ తర్వాత, మోదీ సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల నాయకులతో ఫోన్‌లో సంభాషించారు.

## దార్శనిక దేవాలయాలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

- లక్ష్మీపురం స్కూల్ పనుల్లో వేగం పెంచండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం



**ఖమ్మం, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్య కోసం పెట్టే ప్రతి రూపాయి భవిష్యత్ తరాలను నిర్మించడం కోసం పెట్టే పెట్టుబడిగా ఆయన అభివర్ణించారు. ఆదివారం మధిర నియోజకవర్గం లో పర్యటించిన భట్టి.. బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణం అవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న భవన సముదాయాలను కలియతిరుగుతూ ఆయన పరిశీలన చేశారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జూనియర్ హాస్టల్, జూనియర్, సీనియర్, అడ్మినిస్ట్రేటివ్ భవనాల నిర్మాణాన్ని పరిశీలించిన విక్రమార్క. మెకానికల్, సైన్స్, మ్యాథమెటిక్స్ , కంప్యూటర్ ల్యాబ్ భవనాల నిర్మాణాలను పరిశీలించారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దు అని ఆయన చెప్పారు. ఇవి కేవలం భవనాలు కాదు రేపటి తరాలను ఉజ్వలంగా నిర్మించే దార్శనిక దేవాలయాలుగా ఆయన అభివర్ణించారు.

## కొత్త బిల్డింగ్ రూల్స్

మొదటి పేజీ తరువాయి

పొందే ముందు సమర్పించడం తప్పనిసరి. అదనపు అంతస్తులకు వెసులుబాటు2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 40 ఫీట్ల రోడ్డు: 3 అదనపు అంతస్తుల వరకు అనుమతి. 60 ఫీట్ల రోడ్డు: 4 అదనపు అంతస్తుల వరకు అనుమతి. 80 ఫీట్ల రోడ్డు: 5 అదనపు అంతస్తుల వరకు అనుమతి. (గమనిక: ఇవి ఫైర్, ఎయిర్‌పోర్ట్, ఇతర నిబంధనలకు లోబడి ఉండాలి). సెట్‌బ్యాక్ సడలింపులు, ఇతర మార్పులు. హై-రైజ్ భవనాల్లో టీడీఆర్ వినియోగం ద్వారా అనుమతించబడిన సెట్‌బ్యాక్స్‌లో 10 శాతం వరకు రిలాక్సేషన్ పొందే అవకాశం కల్పించారు. అయితే, భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్‌బ్యాక్ ఉండాలనే నిబంధనను కచ్చితంగా పాటించాలి. ఒకవేళ మాస్టర్ ప్లాన్ రోడ్లను మార్చినప్పుడు, తొలగించినప్పుడు, దరఖాస్తుదారులు వర్తించే కన్వర్షన్ ఛార్జీలు చెల్లించడం, దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించే వెసులుబాటు కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతోనగరంలో నిలువు అభివృద్ధి పెరుగుతుందని, అలాగే పారదర్శకమైన భవన నిర్మాణ ప్రక్రియకు వీలు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమలులోకి రానున్నాయి.

## కేసీఆర్ దూరదృష్టి లోపంతో రాష్ట్రానికి అప్పులు

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**



**యాదాద్రి భువనగిరి, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర అభివృద్ధిపై దూరదృష్టి, విజన్ లేక ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసిన మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థికంగా నాశనం చేశారని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని హోటల్ వివేరాలో డిసిసి నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చేసిన అప్పులతోనేటికీ రూ. 6500 కోట్ల వడ్డీలు చెల్లించాల్సి వస్తుందన్నారు. 10 ఏళ్లు పరిపాలించి 8 లక్షల కోట్ల రూపాయల అప్పుడు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి తోశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేస్తే అవకాశాలు వాటి అంతట అవే వస్తాయన్నారు. భారతదేశ నిర్మాణంలో రాహుల్ గాంధీ కుటుంబం కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ నిర్మాణంలో బిజెపి నాయకుల కుటుంబ సభ్యుల పాత్ర ఎక్కడ ఉందని ప్రశ్నించారు. కొద్దో గొప్పో సావర్కర్ గురించి చెప్పుకుంటే బ్రిటిష్ వారి కాళ్ళ వద్ద మోకరిల్లిన సంఘటనలు మాత్రమే ఉన్నాయన్నారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 40వేల ఉద్యోగాలకు మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 67 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో పేద ప్రజలకు అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. అర్హులైన పేద కుటుంబంలో కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. బిఆర్ఎస్ తెలంగాణలో ఇక మొలిచే అవకాశం లేదని రాష్ట్ర ప్రజలు కూకటివేళ్లతో సహా పెకిలించే శారన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ బంద్రు శోభారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ లు పాల్గొన్నారు.

## మూసీ పునరుజ్జీవానికి బీజేపీ వ్యతిరేకం కాదు

- పేదల ఇళ్లను కూలగొట్టడాన్ని ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటాం
- మూసీ పక్కన అక్రమ కట్టడాలపై చర్యలేవీ ?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, మార్చి 22 ( వుదయం, ప్రతినిధి) :** మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని తెలంగాణ బీజేపీ చీఫ్ రామచంద్రరావు స్పష్టం చేశారు. కానీ.. పేదల ఇళ్లను కూలగొట్టడాన్ని ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటామని తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఆదివారం హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రూ.7000 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడమే కాకుండా.. పేదల ఇళ్లను కూలగొట్టడం సరి కాదన్నారు. దీనిని ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటామన్నారు. మూసీ పక్కన ఉన్న అక్రమ కట్టడాలపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. పేదల పక్షాన ఎవరూ లేరని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. హైదరాబాద్ నగరం సుందరీకరణ కావాలి కానీ.. అది పేదల ఇళ్లను, వారి జీవితాలను దెబ్బతీసేలా ఉండకూడదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి ఏమీ ఉండదని, అంతా అవినీతే కనిపిస్తోందన్నారు. కేసీఆర్ రూ.లక్షన్నర కోట్లతో కాళేశ్వరాన్ని నిర్మిస్తే.. రేవంత్ రెడ్డి దానిని మూసేశ్వరంగా మారుస్తున్నారని విమర్శించారు. చివరికి తెలంగాణను అభివృద్ధి చెందకుండా మూసేస్తారని దుయ్యబట్టారు.ఇక ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లో ఇరిగేషన్ రంగ నిపుణులు వెదిరె శ్రీరామ్ ప్రజల ఇళ్ల కూల్చివేతలపై కొన్ని ప్రత్యామ్నాయాలను వివరించారు. మూసీనదిలో కాలుష్యం, డ్రైనేజీ వ్యర్థాలు కలవకుండా శుద్ధిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మూసీనీటి నుంచి రైతులు స్వచ్ఛమైన పంటలను పండించినపుడు మూసీ పునరుజ్జీవం సక్సెస్ అయినట్లుగా భావించాలన్నారు. సిటీ ఏరియాలో మాత్రమే శుద్ధి చేస్తే పైనుంచి వచ్చే సీవరేజ్ అంతా ఎక్కడికి పోతుందన్న ఆలోచన లేకుండా ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు.

## పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లా..?

### రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి బండి ఫైర్



**హైదరాబాద్, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ధ్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తూ ఎంఐఎం పార్టీకి చెందిన నేతల ఆక్రమణలను మాత్రం వదిలేస్తోందని ధ్వజమెత్తారు. తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ను బండి సంజయ్ ఆదివారం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఇంటర్వ్యూలో రంగనాధ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ గరీంబోంకో హటావో-ఒవైసీకి బచావో అన్న చందంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పేదల కోసం బఫర్ జోన్లు, ఒవైసీ కోసం కంఫర్ట్ జోన్లు, పేదలకు ఫుల్ ట్యాంక్ లెవల్, ఒవైసీకి మాత్రం ఫుల్ థ్యాంక్ లేవల్ అనేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ లాజిక్ ఎలా ఉందంటే విద్యార్థులు అక్రమ కాలేజీలో చదివితే అది సామాజిక కోణం, పేదల ఇళ్లు మాత్రం ఆక్రమణలు అంటూ కూల్చేస్తున్నారని దుయ్యబట్టారు.అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 200లకు పైగా పేద కుటుంబాల ఇళ్లపైకి మెరుపు వేగంతో కదిలిన హైడ్రా బుల్డోజర్లు సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ లో ఉన్న ఒవైసీ కాలేజీ విషంలో మాత్రం జాప్యం చేస్తోందన్నారు. ప్రధాని మోడీ పీఎంఏవై ద్వారా పేదలకు గౌరవప్రదమైన నివాసాలు నిర్మిస్తుంటే కాంగ్రెస్ మాత్రం బుల్డోజర్లను పంపిస్తోందని విమర్శించారు. చట్టం రజాకార్ వారసుల కోసం వంగి, పేదలపై మాత్రం విరుచుకుపడితే అ దిపాలన కాదని బలహీనమైన సమర్థన మాత్రమేనని విమర్శించారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్: ఎమ్మెల్యే జిఎంఆర్



**గుమ్మడిదల, మార్చి 22 (వుదయం) :** పవిత్ర రంజాన్ పండుగ మత సామరస్యానికి నిలువుటద్దమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మైనారిటీ సోదరులు ఎమ్మెల్యేను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన ఉపవాస దీక్షలు మనిషిలో సహనం, దాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అందరూ సోదరభావంతో మెలగాలని, ప్రతి ఇంట్లో సుఖ శాంతులు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్, తుపాకుల రాజు, ఆంజనేయులు, ఫయాజ్, హర్షద్, సర్వర్, ముస్తఫా, జహీర్, ఫిరోజ్, షఫీ, మైనారిటీ సోదరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి అదుపులో 10 మంది

**రాజేంద్రనగర్, మార్చి 21 (వుదయం ప్రతినిధి)** :మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వటేపల్లిలో నివాస ప్రాంతాల మధ్య అక్రమంగా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై పోలీసులు మెరుపు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఈరోజు (22.03.2026) తెల్లవారుజామున 02:30 గంటలకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వటేపల్లిలోని ఒక అక్రమ హుక్కా సెంటర్‌పై దాడి నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా, నివాస ప్రాంతాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఈ హుక్కా పార్లర్‌ను నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. ఈ సందర్భంగా నిర్వాహకుడు మహ్మద్ తన్వీర్ (23)ను పోలీసులు పట్టుకున్నారు. అక్కడ హుక్కా సేవిస్తున్న మరో 10 మందిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## పదవిలో 8,931 రోజులు
# రాజకీయాల్లో కొత్త మైలురాయి

**న్యూఢిల్లీ, మార్చి 22 (వుదయం)ః**

దేశంలో ఎన్నికైన ప్రభుత్వానికి అత్యధిక కాలం అధిపతిగా వ్యవహరించిన నేతగా నిలిచి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత రాజకీయ చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఆయన పదవీకాలాన్ని మొత్తం కలిపి చూసినప్పుడు, ప్రధాని మోడీ ఇప్పుడు ఒక ప్రభుత్వానికి అధిపతిగా 8,931 రోజులను పూర్తి చేసుకున్నారు. ఆయన ప్రస్తుతం ఆ హోదాలోనే తన 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టారు.8,930 రోజుల పాటు పదవిలో కొనసాగిన సిక్కిం ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్‌ను మోడీ అధిగమించారు. ప్రధాని పేరు రికార్డు పుస్తకాల్లో ఇప్పటికే పలుమార్లు నమోదై ఉంది; అయితే, ఈ మైలురాయి దేశంలో అత్యున్నత స్థాయిలో ప్రధాని రాజకీయ నాయకత్వాన్ని చాటిచెప్పింది. ఆయన నిరంతరాయంగా పదవిలో కొనసాగారు.



గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి గా మాత్రమే కాకుండా, అత్యంత సుదీర్ఘ పూర్వ అనుభవం కలిగిన ప్రధానమంత్రి కూడా.

స్వాతంత్ర్యానంతరం జన్మించిన మొట్టమొదటి ప్రధానమంత్రి కూడా ఆయనే. అంతేకాక, 2014, 2019, 2024లలో వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో ఆయన విజయం సాధించారు. ఈ ఘనత, ఒక అగ్రశ్రేణి నాయకుడిగా అత్యున్నత స్థాయిలో ఆయనకున్న సుదీర్ఘకాలిక నిలకడను చాటిచెప్పింది.

**ప్రధాని మోడీ ఇతర విజయాలు**

ప్రధాని మోడీ 2001 అక్టోబర్ 7న ముఖ్యమంత్రి పదవిని స్వీకరించి, 2014 మే 21 వరకు ఆ బాధ్యతలను నిర్వర్తించారు. జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ముందు, ఆయన 13 సంవత్సరాలకు పైగా గుజరాత్‌కు నాయకత్వం వహించారు.

2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినప్పుడు, మోడీ భారతదేశ 14వ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ సాధించిన కాంగ్రెసేతర నాయకుడిగా ఆయన చరిత్ర సృష్టించారు.

మోడీ వరుసగా మూడవసారి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడంతో, అగ్ర నాయకుడిగా రెండు పూర్తి పదవీ కాలాలను పూర్తి చేసిన మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రధానమంత్రిగా నిలిచారు. అంతేకాక, వరుసగా మూడవసారి ఆ పదవిని అధిష్ఠించారు.

రాజకీయాల్లో ఆయన సాధించిన విశేష విజయాలతో పాటు, డిజిటల్ రంగంలోనూ ఆయన అనేక ఘనతలను సాధించారు. ఈ నెల ప్రారంభంలో తన యూట్యూబ్ ఛానెల్‌లో 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను పూర్తి చేసుకుని, ప్రపంచంలో అత్యధిక మంది అనుసరించే నాయకులలో ఒకరిగా మోడీ నిలిచారు.

ఫిబ్రవరిలో, ప్రధాని మోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో 1 కోట్ల మంది ఫాలోవర్లను కలిగి, ఆ ప్లాట్‌ఫామ్‌లో ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నాయకుడిగా నిలిచారు. సోషల్ మీడియాలో ఆయనకున్న ప్రజాదరణను తెలియజేస్తూ, మోడీకి ఎక్స్ పై 106.4 మిలియన్ల మంది ఫాలోవర్లు కూడా ఉన్నారు.

# ఎల్‌పిజితో మంగళూరు చేరుకున్న నౌక

**న్యూఢిల్లీ, మార్చి 22 (వుదయం):**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా సరఫరాలలో అంతరాయాలు కలుగుతున్న నేపథ్యంలో ఎల్‌పిజిని మోసుకుని ఒక అమెరికన్ నౌక న్యూమంగళూరు పోర్ట్ చేరుకుంది.

పిక్సిస్ పయొనీర్ నౌక, ఫిబ్రవరి 14న టెక్సాస్‌లోని పోర్ట్ ఆఫ్ నెదర్లాండ్ నుంచి 16,714 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీని ఏజీస్ లాజిస్టిక్స్‌కు అందించేందుకు బయలుదేరింది.



భారతదేశంలోనే అతిపెద్ద అండర్‌గ్రౌండ్ ఎల్‌పిజి నిల్వ కేంద్రాలు కలిగిన ప్రదేశం మంగళూరు కావడంతో ఈ పరిణామం ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ కేంద్రం సెప్టెంబర్ 2025 నుంచి పనిని ప్రారంభించింది. సముద్ర మట్టానికి 225 మీటర్ల లోతున గల ఈ నిల్వ కేంద్రానికి 80వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పిజిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది.దీనితోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. చైనాకు 7.7 లక్షల బారెళ్ల ముడి చమురుతో బయలుదేరిన
అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు.

ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం.ఆఫ్‌షోర్ పైప్ లైన్ ద్వారా ముడిచమురును ఆఫ్‌లోడింగ్‌తీరం నుండి 12 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న ఒక జెట్టీకి అనుసంధానించిన ఆఫ్‌షోర్ పైప్‌లైన్ ద్వారా ముడి చమురును మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పిఎల్)కు దించుతున్నట్లు సమాచారం.

## నాలుగువారాల యుద్ధంలో
# తాజా పరిణామాలు



**.వుదయం డెస్క్, మార్చి 22ః**

ఇరాన్, యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా యుద్ధం నాలుగవ వారంలోకి ప్రవేశించింది. ఈ దాడి ప్రతిదాడుల్లో సైనిక, దౌత్యపరమైన, గల్ఫ్‌లోని ఇంధన కేంద్రాలు ధ్వంసం అవుతున్నాయి.

ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ దాడులు, ఘర్షణ ఆ ప్రాంత వ్యాప్తమై, ఇంధన మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నది. ముఖ్యంగా హొర్ముజ్ జలసంధిని టెహ్రాన్ మూసివేయడంతో చమురు ధరలు చుక్కలను అంటుతున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుని లెబనాన్‌పై భూతల దాడులు చేస్తోంది.

ముఖ్య పరిణామాలుఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తానని ట్రంప్ హెచ్చరిక:

యుద్ధాన్ని ముగిస్తామని వ్యాఖ్యానించిన కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే, ఇరాన్ 48 గంటల్లోగా హొర్ముజ్ జలసంధిని తెరవకపోతే ఆ దేశ విద్యుత్ కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు.

ప్రతీకార దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరిక:

ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినను గనుక ఆచరణలో పెడితే, మధ్యప్రాచ్యం అంతటా ఉన్న కీలక మౌలిక సదుపాయాలపై దాడి చేస్తామని ఇరాన్ ఆదివారం హెచ్చరించింది.

ఇరాన్‌లో 1,400 మంది మృతి:

తమ దేశంపై కొనసాగుతున్న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో 1,400 మందికి పైగా ప్రజలు మరణించారని, 200కు పైగా నగరాలు దెబ్బతిన్నాయని ఇరాన్ అధికారులు తెలిపారు.

ఇజ్రాయెల్ అణు కేంద్రానికి సమీపంలో ఇరాన్ దాడి:

ఇరాన్ దక్షిణ ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. దిమోనా, అరద్ నగరాల్లో డజన్ల కొద్దీ ప్రజలు గాయపడ్డారు. దీనిని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు యుద్ధంలో ఇది అత్యంత క్లిష్టమైన రాత్రిగా అభివర్ణించారు.హొర్ముజ్‌ను సురక్షితం చేయడానికి దేశాల సంసిద్ధత:గల్ఫ్ నౌకాయానంపై ఇరాన్ దాడులను, హొర్ముజ్ దిగ్బంధనాన్ని ఇరవై రెండు దేశాలు ఖండించాయి. సురక్షిత మార్గాన్ని నిర్ధారించడానికి, తగిన ప్రయత్నాలకు సహకరించడానికి సంసిద్ధతను వ్యక్తం చేశాయి. సంతకాలు చేసిన దేశాలలో అమెరికా లేదు.దాడులను తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ:

ఆదివారం నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు దాడులను తీవ్రతరం చేస్తాయని రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హెచ్చరించారు.

# వైష్ణో దేవి యాత్ర నిలిపివేత

**జమ్మూ:**

ప్రస్తుతం కొనసాగుతున్న చైత్ర నవరాత్రుల వేళ జమ్ము కశ్మీర్‌లోని మాతా వైష్ణో దేవి ఆలయం భక్తజన సంద్రమైంది. రికార్డు స్థాయిలో భక్తులు పోటెత్తడంతో భద్రతా కారణాల దృష్ట్యా శనివారం (మార్చి 21) సాయంత్రం యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. రియాసీ జిల్లాలోని త్రికూట పర్వతాలపై కొలువైన ఈ దివ్య క్షేత్రానికి శనివారం ఒక్కరోజే సుమారు 39,000 మంది భక్తులు తరలివచ్చారు. చైత్ర నవరాత్రులు (మార్చి 19 – మార్చి 27) ప్రారంభమైన మూడవ రోజే ఈ స్థాయిలో రద్దీ పెరగడంతో, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా యాత్రను నిలిపివేస్తున్నట్లు ఆలయ బోర్డు ప్రకటించింది. భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

మళ్లీ రిజిస్ట్రేషన్లు ఎప్పుడంటే..యాత్ర నిలిపివేతతో కొత్త రిజిస్ట్రేషన్లను ప్రస్తుతానికి ఆపివేశారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి మళ్లీ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నట్లు పోలీసులు మైకుల ద్వారా భక్తులకు సమాచారం అందించారు. అప్పటి వరకు భక్తులు తమ హోటళ్లలోనే వేచి ఉండాలని సూచించారు. అయితే ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న సుమారు 10,000 మంది భక్తులు ప్రస్తుతం కొండపైకి వెళ్తున్నట్లు సమాచారం. 'జై మాతా దీ' స్మరణలతో కొండ మార్గమంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. నవరాత్రుల రద్దీ దృష్ట్యా కత్రా బేస్ క్యాంప్ నుండి ఆలయ మార్గం వరకు బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్య సదుపాయాలు, మార్గదర్శక కేంద్రాలను బోర్డు సిద్ధం చేసింది. నవరాత్రుల సందర్భంగా ఆలయంలో గురువారం ప్రారంభమైన 'శత చండీ మహాయాగం' శాస్త్రోక్తంగా కొనసాగుతోంది. లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఈ యాగంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. దేశంలోని నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుండటంతో రాబోయే వారం రోజుల పాటు రద్దీ ఇలాగే ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.





## దాడులను భారత్
# అడ్డుకోవాకోవాలి

**వుదయం డెస్క్, మార్చి 22ః**

యుఎస్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత్ తటస్థ పాత్ర పోషిస్తోంది. అటు ఇరాన్, ఇటు ఇజ్రాయెల్, యుఎస్‌లతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, యుద్ధంలో కాలువేయకుండా ఉండేందుకు ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ వైఖరిని ఆయా దేశాలు గౌరవిస్తున్నప్పటికీ, తాజాగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ మాత్రం భారత్‌ను మధ్యవర్తి పాత్ర పోషించాలని కోరారు. శనివారం నాడు, ప్రధాని మోడీ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌కు ఫోన్ చేసి మాట్లాడిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలోనే బ్రిక్స్ కూటమికి సారథ్యం వహిస్తున్న భారత్ ఆ హోదాలో స్వతంత్ర పాత్ర పోషించి, ఇరాన్‌పై దాడులను, దురాక్రమణలను అడ్డుకునే చర్యలు చేపట్టాలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కోరారు. అంతేకాకుండా, విదేశీ జోక్యం లేకుండా పశ్చిమాసియా దేశాలు ఒక ప్రాంతీయ భద్రత వ్యవస్థగా ఏర్పడాలని ప్రతిపాదించారు. పెజెష్కియాన్‌తో భారత ప్రధాని మోడీ శనివారం ఫోన్లో మాట్లాడారు. అణ్వాయుధాలు సమీకరించుకోకుండా అడ్డుకునేందుకే తమపై సైనిక దాడికి దిగినట్లు అమెరికా చెప్పడాన్ని ఇరాన్ అధ్యక్షుడు ఖండించారు. దివంగత సుప్రీంనేత ఖమేనీ ఈ ఆయుధాలను తీవ్రంగా వ్యతిరేకించారని, వాటి అభివృద్ధికి ఎలాంటి ముందడుగు వేయకూడదంటూ పాలనపరమైన, మతపరమైన ఆదేశాలు జారీచేశారని ఆయన చెప్పినట్లు టెహ్రాన్‌లో విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది. పశ్చిమాసియాలో కీలక మౌలిక సదుపాయాలపై దాడుల్ని మోడీ ఖండించారు. నౌకాయాన స్వేచ్ఛను కాపాడాలని, ఆయా మార్గాలు సురక్షితంగా.. తెరచి ఉండేలా చూడాలని నొక్కిచెప్పిన విసయం తెలిసిందే.

# గ్రీన్‌లాండ్‌కు రక్షణ కల్పిస్తాం



**వుదయం డెస్క్, మార్చి 22ః**

యుఎస్, ఇరాన్‌ల మధ్య యుద్ధం ఢీ అంటే ఢీ అన్నట్టు జరగడం ఒక్కటే కాదు, ఇరాన్ తన అంతర్జాతీయ పరపతిని పెంచుకోవడానికి ప్రయత్నిస్తోందనే సంకేతాలను పంపింది. ఎందుకంటే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశంలో కలుపుకోవాలని అత్యంత మోజు పడుతున్న గ్రీన్‌లాండ్ ద్వీపం గురించి ఇరాన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. వనరుల పరంగా ఎంతో కీలకమైన ఈ ద్వీపాన్ని ట్రంప్ నుంచి కాపాడేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ఇరాన్ అధికారి ఒకరు ప్రకటించారు

గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ వైఖరిని అత్యంత వివరంగా పేర్కొన్నారు. ఈ ద్వీపాన్ని అప్పగించాలని ముందు ఐరోపాను ట్రంప్ బెదిరించారని, తర్వాత బతిమాలుకున్నారని, ఇప్పుడు స్వాధీనం చేసుకుంటామని అల్టిమేటంలు ఇస్తున్నారని వివరించారు. ఒకవేళ ఐరోపా గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేకపోతే, తమ సాయం కోరుకోవచ్చని, తాము ఆయన నుంచి కాపాడతామని పేర్కొన్నారు. కాగా, ఆ ద్వీపానికి ఎలా రక్షణ కల్పిస్తారనే విషయాన్ని మాత్రం వివరించలేదు.

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధించిన తర్వాత గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ఈ ఏడాది ప్రారంభంలో ట్రంప్ చేసిన ప్రకటనలు సంచలనం సృష్టించాయి. దీనిపై చర్చలు జరపాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. అయితే, డెన్మార్క్ అందుకు నిరాకరించడంతో దీనిపై ఎలాంటి ఒప్పందం కుదరలేదు. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు మద్దతు తెలపని ఈయూ దేశాలపై అదనపు సుంకాలను విధిస్తానని తొలుత బెదిరించిన ఆయన తర్వాత వెనక్కి తగ్గారు. ఇరాన్ అధికారి వ్యాఖ్యలతో తాజాగా ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది.

## కార్యనిర్వాహక వర్గం కనుసన్నల్లో
# సిఇసి వ్యవహరిస్తున్నారు

**న్యూఢిల్లీ, మార్చి 22 (వుదయం :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలు ప్రవేశపెట్టిన నోటీసులలో, ఆయనపై పలు ఆరోపణలు చేశారు. ముఖ్యంగా, కార్యనిర్వాహక వర్గం కనుసన్నల్లో, అదుపులో పనిచేస్తున్నారని ఆరోపించడంతో పాటు, ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా భారీగా ఓటు హక్కును హరించడానికి ఆయనే కారణమని నిందించారు. అంతిమంగా, ఆయన నియామకంపై ప్రశ్నలు లేవనెత్తారు.మార్చి 12న పార్లమెంటు ఉభయ సభల్లో సమర్పించిన నోటీసులు, ప్రధాన ఎన్నికల కమిషనర్ పై ఏడు అభియోగాలను చూపుతూ, అది నిరూపితమైన దుష్ప్రవర్తన అని పేర్కొంటూ, ఆయనను పదవి నుండి తొలగించాలని కోరాయి.



లోక్‌సభలో 130 మంది, రాజ్యసభలో 63 మంది ప్రతిపక్ష సభ్యులు కూడా, సిఇసిని తొలగించేందుకు ఉద్దేశించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

ఆ నోటీసుల గురించి అడిగినప్పుడు, వాటిపై చర్చ కోసం తాము వేచి చూస్తున్నామని తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ నాయకుడు డెరెక్ ఓబ్రియాన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆ నోటీసులను పరిగణనలోకి తీసుకోకపోతే, కార్యనిర్వాహక వర్గానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు మధ్య ఏదో రహస్య ఒప్పందం ఉందనే సందేహాలు తలెత్తుతాయి, అని ఆయన అన్నారు.సమాన పోటీ వాతావరణాన్ని కొనసాగించడాన్ని ఆ నోటీసులు ఎన్నికల ప్రజాస్వామ్యానికి ఆత్మ, ప్రాణంగానూ, రాజ్యాంగ మౌలిక స్వరూపంలో ఒక భాగంగానూ అభివర్ణించాయి.నిరూపితమైన దుష్ప్రవర్తన ఆరోపణలలో, స్వేచ్ఛ, రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటంలో విఫలమయ్యారని, కార్యనిర్వాహక వర్గం అదుపులో పనిచేస్తున్నారని ప్రతిపక్షం సీఈసీపై ఆరోపణలు గుప్పించింది.

సీఈసీగా కుమార్ నియామక ప్రక్రియ, రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని ఆగస్టు 17, 2025న ఆయన నిర్వహించిన పక్షపాతపూరిత పత్రికా సమావేశం, ప్రతిపక్ష, అధికార పార్టీ సభ్యుల పట్ల వివక్షాపూరిత వైఖరి, దర్యాప్తులకు అడ్డంకులు, పారదర్శక సాధనాలను అందించడానికి నిరాకరించడం,'అధికార పార్టీ రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా' స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను అమలు చేయడం వంటివి ప్రతిపక్షం చేసిన ఆరోపణలలో ఉన్నాయి.ఎస్ఐఆర్ (సర్) లోని పౌరసత్వ ధృవీకరణ అంశంపై, అంటే ఓటర్ల జాబితా సవరణ ద్వారా ఓటర్ల పౌరసత్వ స్థితిని నిర్ధారించడంపై ఈసీఐ తీసుకున్న వైఖరి, దేశవ్యాప్తంగా ఎన్ఆర్సి (జాతీయ పౌర పట్టిక) ప్రక్రియను నిర్వహిస్తామని కేంద్ర హోం మంత్రి చేసిన ప్రకటనకు పూర్తిగా అనుగుణంగా ఉందని ఆరోపించారు.

సీఈసీని ఒక తటస్థ ఎన్నికల సంస్థ నుండి కార్యనిర్వాహక వర్గపు రాజకీయ అజెండాను అమలు చేసే సాధనంగా సమర్థవంతంగా మార్చేశారు. ఆయన దానిని నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే సంస్థ నుండి పౌరసత్వ నిర్ధారణ ట్రిబ్యునల్‌గా కూడా మార్చారు, అని ప్రతిపక్షం ఆరోపించింది.

నోటీసుల ప్రకారం, రెండు మూడు నెలల్లో ఎన్నికలు జరగనున్న అతిపెద్ద రాష్ట్రాల్లో రాకెట్ వేగంతో ఎస్ఐఆర్ ప్రారంభించాలని సీఈసీ తీసుకున్న ఆకస్మిక నిర్ణయాలు,

కాలపరిమితులను పునఃపరిశీలించడానికి మొండి పట్టుదల, నిజమైన మానవ బాధల పట్ల పూర్తి సున్నితత్వం లేకపోవడం, కోర్టులను ఆశ్రయించి నిర్దిష్ట ఆదేశాలు జారీ చేసే వరకు ప్రతిపక్ష పార్టీల ప్రతి విజ్ఞప్తిని ఉద్దేశపూర్వకంగా విస్మరించడం వంటివి గ్యానేష్ కుమార్ అంతర్లీన పక్షపాత మనస్తత్వాన్ని, వైఖరిని ప్రతిబింబిస్తున్నాయి అని వారు ఆరోపించారు.

## యుఎస్ పాక్‌పై దాడి చేస్తే
# ఢిల్లీ, ముంబైలను లక్ష్యంగా చేసుకుంటాం

**న్యూఢిల్లీ, మార్చి 22 (వుదయం):**

అమెరికా ఎప్పుడైనా పాకిస్తాన్‌పై దాడి చేస్తే, పాకిస్తాన్ భారత నగరాలపై దాడి చేయాలని పాక్ మాజీ రాయబారి అబ్దుల్ బాసిత్ ఒక టీవీ కార్యక్రమంలో అన్నారు.ఒక ఊహాజనిత సంఘర్షణపై జరిగిన చర్చలో పాల్గొన్న బాసిత్ మాట్లాడుతూ, ఒకవేళ అమెరికా పాక్‌పై దాడి చేస్తే, మనం రెండవ ఆలోచన చేయకుండా ముంబై, న్యూఢిల్లీపై దాడి చేయాలి అని అన్నారు.తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం. ఒకవేళ మనకు వేరే మార్గం లేకపోతే, అమెరికా మనపై దాడి చేస్తే, ఇది జరగని పని. కానీ పాకిస్తాన్ వైపు ఎవరైనా దుర్బుద్ధితో చూస్తే, భారత్‌పై దాడి చేయడం తప్ప మనకు వేరే ప్రత్యామ్నాయం ఉండదని ప్రపంచం తెలుసుకోవాలి, అని ఆయన పాకిస్తానీ ఛానెల్లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో పేర్కొన్నారు.



పాకిస్తాన్‌ను ముప్పుగా పేర్కొన్న అమెరికా నివేదిక

పాకిస్తాన్ సుదూర బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమం అమెరికా హోంలాండ్‌కి ముప్పుగా పరిణమించవచ్చని పేర్కొన్న ఒక అమెరికా నివేదికపై బసిత్ స్పందించారు.హౌజ్ ఇంటెలిజెన్స్ కమిటీకి 2026 వార్షిక ముప్పు అంచనాను సమర్పిస్తూ, అణు, సంప్రదాయ పేలోడ్‌లతో కూడిన అనేక రకాల నూతన అధునాతన లేదా సాంప్రదాయ క్షిపణి పంపిణీ వ్యవస్థలపై పరిశోధన, అభివృద్ధి చేస్తున్న దేశాలలో పాకిస్తాన్ కూడా ఒకటి. ఇవి మన మాతృభూమిని లక్ష్య పరిధిలోకి తీసుకువస్తాయి అని అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బార్డ్ అన్నారు.

పాకిస్తానీ క్షిపణుల గురించి గబ్బార్డ్ ప్రస్తావించినప్పటికీ, భారతీయ క్షిపణుల గురించి మాత్రం ఆమె మాట్లాడలేదని బాసిత్ పేర్కొన్నారు. భారత దేశం, అమెరికా వ్యూహాత్మక భాగస్వాములు. సరిగ్గా చైనాతో మనకున్న సంబంధం లాగే. అధ్యక్షుడు ట్రంప్ నుండి సాధ్యమైనంత ప్రయోజనాన్ని మీరు పొందండి, కానీ తాము ఒక వ్యూహాత్మక భాగస్వామిగా మారిపోయామని మాత్రం భావించకండి. అగ్ని-5, అగ్ని-6 క్షిపణుల గురించి ప్రస్తావించకపోవడం కేవలం ఒక పొరపాటు అని అనుకోవద్దు. పాకిస్తాన్‌ను చూసే దృష్టితో వారు భారతదేశాన్ని చూడరు, అని ఆయన అన్నారు. పాకిస్తాన్ అగ్ర దౌత్యవేత్తగా భారత్‌లో బాసిత్ సేవలందించారు.బాసిత్‌కు భారత్‌తో కొత్త పరిచయం ఏమీ కాదు. 2014 నుండి 2017 వరకు న్యూఢిల్లీలో పాకిస్తాన్ అగ్ర దౌత్యవేత్తగా ఆయన సేవలందించారు.ఇదిలా ఉండగా,

పాకిస్తాన్ ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌తో ఒక బహిరంగ యుద్ధంలో నిమగ్నమై ఉంది. ఇటీవల కాబూల్‌లోని మాదకద్రవ్యాల బానిసల పునరావాస ఆసుపత్రిపై అది దాడికి పాల్పడి, 400 మందికి పైగా ప్రాణాలను బలిగొంది..

# జమ్మూలో ఆందోళన

జమ్మూ వర్సిటీ ఎదుట ఈ రోజు ( ఆదివారం) ఏబీవీపీ విద్యార్థి నాయకులు నిరసన చేపట్టారు. పీజీ పొలిటికల్ సైన్స్ సిలబస్‌లో పాకిస్థాన్ నాయకుడు మహ్మద్ ఆలీ జిన్నా పాఠ్యాంశాన్ని చేర్చడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చాప్టర్‌ని వెంటనే తొలిగించాలని లేనిచో ఆందోళన మరింతగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.జమ్మూ విశ్వవిద్యాలయం లోని రాజనీతి శాస్త్ర విభాగం 2026-2028 విద్యా సంవత్సరానికి గాను విడుదల చేసన సిలబస్‌లో 'ఆధునిక భారత రాజకీయ ఆలోచన' అనే శీర్షిక కింద, సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, మహమ్మద్ అలీ జిన్నాలతో సహా కొంతమంది వ్యక్తులను మైనారిటీ వర్గాల ప్రతినిధులుగా చిత్రీకరిస్తున్నారు. దేశ విభజనలో పాత్ర పోషించి, ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వ్యక్తులు వీరే. వీరి గురించి బోధించడం ఆందోళన కలిగిస్తోంది'. అని ఏబీవీపీ నాయకులు తెలిపారు.పాఠ్యప్రణాళికలో మైనారిటీలకు ప్రాతినిధ్యం కల్పించాలంటే, దేశ విభజనతో సంబంధం ఉన్న




వారిని కాకుండా, మైనారిటీల కోసం వ్యక్తులను చేర్చాలని వారినే చేర్చితే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. అంతేగాని దేశ విభజనకు కారణమైన వారి గురించి చదవాల్సిన అవసరం లేదన్నారు. పాఠ్యాంశాన్ని తక్షణమే తొలగించకపోతే నిరసనలు మరింత ఉద్రిక్తం చేస్తామని తెలిపారు. అయితే దీనిపై పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి బల్జిత్ సింగ్ మాన్ స్పందించారు" జిన్నా మరియు ఇతర మేధావులను చేర్చడం పూర్తిగా విద్యాపరమైనదేనని, ఇది దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్న పాఠ్యప్రణాళికలకు, అలాగే యూజీసీ నిబంధనలకు అనుగుణంగానే ఉందని" తెలిపారు. విశ్వవిద్యాలయం ఏ భావజాలాన్నీ ప్రోత్సహించదని, కానీ విమర్శనాత్మకతకు వీలు కల్పించేందుకు భిన్నమైన దృక్కోణాలను విద్యార్థులకు అందిస్తుందన్నారు. మంచి చెడులను అంచనా వేసి, ఏది సరైనదో ఏది తప్పో విచక్షణ కలిగేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు.

# ఉష
వుదయం సాహిత్యం

## భారతీయ కవిత

### వాడకం

ఇంట్లో నీడలో వున్న ఈ కట్టెల మోపుల్ని
ఎవరో బయటికేసారు
ఎండబెట్టడానికి –

ఎప్పటిలాగే
మోపులని విప్పి కట్టెలను తీసి
ఎడం ఎడంగా పరిచారు బాగా ఎండడానికి –
పొద్దెక్కుతూంటే
విడివిడిగా వున్న ఆ కట్టెలు ఎండుతున్నాయి
సూర్యుడి దయలేని తీక్షణ కిరణాల చూపులకు
వాటి బెరడు బాగా పూడి వస్తున్నది

మామూలుగానే నిర్విశేషంగా
మళ్ళీ రాత్రి భోజనానికి వేళయింది



ఎండిన కట్టెలను
బయట నుంచి
లోపలికి తెచ్చారు వాడ
కానికి –
పొయ్యిలో వాటిని వేసి
కొంచెం కిరసనాయిలు
పోసి
అగ్గిపుల్ల వెలిగించారు
కట్టెలు మండుతూ
మెల్ల మెల్లగా బూడిదయ్యాయి
వాటి వంతు అయిపోయింది

ఇంట్లో ఓ మూలన ఇంకొన్ని పచ్చి కట్టెల మోపులు
పడి వున్నాయి వాటి వాడకం మరొక రోజున

అస్సామీ మూలం: అభిజీత్ గోగోయ్
ఆంగ్లానువాదం: విభీష్ చౌధరీ
తెలుగు సేత: దర్భశయనం శ్రీనివాసాచార్య

### పునర్జీవనం

ఒంటరి చీకటి
గొయ్యారం లోంచి
సమూహ మైదానం
లోకి
శ్వాసలు పురివిప్పి,
సీతాకోక చిలుకలై
నిరాసక్తులు ఆసక్తుల
వికాసాల దిశగా
భీతిల్లిన కాలమూ,

నన్ను నేను ఓదార్చు
కోలేని నిస్సహాయతల
ఘడియలూ
నా వొంటి నీడలో
దూరటానికి
భయభ్రాంతుల్లో
దూరంగా

ఆలోచన కొస వొకటి
మెరిసి, పుట్ట
మెరుపులు అంటుకొని

సంతోషపు జ్యోతుల్లో
దేహ మునిగిలి

వర్ష చినుకో శీతల
వాయువో గ్రీష్మ
ఊష్ణమో
భళ్ళు భళ్ళున, తడిపి
తడిపి
వొద్దికగా
తీర్చిదిద్దిన
సాకారుణ్ణి
దూసుకొచ్చే
ఆయుధాలన్నీ
తిరోగమనం వైపుకే
నా వద్ద ప్రశ్న ఉన్నయి
ఎల్లలు లేని కూడలిలో
నిల్చున్నా
ఎదుర్కొనేందుకు
సాహసం చాలదు

దాసరాజు రామారావు




విశ్లేషణాత్మక

# కథన చాతుర్యం

మనలోకి మనం ప్రవేశించి అంతర్మథనం చెందుతాం. మనల్ని మనం సానపెట్టుకుంటుంటాం. సమాజాన్ని చూస్తూ ఆవేదన చెందుతాం. ప్రతీ సంఘటన తోనూ మమేకం చెందుతూనే ఉంటాం. అయినా మనసులోనికి వచ్చిన భావాల్ని బయట పెట్టడానికి ధైర్యం చాలక తెరలు కట్టుకుంటూ వాటివెనకే ఉండిపోతాం. ఇది చాలామందిలో జరిగే విషయమే. కాని–అదిగో అలాంటి తెరలు తొలగించకుండానే పాఠకుల్నే మనసు లోకి రప్పించుకొని తెరల వెనక మర్మాన్ని విప్పిచూపి ఆలోచింపజేసే కథలు అరుణ పప్పు రాసిన 'చందనపు బొమ్మ' సంపుటిలోని కథలు.

నేటి యువతరం రచయితలకు వారి కల్పనలనూ, ఆలోచనల్నీ మరింత పదునుపెట్టి సాంకేతికంగా, భావ పరంగా, శిల్పపరంగా రచనలు చేసేందుకు ఈ నాడు అనేక సౌలభ్యాలు ఉన్నాయి. చాలావరకూ ఇప్పటి రచయితలు అందరూ మంచి విద్యావంతులు కావటాన తెలుగే కాకుండా వివిధ దేశాలలోనూ, ప్రాంతాల లోనూ ఉన్న సాహిత్యాన్ని పుడిసెట పట్టి అందులోని లోతుపాతులు దర్శించే అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. అందుచేత వారు తీసుకుంటున్న అంశాలు గానీ, సంఘటనలు గానీ, రచనల్లో దృశ్యమానం చేసే విధానంలోగానీ ఆధునికత ఎక్కువగా ఉంటుంది. మొదటితరం రచయితలు కన్నా రెండోతరం రచయితల నుండీ కూడా కొంతమంది ఆంగ్ల భాషాసాహిత్యం బాగా చదివి, వాటి ప్రభావంతో రచనలు చేసేవాళ్లు ఉంటూనే ఉన్నారు. కానీ వారి సంఖ్య తక్కువే. చాలా వరకూ తెలుగులోనే ప్రాచీనసాహిత్యం మొదలుకొని అనేకానేక రచనలు చదివి భాషా పటిమసాధించిన వాళ్లూ ఇతరేతర భాషాసాహిత్య అనువాదాలు కూడా ప్రాచుర్యంలో ఉండటంతో వాటిని కూడా చదివి దేశీయ అంశాలతో విభిన్నత సాధించిన వాళ్లూ తక్కువేమీ కాదు. తమకి తెలియని జనజీవితాన్ని కానీ, వాతావరణాన్ని గానీ రచనలలోకి చొప్పించేసాహసం చేసేవారూ అతి తక్కువగానే ఉండేవారు. అందుబాటు లోని గ్రంథాలల్లోని పుస్తకాలను చదివి తమంతటతామే పరిసరాల లోని ప్రజల జీవితాలలోకి మాత్రమే ఆలోచనల్ని చొప్పించి, తమకి తామే భాషనీ, శైలినీ చెక్కుకొని రచనలు కొనసాగించిన వాళ్లే ఎక్కువగా ఉండేవారు. కానీ నేడు సాహిత్యరంగంలోని యువరచయితలు వారి రచనలలో అంశాలు దేశీయమే అయినా రాసే విధానంలో మాత్రం సాంకేతికపరంగా అత్యాధునికంగా రాస్తున్నారు. అందులోనూ విదేశాలకి వెళ్లివచ్చిన అనుభవం ఉన్నవారు రాస్తున్న రచనలు మరింత నవీనతని సంతరించుకుంటున్నాయి. అంతేకాక అంతర్జాల శోధనతో మారుమూల ప్రజాజీవనాన్ని కూడా దర్శించగలుగుతున్నారు. అదే కోవకు చెందిన అరుణ పప్పు కూడా విద్యావంతురాలు. గణితంలో మాష్టరు డిగ్రీ తీసుకొని కూడా జర్నలిస్టుగా స్థిరపడింది. అమరసింహుడి అమరకోశమూ తెలుసు, నన్నయ్య, పెద్దనల నుండి శ్రీశ్రీ వరకూ, శ్రీపాదా, మల్లాది నుండి నేటి పతంజలినీ చదివింది ఈ రచయిత్రి. జర్నలిస్టుగా పనిచేసిన అనుభవాలనుండి గాఢమైన అభివ్యక్తితో అనేక కథల్లో పాత్రలని జర్నలిస్టుగానే చిత్రించింది. అందులోనివే రెండు కథలు "ఎవరికి తెలియని కథలి విలే" "24/7 క్రైమ్", ట్రావెల్ జర్నలిస్టుగా "భ్రమణ కాంక్ష" లోనే కాకుండా మిగతా కథల్లో చాలావరకూ సాహిత్యస్పర్శ ఉండటం ఒక విశేషం. ఆమే చెప్పుకొన్నట్లు పాత్రికేయం అంటే ఇష్టంతో దాన్నే వృత్తిగా తీసుకున్నానని చెప్పటాన్ని బట్టే రచయిత్రికి గల అంకిత భావం ఆమె కథల్లో ప్రతిబింబిస్తున్నది. అంతేకాకుండా "చదువొక వ్యసనం, అక్షరం కనిపించటమే ఆలస్యం. చదువుతుంటాను. మంచి వచనానికి కవితాత్మకమైన పంక్తులకూ త్వరగా ఆకర్షితమౌతా"నని రచయిత్రి అనటం వల్లనేనేమో ఆమె కథలన్నీ సాహిత్యవ్యాసంగం చుట్టూనే అల్లుకొన్నవిగా ఉంటాయి. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన ఛానల్స్ పదేపదే ఒకే దశ్యాన్నే చూపటంహింసకి సంబంధించిన వార్తని మరింతగా ఫోకస్ చేయటం, రేటింగుల కోసం సంచలన వార్తల కోసం వెతుక్కోవటం వీటన్నింటినీ నిర్ద్వంద్వంగా ఖండిస్తూ పదునుగా రాసిన వ్యంగ్యరచన 'వర్డ్ కేన్సర్' కథ. గుండెని ద్రవింపజేస్తూ ఆ పాత్రచేస్తున్న పని సమంజసమేనా, మంచిదా, చెడ్డదా అనే ద్వైధీభావాన్ని కలిగిస్తూనే ఆలోచింపజేసిన కథ 'ఈ కానుకనివ్వలేను'. ఇందులో అమెరికాలో నివసిస్తున్న శాండిల్య మానవీయ దృక్పథంతో అమెరికాలో ప్రమాదవశాత్తూ మరణించిన వ్యక్తుల భౌతిక శరీరాల్ని వారి వారి కుటుంబాలకు అందజేసే ప్రక్రియని వేగవంతం చేయటానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంటాడు. తర్వాత ఆ కుటుంబాలలోని వారిని ఫోను ద్వారా పలకరించిన పుడు "మీరు ఎలా ఉన్నారని అడిగినప్పుడల్లా నాకు మీరు మా అబ్బాయి శరీరాన్ని జాగ్రత్తగా పంపారన్నది గుర్తుకువస్తుంది అంతే ఏడుపు తప్ప మరేం ఉండదు అందుకే మీరు మరెప్పుడూ ఫోను చెయ్యకండి" అంటాడు. ఇటీవల వారానికి కనీసం ఒకటైనా ఇటువంటి వార్తలు వింటూనే ఉంటాం. ఎన్నో ఆశలతో డాలరు కలల్ని సాకారం చేసుకోవాలని వెళ్లినవారు ఈ విధంగా పేకేజీలలో తిరిగి రావటాన్ని, ఆ కుటుంబ దుఃఖాన్ని, చితికిన కలల్నీ దృశ్యమానం చెయ్యటాన్ని ఈ రచయిత్రి ప్రతిభావంతంగా అక్షరీకరించింది.

మరో అద్భుతమైన కథ 'పోయిన సైకత శిల్పం' నిజానికి పుస్తకాలషాపు యజమానే అయిన ఆచార్య ఎవరికి ఏ పుస్తకం కావాలన్నా నిమిషాలలో తీసి అందిస్తాడు. ఎవరైనా ఒక పుస్తకం అడగ్గానే దాని తర్వాత చదవటానికి ఏ పుస్తకం అడుగుతారో ఊహించి చెప్పగలిగేవాడు. ఒక వ్యక్తి చేతిలోఉన్న పుస్తకాన్ని బట్టి వారి ఇష్టాయిష్టాలు అంచనా వేయగలిగే వ్యక్తి ఆచార్య.

అటువంటి ఆ పుస్తకాల షాపునిరోడ్డు వెడల్పు చేయటానికి అడ్డంగా ఉందని తాఖీదు వస్తుంది. ఆ షాపు మూత పడుతోందనే వార్తాకథనాన్ని పత్రికలో చూసి షాపుతో అనుబంధం ఉన్న వాళ్లంతా వస్తారు. అడిగినవాళ్లకి కావలసిన పుస్తకాల్ని పంచిపెట్టేస్తాడు ఆచార్య. దాంతో అనుబంధం ఉన్న కథానాయిక ఉద్యోగరీత్యా విదేశాలలో తిరుగుతూ కరాచీలోని పుస్తకాల ఎక్స్పో కోసం వస్తుంది. అక్కడ అనుకోకుండా జీవచ్ఛవంగా, మౌనమూర్తిగా మారిన ఆచార్యని కొడుకు చేయి పట్టి నడిపించుకు తిరుగుతూ కనిపిస్తాడు. తండ్రి గురించి చెబుతూ టేబులు మీది పుస్తకాలను తడుముతున్నప్పుడు ఆ పుస్తకాల వాసన ఆయనకి గుర్తొస్తుందన్నది నిజం. అందుకే ఆయన ముఖంలో వెలుగు కోసమని ఇటువంటి ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్కి తీసుకొస్తుంటానని చెబుతాడు. కొడుకు ఆసరాలో పసి పిల్లాడిలా అడుగులో అడుగేస్తూ వెళ్తున్న ఆచార్యని చూస్తుంటే ఒక అద్భుతమైన సైకత శిల్పం జారిపోతున్నప్పుడు చూస్తున్న బెంగ కలుగుతుందని ముగించిన ఈ కథ సాహిత్యంలో పుస్తకాలతో అనుబంధం ఉన్న వారందర్నీ కదిలిస్తుంది. ఇంత ప్రాణప్రదంగా చూసుకునే పుస్తకాలు రానురానూ ఏమై పోతాయోననే భావం కలుగుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో జరుగుతున్న మార్పులలో ప్రింటు మీడియాగావున్న పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గిపోతుంది. రోడ్డుప్రక్కల తక్కువధరలో అందుబాటులో ఉండే పుస్తకాల షాపులు అనేకం మాయమైపోతున్నాయి. ఈ కథారచనలో ప్రతీ వాక్యంలోనూ రచయిత్రికి సాహిత్యం మీద గల మక్కువ, పుస్తకాలతో గల మైత్రీ, ఆసక్తీ ప్రస్ఫుటమౌతూ ఉంటాయి. అక్షరాల్ని అక్కున చేర్చుకున్న వారందరికీ కూడా సైకతశిల్పంలా కరిగిపోతున్న అక్షరాలు కళ్లలో కదులుతాయి. నట్టింట్లోకి వచ్చేసిన రంగుల పెట్టి వెదజల్లుతున్న వ్యాపార సంస్కృతి మూలంగా స్త్రీపురుషులు ఇద్దరిలోనూ సౌందర్యకాంక్ష పెరిగిపోతోంది. అన్ని వయసుల వారినీ ఉక్కిరిబిక్కిరి చేస్తోన్న ఈ సమయంలో ప్రత్యేకించి ఆలోచించవలసిన కథ. తెల్లారి లేస్తే ప్రసారమాధ్యమాలలో హోరెత్తించే ప్రకటనలు రంగు తక్కువగా ఉందని మోడలింగు రంగంలో, ఎయిర్ హోస్టెస్ ఇంటర్వ్యూలలో, కార్పొరేట్ ఉద్యోగాలలోనిరాకరింపబడిన అమ్మాయి ఫలానా క్రీమో, పౌడరో రాసుకుని వెళ్లేసరికి ఆమె ముఖంలోని 'గ్లో' చూసి వెంటనే సెలెక్టు చేస్తారని ఆ ప్రకటనల సారాంశం. అమ్మాయి విజ్ఞానాన్నిగాని, ప్రతిభనిగాని చిన్నచూపు చూసే ప్రకటనలు ఎన్నో! ఇటువంటి ప్రకటనల ప్రభావం ఈ దేశంలో, ముఖ్యంగా ఎక్కువమంది మేనిరంగు తక్కువగా ఉండే దక్షిణాది ఆడపిల్లలపై, మరీ ముఖ్యంగా కొన్ని కులవర్గాల వారిపై వాళ్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అంశం. నలుపుగా ఉన్నందుకు కుటుంబాలలో చీదరింపు ఎదుర్కొన్న అంశంపై కొన్ని సినిమాలు కూడా అందరి కన్నా గుణం మిన్న అని ముగింపుని ఇస్తూ వచ్చాయి. చందనపు బొమ్మకథలో తన తల్లి చిన్నప్పటి చందనపు బొమ్మతో పాప అనుబంధం పెంచుకుంటుంది. బరువుగా నల్లగా, ఆకర్షణలేని ఆ బొమ్మ నుండి మరిపించటానికి తండ్రి ఎన్నెన్నో అందమైన, అధునాతనమైన బొమ్మలు కొంటాడు. కానీ పాప ఆ బొమ్మని వదలదు. పాప స్కూలు నుండి వచ్చేసరికి దాన్ని వాచ్మన్ ఇంట్లో ఇచ్చేస్తాడు. ఆ పాప దిగులుతో మౌనంగా ఉండిపోతుంది. ఆ రాత్రికి ఆ పాపని లాలిస్తూ విరిగిపోయి నల్లగా ఉన్న ఆ బొమ్మని వాచ్మెన్కి ఇచ్చేద్దాం. మంచి బొమ్మలు కొనుక్కుందాం అని మురిపించబోతుంటే ఆ పాప "నాన్నా నాకు ఒక చెయ్యి విరిగిపోతే నన్ను కూడా డస్ట్బిన్లో పడేయటమో లేదా వాచ్మన్కి ఇచ్చేస్తావా" అని అడుగుతుంది. ఆ మాటతో తండ్రి తల్లడిల్లిపోతాడు.

అయితే ఆ పాప కూడా నల్లగా ఉంటుందనే విషయాన్ని కథ మధ్యలో పాప స్కూల్లో డాన్స్ ప్రోగ్రాంలో తనకు నల్లగానే ఉన్న మరో అబ్బాయిని జత చేశారని చెబుతూ "నేను నలుపు కదా అందుకని, ఆ బాబుకి డాన్సు రాకపోయినా నల్లగా ఉంటాడని నాకు పార్టనర్గా చేశారని అంటుంది. ఈ విషయం కూడా ప్రత్యేకించి ప్రస్తావించుకోవలసినదే. కొన్ని స్కూళ్లలో అందంగా తెల్లగా కనిపించే పిల్లల్నే ప్రోగ్రాములకు ఎంపికచేసి, రంగు తక్కువ ఉన్న పిల్లల్ని ఆసక్తీ, ప్రతిభా ఉన్నా సరే న్యూనత పరచే విధానంకూడా ఉంటుంది. ఆ విషయాన్ని కూడా చెప్పకనే చెప్పింది రచయిత్రి. కొన్ని కులాల్ని పట్టి చూపించే ఈ మేనిరంగు వ్యవహారం ప్రస్తుత సమాజంలో వివక్షతల్ని పెంచటం అనివార్యంగానే ఉంది. పసివాళ్లపై పెనుప్రభావం చూపే ఈ అంశాల్ని తీసుకొని సమర్థంగా రాయటమే కాకుండా ఈ పేరుతోనే సంపుటిని తేవటం రచయిత్రికి ఈ కథ పట్ల గల ప్రత్యేక శ్రద్ధకి తార్కాణం. అతి సున్నితమైన అంశంతో కథని నడిపి, కేంద్రబిందువుగా చందనపు బొమ్మనే ప్రతీకగా తీసుకొని రాసిన విధానంలో అరుణపప్పుకు తాను రాయదలచుకున్న అంశం మీద గల అవగాహనా, ఎట్లా కథను మొదలు పెట్టాలి, ఎలా ముగించాలి అనే విషయం మీద గల స్పష్టత వ్యక్తమౌతుంది. దేశవిదేశాలలోని వింతలూ, విశేషాలూ స్వయంగా తిరిగి తెలుసుకోవాలనే 'భ్రమర కాంక్ష'ని సాకారం చేసుకోలేని అశక్తతను కంప్యూటర్ద్వారా కూలంకషంగా తెలుసుకొని అవన్నీ తిరిగి చూసిన అనుభూతిని పొందడమేకాక టూర్లకి వెళ్లేవారికి తగు సూచనలు ఇచ్చే వ్యక్తి గురించిన కథ అయినా, తల్లి పట్టించుకోక విడిచిపెట్టి వెళ్లిన మానసిక వైకల్యం గల పసివాడికి తల్లిగా వుండదలచిన యువతికథ అయినా ఒక నిబద్ధతతో చెప్పదలచుకొన్న అంశం మీద సంపూర్ణమైన అవగాహనతో కథను రాయటం అరుణ పప్పు రచనా విధానం.

'వాక్యమంటే వాన విల్లు మీద నడిచి, మేఘాలలో తేలినట్లుండాలి. కాలిగ్రఫీ చిత్రాల్లా కళ్లకు కట్టాలి' అని చెప్పే అరుణ పప్పు తాను కథ రాస్తున్నప్పుడు ఆ విధానాన్నే అనుసరిస్తుంది అనేది ఆమె కథలు చదివితే అర్థమౌతుంది. పది కథలతో కూడినదే అయినా అరుణ పప్పు కథలసంపుటి 'చందనపు బొమ్మ'లో అనేకానేక సమస్యలు, సంఘర్షణలూ మానసిక విశ్లేషణ, మనిషిని సందిగ్ధంలో పడేసే నవీనత, ఆధ్యాత్మికత, వ్యాపార సంస్కృతి ఇలా ఎన్నెన్నో సమస్యల గూర్చి చర్చకు పెట్టి అధ్యయనం చేసినట్లుగా ప్రతీ కథా పాఠకులను పదేపదే ఆలోచనల్లోకి నెట్టేస్తూ ఉంటుంది.

కథలన్నింటా సంభాషణల కంటే విశ్లేషణే ఎక్కువగా ఉంటుంది. అవి మానవత్వం విలువల గురించి కావచ్చు, మనస్తత్వ శాస్త్రం గురించి కావచ్చు, చాలా చోట్ల రచయిత్రి కథలోకి వచ్చి మనతో విశ్లేషిస్తున్నట్లుగా ఉంటాయి. నిజానికి కథలో రచయిత చొరబాటు ఉంటే కథని పాఠకుడికి ఒలిచి చేతిలో పెట్టినట్లుగా ఉంటాయి. కానీ ఈ రచయిత్రి అందుకు కూడా అవకాశం ఇవ్వదు. చెప్పీచెప్పక, విప్పీవిప్పక ఒక ఆవరణాన్ని సృజించి పాఠకుడి ముందు పెడుతుంది. తప్పని సరిగా పాఠకుడు ఆ ఆవరణలోనికి ప్రవేశించి నిజానిజాల్ని పరిస్థితుల్ని అవగాహన చేసుకోక తప్పదు.

ఇంతమంచి కథలు అల్లగలిగే నేర్పు ఉన్న అరుణ పప్పు ఎందువల్లనో తర్వాత కథ లెక్కువ రాసినట్లు లేదు. 'అరుణిమ' అనే ఈమె బ్లాగులో కూడా ఇవే కథలు ఉన్నాయి. సాహిత్యసృజనకు విరామాన్ని ప్రకటించక మరిన్ని రచనలు చేసి పాఠకులకు అందించాల్సిన అవసరం ఉంది. నేడు తెలుగు సాహిత్యం బీటలు వారి వైభవం కోల్పోతుందేమో నన్న భావనకు స్వస్తి చెప్పేందుకు ఇటువంటి యువతరం రచయితలు రంగంలోకి రావాలి. ఆ కొరత తీరుస్తుందని అరుణ పప్పు మరిన్ని కథలతో రావాలని కోరుకుందాం.


శీలా సుభద్రాదేవి
8106883099

### లోకల్... లోకల్

టమాటలు టమాటలు
లోకల్ లోకల్
తీసుకొండి లోకల్
టమాటలు అగ్గువ

రైతు వనితల గలగల
మాటల ధ్వనులు

ఆత్రంగా కూరగాయలు
అమ్ముటకు ఒర్లుడు

లోకల్ లోకల్...పదమే
గట్టిగా ధ్వనిస్తుంది

గ్లోబల్ బ్రాండింగ్
వ్యాపారపు ఈరోజుల్లో

లోకల్ అన్న శబ్దమే
సింగారమై వినిపిస్తుంది

పల్లెల్లోకీ చొచ్చుకొచ్చిన
ప్రపంచీకరణ వేర్లు

స్థానియతా పైరు పంటల
వేర్లు తెర్లు తెర్లు

జానెడు బెత్తెడు కాయాల్సిన
బీరకాయలు

పొట్లకాయలంత పొడుగు
పొడుగు పెరుగుట

టమాటాలు మిరపకాయలు
వంకాయలు
అరొక్క కాయగూరల పండ్ల
రుచులే కావు
హైబ్రిడ్ ఆహారాలన్నీ
సై లేని బెండ్లు బెండ్లు

గ్లోబల్ సంస్కృతిలో
ప్రాదేశికత మాయమై

అంతర్జాతీయ వాణిజ్య
వంగడం మోపైయింది.


అన్నవరం దేవేందర్
9440763479

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామా జిక, సాంస్కృతిక తదితర రంగా లపై వ్యాసా లను, సంపాదక లేఖ లను పంపించవలసిందిగా కోరు తున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
: www.voodayam.com,
Editor : 9247698676

# సాహిత్యమే వ్యక్తిత్వం వ్యక్తిత్వమే సాహిత్యం



తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని, వేలాది ఎకరాలు పేదలకు పంచేందుకు కృషి చేసిన యోధుడి కుమారుడాయన. పోరాట దళాలు ఎప్పుడు ఇంటికొచ్చినా శ్రమకోర్చి కడుపు నిండా అన్నం పెట్టిన మాతృమూర్తి తనయుడాయన. అంత గొప్ప తల్లిదండ్రుల నుండి పొందిన వారసత్వం వల్లే తెలంగాణ ఉద్యమానికి తన ఉపన్యాసాల ద్వారా, సాహిత్యం ద్వారా జీవం పోశారాయన. తల్లిదండ్రుల నుండి పుణికి పుచ్చుకున్న నిజాయితీ, ముక్కుసూటితనం, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడం, నిబద్ధత వంటి లక్షణాల వల్లే అనంతర కాలంలో ప్రభుత్వం అందజూపిన కోటి రూపాయల నగదును, కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని తృణప్రాయంగా భావించి వదులుకున్నారాయన. తెలంగాణ ఉద్యమ కార్యాచరణకు కళాశాల ప్రిన్సిపాల్ గా పదోన్నతి ప్రతిబంధకంగా భావించడం వల్ల ఆ పదోన్నతిని కూడా వదులుకున్న ఆ సుప్రసిద్ధ సాహితీవేత్త డా.నందిని సిధారెడ్డి. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికైన డా. నందిని సిధారెడ్డి స్వస్థలం సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని బందారం. మాతామహుల గ్రామమైన అదే జిల్లాలోని మండల కేంద్రం ధూల్ మిట్టలో బాల సిద్ధారెడ్డి, రత్నమ్మ దంపతులకు 1955 జూన్ 12 వ తేదీన సిధారెడ్డి జన్మించారు. అయితే పాఠశాలలో జాయిన్ అయ్యే సమయంలో ఒక అంచనా ప్రకారం వేసిన 1954 మే 2వ తేదీ ఆయన పుట్టినరోజుగా అధికారిక రికార్డుల్లో నమోదైంది. ప్రాథమిక దశలో స్వగ్రామమైన బందారం గ్రామంలోనే ఆయన విద్యాభ్యాసం సాగింది. ఆ తర్వాత వెల్కటూరులోని ఉన్నతపాఠశాలలో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు చదవడం సిధారెడ్డి జీవితాన్ని మలుపు తిప్పింది. సిధారెడ్డి తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ప్రముఖ కవి అష్టకాల నరసింహరామ శర్మ ఆ పాఠశాలకు తెలుగు పండితునిగా వచ్చారు. అప్పటికే 'శిథిల విపంచి' ఖండకావ్యాన్ని నరసింహరామ శర్మ ప్రచురించి ఉండడంతో ఆ గ్రంథాన్ని చదివే అవకాశం సిధారెడ్డికి లభించింది. ఆ గ్రంథం సిధారెడ్డికి సాహిత్యంపై అనురక్తిని ఏర్పరచింది. దాంతో ఛందస్సులో పద్యాలు రాయడం మొదలుపెట్టారు సిధారెడ్డి. ఉస్మానియా విశ్వవిద్యాలయ సాహిత్య మిత్రుల సహకారంతో సిధారెడ్డి 1979లో 'ఉస్మానియా రైటర్స్ సర్కిల్' ను ఏర్పాటు చేశారు. ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా. నాళేశ్వరం శంకరం, వసంతరావు దేశ్ పాండే తదితరులు ఆ రోజుల్లో 'ఉస్మానియా రైటర్స్ సర్కిల్' కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆ సంస్థ రెగ్యులర్ గా నిర్వహించే సాహిత్య కార్యక్రమాలతో పాటు విద్యార్థి ఉద్యమాల్లోనూ సిధారెడ్డి చురుకుగా పాల్గొన్నారు. వామపక్ష విద్యార్థి సంఘ భావజాలం వైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి ఉద్యమాల్లో సైతం చురుకుగా ఉన్నా సిధారెడ్డి అధ్యయనాన్ని వీడలేదు. చదువుపై దృష్టి అలాగే కొనసాగింది. ఆచార్య సి. నారాయణరెడ్డి పర్యవేక్షణలో 'ఆధునిక తెలుగు కవిత్వంలో సూర్యుడు' అనే అంశంపై 1981లో ఎం.ఫిల్. చేశారు. ఆయన మార్గదర్శకత్వంలోనే 'ఆధునిక తెలుగు కవిత్వం– వాస్తవికత, అధివాస్తవికత' అనే అంశంపై 1986లో డాక్టరేటు పట్టా అందుకున్నారు. సామాజిక పరిస్థితులపై స్పందన, ప్రజల కష్టాలపై ఆవేదన సిధారెడ్డి ప్రతి రచనలోనూ స్పష్టంగా కనిపిస్తాయి. తొలి కవితా సంపుటి 'భూమి స్వప్నం'ను 1987లో వెలువరించారు. అనంతరం 'సంభాషణ', 'ప్రాణహిత', 'ఒక బాధగాదు', 'ఇక్కడి చెట్ల గాలి' తదితర కవితా సంపుటాలను; 'నాగేటి చాల్లల్ల' పాటల సంపుటిని వెలువరించారు. 'ఇగురం', 'ఆవర్తనం', 'తెలంగాణ కులవృత్తుల సాహిత్యం' తదితర సాహిత్య వ్యాససంపుటాలను ప్రచురించారు. ఎన్నో చక్కటి కథలను అందించిన సిధారెడ్డి తన తొలి కథ 'ఎర'ను 1976లో రాశారు. ఆ తర్వాత 'షావుకారు కుక్క', 'బతికిన చావు', 'పాముల మధ్య చీమ', 'చిత్రకన్ను', 'పుల్లర', 'కులకశ్చి', 'ఖైదీ', 'నాదానీ' మొదలైన 20 దాకా కథలను రచించారు. 1978లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక, జ్యోతి మాస పత్రిక నిర్వహించిన రెండు వేర్వేరు కథల పోటీల్లో నందిని సిధారెడ్డి రాసిన కథలు బహుమతి పొందాయి. వివిధ పత్రికలకు వందల కొద్ది వ్యాసాలు, సంపాదకీయాలు రాశారు సిధారెడ్డి. వందల కొద్ది గ్రంథాలకు పీఠికలు రాసి, రచయితలకు ప్రేరణగా నిలిచారు. సాహిత్య రంగంలో సిధారెడ్డి కృషికి గుర్తింపుగా ఆకాశవాణి ఈ ఏడాది జాతీయ తెలుగు కవిగా గౌరవించింది. ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనం కోసం ఆయన రచించిన 'మెర్సీ వాల్' కవిత 22 భారతీయ భాషలలోకి తర్జుమా అయింది. తెలంగాణ ఉద్యమానికి తన పాటల ద్వారా, ఉపన్యాసాల ద్వారా శ్వాసగా నిలిచారు సిధారెడ్డి. ఆయన రచించిన 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ' పాట తెలంగాణ ఉద్యమంలో గడప గడపలో సంచలనం సృష్టించింది. ప్రజలను ఉద్యమం వైపు నడిపించింది. 'వీర తెలంగాణ' సినిమాతో ఈ పాట నందిని సిధారెడ్డికి నంది పురస్కారాన్ని అందించింది. 'జై బోలో తెలంగాణ చిత్రం కోసం సిధారెడ్డి రాసిన 'ఒక పువ్వు– ఒక నవ్వు' పాట నందిని సిధారెడ్డికి సినీ గేయ కవిగా మంచి పేరు తెచ్చిపెట్టింది. తెలంగాణ ఉద్యమంలో అమరులైనవారిని కీర్తిస్తూ సిధారెడ్డి రాసిన మరో పాట 'అమరులకు జోహర్లు' కూడా ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్ళింది. సాహిత్యరంగంలో నిర్విరామ కృషి చేస్తున్న నందిని సిధారెడ్డి ఎన్నో పురస్కారాలు, గౌరవాలు, సత్కారాలు పొందారు. నంది అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం, ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ స్మారక పురస్కారం, రొట్టమాకు రేవు కవితాపురస్కారం, ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, బి.ఎన్. సాహితీ పురస్కారం మొదలైన పురస్కారాలు స్వీకరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ 2025 సంవత్సరానికి పురస్కారాన్ని ఆయనకు అందజేయనున్నట్టు ప్రకటించింది. ఆయన వ్యక్తిత్వంలోని నిబద్ధత, నిజాయితీల వల్ల తృణప్రాయంగా భావించి పురస్కారాలను తిరస్కరించిన సందర్భాలు కూడా ఉన్నాయి. 2001లో అప్పటి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా తెలుగు విశ్వవిద్యాలయ ఉత్తమ కవితా పురస్కారాన్ని తిరస్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వజూపిన కోటి రూపాయల నగదును, కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాన్ని తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చినందుకు నిరసనగా తృణీకరించారు. ఉద్యమ ప్రయోజనాల దృష్ట్యా ప్రిన్సిపాల్ పదోన్నతిని నిరాకరించారు. ఇవన్నీ తెలంగాణ విషయంలో, ప్రజల సమస్యల విషయంలో ఆయన నిబద్ధతను తెలియజెప్పేవే. ఉద్యమకారుడిగా, పరిశోధకుడిగా, సాహిత్య సంస్థల వ్యవస్థాపకుడిగా, కథకుడిగా, కవిగా, సినీగేయ రచయితగా, సంపాదకుడిగా, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడిగా నందిని సిధారెడ్డి ప్రస్థానం బహుముఖీనం. విలువల విషయంలో ఏమాత్రం రాజీపడని నిజాయితీ ఆయన సొంతం. సాహిత్యానికి, వ్యక్తిత్వానికి భేదం లేని, నిబద్ధత కలిగిన సాహితీవేత్తగా ఆయన స్థానం తెలుగు సాహిత్యంలో సుస్థిరం.

> తెలంగాణ ఉద్యమానికి తన పాటల ద్వారా, ఉపన్యాసాల ద్వారా శ్వాసగా నిలిచారు సిధారెడ్డి. ఆయన రచించిన 'నాగేటి చాల్లల్ల నా తెలంగాణ' పాట తెలంగాణ ఉద్యమంలో గడప గడపలో సంచలనం సృష్టించింది. ప్రజలను ఉద్యమం వైపు నడిపించింది. 'వీర తెలంగాణ' సినిమాతో ఈ పాట నందిని సిధారెడ్డికి నంది పురస్కారాన్ని అందించింది. 'జై బోలో తెలంగాణ చిత్రం కోసం సిధారెడ్డి రాసిన 'ఒక పువ్వు– ఒక నవ్వు' పాట నందిని సిధారెడ్డికి సినీ గేయ కవిగా మంచి పేరు తెచ్చిపెట్టింది. తెలంగాణ ఉద్యమంలో అమరులైనవారిని కీర్తిస్తూ సిధారెడ్డి రాసిన మరో పాట 'అమరులకు జోహర్లు' కూడా ప్రజాబాహుళ్యంలోకి విస్తృతంగా వెళ్ళింది.


డా. రాయారావు
సూర్యప్రకాశ్ రావు
9441046839

# బిలహరి రాగం

అది మారెల్లాగు
మా ఊరికి వాయువ్యారణ్యం
తోడేళ్లకు నిత్యనివాసం–

నడి ఎండాకాలం
ఒక్కణ్ణే ఉన్నాను గొర్లెమ్మటి
చిప్పగొడ్డలి ఒక్కటే
ధైర్యంగల పెద్దతోడు–

వారం కింద కురిసింది పెద్దవాన
వెన్నెల నక్షత్రాల సాక్షిగా వాగుల
న్నిట్లో
తొల్త ప్రవహించింది ఈ వాగే
ఇక్కడి స్టైలోగడ్డి మొలక
జీవాలకు పౌష్టికాహారం–

నేలకు ప్రణమిల్లుతున్న విల్లుల్లా ఉన్నె
మేతకు వంగిన గొర్లవీపులు
వింటిని వీడిన బాణాల్లా గంతులే
స్తున్నె
తల్లుల పక్కన పిల్లజీవాలు–

ఎందరు ఎన్ని పోలికలు చెప్పినా
తోడేళ్లే మంచి ఉపమానం నా
భయానికి
నీడకు చేరదీసి చెట్లు
తలమీద అనురాగం నిమారినా
వెదురుపొదలే గొప్ప స్నేహితులు
నా రాగాల కొత్తప్రపంచానికి–

నేను గొర్ల వెనకాల
నా వెనకాల గొర్లు
అదో చక్రీయ సేనాధిపత్యం–

గొర్లు మేసేది పిల్లలకు పొదుగివ్వడం
కోసమే
తోడేళ్లది మాంసాభీష్టం
నాలో రాజుకున్నది బిలహరి రాగం
తంబుర వయోలిన్ మృదంగం
కంజీర అన్నీ గొర్లే–

గొర్లకు తెలివెక్కడిది
నేర్పినోడెవడు
కాపరికే లేనపుడు
తెలివి యాణ్ణుంచొస్తది
వాటి ఎడ్డిముఖాలకు–

తలొంచుకొని మేస్తున్నయి
జ్యామితి రూపాల్లో నలుమూలలు
విస్తరిస్తూ
మారెల్లాగు కలయతిరుగుతూ
అందంగా ఎర్రెర్రని గొర్లు–

పట్నాల్లో పెద్దోల్లది
అడవిలో మృగాలది
తెలివి
బీడులో గొర్లది నాది
ఎరుక–

ఎరుకంటే
ఉపకారం ఉత్పత్తి
సేవ
తెలివంటేలాభం
వ్యాపారం,పెట్టు
బడి–



అదును చూసి
వ్యాపారి
అమాయక పల్లెజ
నాల మీద పడ్డట్టు
మిట్టమధ్యాహ్నం తోడేలు
మందల జొరబడ్డది–

Prey drive మొదలైంది
భయం మట్టడించింది గొర్లను
నిశ్శబ్ద వీక్షణ ప్రాణాంతక మృగం
ధాటికి
దిక్కులేని అరుపులు అరుస్తూ
చెల్లాచెదురవుతున్నె
దీనంగా గొర్లు–

Endurance hunting లో
తినదలచిన జీవాన్ని ఒంటరిని
చేయడంలో
తోడేళ్లు పండితులు–

నేనే ఆయుధం ఆయుధమే నేను
అన్నట్టు
గొర్లకు దాపున్నాను
శాల్తీ ఒకటిపోయినా
ప్రాణం పోయినట్టే అనుకున్నా–

కమ్మకత్తి తీసిన
నూరిన చిప్పగొడ్డలి చూపించిన
గొంగడి మడతలు విప్పి
Fladry గా మారిన–

నిటారుగా నిలబడింది
పల్లికిలించింది
గుర్రుమని కోర విసిరింది నా మీదకు
అన్నట్టు
గొర్ల అలసటపైకి–

Hazing
Disruptive
Stimulation
Bio–Acoustics
వాడుకున్నా
తాతల కాలం
నుండి వస్తున్న
వారసత్వ రక్షణ
కవచాన్ని
తొడుక్కున్నా–

అడవిలో
నలభై ఏండ్ల కిందట
అట్లా ఆ తోడేలునైతే
జయించిన–

మరి ఇప్పుడు
దేశాలకు దేశాలనే
గొంతు కొరుకుతూ
Surplus Killing లో
ఆరితేరిన తెల్ల మహాతోడేలును
తరుముడెట్లా?

యోచనలో
యోజనలో
మీరూ కలసి వస్తారు కదూ!


ఆచార్య బెల్లి యాదయ్య
98483 92690



# గ్రేటర్ హైదరాబాద్



## బీఆర్ఎస్ అంటే బోకస్ రాష్ట్ర సమితి

**డ్రగ్స్ దందాకు కేరాఫ్‌గా నిలిచింది**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సెటైర్లు**
**బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరును చూసి సిగ్గుపడుతున్నా**
**జైలు ఊచలు లెక్క పెట్టే రోజు దగ్గర్లోనే ఉంది**
**తప్పులు చేశారు.. అప్పులు చేశారు.. అందుకే ఈ దుస్థితి**
**అంకెల గారడి కాదు - ఆచరణకు సాధ్యమైన బడ్జెట్**



**షాద్ నగర్, మార్చి 22 (వుదయం)** : బీఆర్ఎస్ హయాంలో చేసినట్లు ఎక్కడ అంకెలగారడీ చేయలేదు.. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశాం.. అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ ను ప్రజాప్రయోజనకరంగా తీర్చిదిద్దాం.. అయినా సిగ్గు తప్పి చెవిలో పువ్వులు పెట్టుకొని బిఆర్ఎస్ నాయకులు తిరుగుతున్నారు.. పదేళ్ల పాటు ప్రజల చెవిలో పువ్వులు పెట్టారు.. ఇప్పుడు తమ చెవుల్లో పెట్టుకొని తిరుగుతున్నారు .. అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల తీరుపై సెటైర్లు వేశారు. షాద్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు తదితర ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే సిగ్గేస్తుందని అన్నారు. అసెంబ్లీలో బిల్లా రంగ అనబడే కేటీఆర్, హరీష్ రావుల తీరుల చూసి కొత్త ఎమ్మెల్యేలమైన తాము కూడా సిగ్గుపడుతున్నామని విమర్శించారు. తప్పులు .. అప్పులు చేసి ప్రజలను పూర్తిస్థాయిలో అగాధంలోకి నెట్టిన చరిత్ర ఆ పార్టీదని అన్నారు. వాళ్లు చేసిన పొరపాట్లను ఒక్కొక్కటిగా సవరించుకుంటూ కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనను ముందుకు తీసుకువెళుతుందని అన్నారు. బీఆర్ఎస్ అంటేనే "బోకస్ రాష్ట్ర సమితి" అని ఆయన విమర్శించారు. మొగుడిని కొట్టి మొలసాలకు ఎక్కినట్లు వీళ్ళను చూస్తే నవ్వు వస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అట్టడుగు వర్గాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా రాజ్యాంగానికి లోబడి పని చేస్తుంటే ప్రతిపక్షాలు అవాక్కులు చవాకులు పేలుతున్నారని విడ్డూరంగా ఉందన్నారు. విద్యా, వైద్యం అత్యంత ఖరీదైనదిగా మారిన తరుణంలో ప్రక్షాళన కోసం సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారని అన్నారు. ఏకీకృత పాఠశాలలు, మెస్ చార్జీల పెంపకం, మధ్యాహ్న భోజనం, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల మంజూరులు ఇందులో భాగమని అన్నారు. చిన్నపిల్లలకు కూడా పౌష్టికాహారం అందాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తుంది అన్నారు. 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని అత్యంత దరిద్రంగా మార్చి 8.50 లక్షల కోట్ల అప్పులు గత ప్రభుత్వం చేసిందని, దానికి నెలకు 50 కోట్ల చొప్పున మిత్తీ చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ఒక వర్గం మాత్రమే ఆధిపత్యం చెలాయిచిందని అన్నారు.

### డ్రగ్స్ రాజ్యాన్ని సృష్టించారు..

గతంలో బంగారు తెలంగాణను తీసుకువస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ నాయకులు డ్రగ్స్ సామ్రాజ్యాన్ని సృష్టించారని, యువత జీవితాలను నాశనం చేశారని ఆరోపించారు. ఆ పార్టీలోని అత్యంత కీలక నేత దీనికి నాయకత్వం వహించడం సిగ్గుచేటని అన్నారు. ఈ రోజున కూడా ఆ పార్టీకి చెందిన నాయకులు డ్రగ్స్ విషయంలో పట్టుబడుతున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం పాలన మీద మాత్రమే ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ఇలాంటి దందాలు చేసే నాయకులకు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ తో సమాజాన్ని నాశనం చేయడమే కాకుండా మట్టి, ఇసుక, భూమి, మైనింగ్.. ఇలా అన్నింటిని దోచుకున్నారని ధ్వజమెత్తారు. వీరు సృష్టించిన డ్రగ్స్ కల్చర్ ఇప్పటికీ కొనసాగుతుండడం దురదృష్టకరమని అన్నారు. ఎవరు ఏమి విమర్శించిన ప్రభుత్వం మాత్రం ప్రజల కోసమే పని చేస్తుందని, ప్రస్తుతం రైతు భరోసా, రైతు బీమా కార్యక్రమాల ద్వారా వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగుతుందని వెల్లడించారు. అంతకు ముందు గిరిజన నేత పి. రఘునాయక్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు చల్లా శ్రీకాంత్ రెడ్డి, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గిరిజన నేత రఘునాయక్, బాలరాజుగౌడ్, కేశంపేట మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, కొత్తూరు పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, ఆగిరి రవికుమార్ గుప్తా, మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



## జనావాసాల నడుమ ఎస్టీపీ ప్లాంట్ వద్దు

### ప్లాంట్‌ను తక్షణమే మార్చాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

**అమీన్ పూర్, మార్చి 22 (వుదయం)** : అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని కలిసి అమీన్‌పూర్‌లో ప్రతిపాదిత ఎస్టీపీ ప్లాంట్ స్థాపనపై ఆదివారం వినతిపత్రం అందజేశారు. నివాస ప్రాంతాలకు సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో దుర్వాసన, కాలుష్యం, ఆరోగ్య సమస్యలు వంటి ఇబ్బందులు తలెత్తే అవకాశముందని వారు వివరించారు. అందువల్ల ప్రస్తుత స్థలం నుంచి ప్లాంట్‌ను తక్షణమే ఇతర అనుకూల ప్రదేశానికి మార్చాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తిరుమల రెడ్డి, రమేష్, అరుణ్, విష్ణు, రవి, జయరామ్, వెంకటరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అమీన్‌పూర్ ప్రజల ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.



## నల్లపోచమ్మకు ఘనంగా పూజలు

**గుమ్మడిదల, మార్చి 22 (వుదయం)** : మున్సిపాలిటీ 18వ వార్డులో ఆదివారం నల్లపోచమ్మ తల్లి పూజలు కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, మద్ది శేఖర్‌రెడ్డి, సీకేజీ యువసేన సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వర్టెక్స్ 33 వెస్ట్‌లో అద్భుతమైన అవకాశం

### ఈ ఆఫర్ ఏప్రిల్ 15, 2026 వరకు మాత్రమే



**హైదరాబాద్** : హైదరాబాద్ పశ్చిమ కారిడార్‌లో గృహ కొనుగోలుదారులకు ప్రస్తుతం అరుదైన అవకాశంగా మారింది వర్టెక్స్ 33 వెస్ట్ ప్రాజెక్ట్. వేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల–గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతి, ఆర్థిక సౌలభ్యం రెండింటినీ సమన్వయం చేస్తూ కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుత కాలంలో గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే ముందు ఆర్థిక ప్రణాళికతో పాటు ప్రాజెక్ట్ నమ్మకాన్ని కూడా పరిశీలించే పరిస్థితుల్లో, ఈ ప్రాజెక్ట్ ఒక ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. జనవరి 2027 వరకు ఈఎంఐ హాలిడే అందించడం ద్వారా కొనుగోలుదారులు ఇప్పుడే ఇంటిని బుక్ చేసుకుని, నిర్మాణ దశలో ఈఎంఐ భారం లేకుండా ముందుకు సాగేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ ఆఫర్ ఏప్రిల్ 15, 2026 వరకు మాత్రమే చెల్లుబాటు కావడంతో, కొనుగోలుదారులు తమ ఆర్థిక ప్రణాళికను సౌకర్యంగా నిర్వహించుకునే సమయం పొందుతారు.

### నిర్మాణ పురోగతి ముందంజలో...

ప్రాజెక్ట్ విశ్వసనీయతను పెంచుతున్న ముఖ్య అంశం నిర్మాణ వేగం. 2023 ఆగస్టులో అన్ని అనుమతులు పొందిన ఈ ప్రాజెక్ట్, 2024 జనవరిలో ఫౌండేషన్ పనులు ప్రారంభించింది. తక్కువ సమయంలోనే రెండు టవర్స్ 33 అంతస్తుల నిర్మాణాన్ని పూర్తి చేయడం ప్రణాళిక మరియు అమలు సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రస్తుతం ఇంటీరియర్ పనులు, ఫసాడ్ ట్రీట్మెంట్, బిల్డింగ్ సర్వీసెస్ పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయి. పోడియం నిర్మాణం ఇప్పటికే కనిపించడం ప్రాజెక్ట్ వేగాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

### పోడియం లైఫ్‌స్టైల్ కాన్సెప్ట్...

ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతలలో ఒకటి పూర్తి స్థాయి పోడియం కాన్సెప్ట్. నల్లగండ్ల–గచ్చిబౌలి ప్రాంతంలో ఇది అరుదుగా కనిపించే సదుపాయం. ఎలివేటెడ్ పోడియం ద్వారా ట్రాఫిక్ రహిత వాతావరణం ఏర్పడి, నివాసితులకు భద్రతతో పాటు మెరుగైన జీవన ప్రమాణాలు అందిస్తుంది.

### విశాలత, ప్రైవసీకి ప్రాధాన్యం...

కేవలం రెండు టవర్స్‌తో లో డెన్సిటీ ప్లానింగ్ చేయడం ద్వారా విశాలమైన జీవన స్థలాన్ని అందిస్తోంది. ప్రతి అపార్ట్‌మెంట్‌లో మూడు బాల్కనీలు ఉండేలా డిజైన్ చేయడం వల్ల గాలి, వెలుతురు సమృద్ధిగా అందుతుంది. గ్లాస్ రైలింగ్స్‌తో ఆధునిక లుక్‌ను కూడా కల్పించారు. భద్రత కోసం బయోమెట్రిక్ లాక్స్, ఇంటీరియర్స్‌లో పెద్ద టైల్స్ వంటి ఫీచర్లు వినియోగదారుల సౌకర్యాన్ని పెంచుతాయి. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ అపార్ట్‌మెంట్స్‌లో ఆల్ ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌కు చెందిన ఫిట్టింగ్స్ వినియోగించడం ద్వారా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. అందమైన డిజైన్‌తో పాటు దీర్ఘకాలిక ఉపయోగం, తక్కువ నిర్వహణ అవసరం ఉండేలా స్పెసిఫికేషన్స్ రూపొందించారు.

### అభివృద్ధి దిశగా ముందుకు...

నల్లగండ్ల–గచ్చిబౌలి ప్రాంతంలో సుమారు 43 ఎకరాల్లో అభివృద్ధి జరుగుతున్న ప్రాజెక్ట్‌లు ఉండటం డెవలపర్ దీర్ఘకాల దృష్టిని తెలియజేస్తోంది. ఐటి హబ్‌లకు సమీపంలో ఉండటం వల్ల ఈ ప్రాంతానికి భవిష్యత్‌లో మరింత డిమాండ్ పెరగనుంది.

### అద్భుతమైన అవకాశం...

నిర్మాణం వేగంగా కొనసాగుతుండటం, జనవరి 2027 వరకు ఈఎంఐ హాలిడే వంటి సౌకర్యం కలగడం వల్ల ప్రస్తుత సమయం కొనుగోలుదారులకు అనుకూలంగా మారింది. అయితే ఈ



ఆఫర్ ఏప్రిల్ 15 వరకు మాత్రమే అందుబాటులో ఉండటంతో, ఇది ఒక పరిమిత కాల వ్యూహాత్మక అవకాశం అని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో నమ్మకం, పారదర్శకత, సమయానికి నిర్మాణం ముఖ్యమైన అంశాలుగా మారిన నేపథ్యంలో, వర్టెక్స్ 33 వెస్ట్ ప్రాజెక్ట్ ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ గృహ కొనుగోలుదారులకు ఆకర్షణీయ ఎంపికగా నిలుస్తోంది.

## కొంపల్లిలో హివాగ ప్రారంభం

### లగ్జరీ బ్యూటీ క్లినిక్ ప్రారంభం



**వుదయం, హైదరాబాద్** : దేశంలో బిగ్గెస్ట్ లగ్జరీ బ్యూటీ క్లినిక్ గా ప్రసిద్ధిగాంచిన 'హివాగ' కొత్త బ్రాంచ్ ఈరోజు కొంపల్లిలో ఘనంగా ప్రారంభమైంది. మూడేళ్ల క్రితం హైదరాబాద్ లో 'హివాగ' ఫస్ట్ బ్రాంచ్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు కొంపల్లిలో రెండో బ్రాంచ్ స్టార్ట్ చేశారు. దేశవ్యాప్తంగా 'హివాగ'కు ఇది 8వ బ్రాంచ్ కావడం విశేషం. ఈ క్లినిక్ కు హరిత రెడ్డి సతి సీఇఓ గా, రామ్ మోహన్ రెడ్డి సతి మేనేజింగ్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు. అన్ని రకాల అత్యాధునిక స్కిన్, హెయిర్ ట్రీట్ మెంట్స్, సెలూన్ సర్వీసెస్ ను 'హివాగ' లగ్జరీ బ్యూటీ క్లినిక్ లో అందించనున్నారు. ఈ క్లినిక్ లో నిపుణులైన డెర్మటాలజిస్టుల ఆధ్వర్యంలో మెన్, వుమన్ కు ట్రీట్ మెంట్స్ అందుబాటులో ఉంటాయి. కొంపల్లి బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా 'హివాగ' లగ్జరీ బ్యూటీ క్లినిక్ సీఇఓ హరితరెడ్డి సతి మాట్లాడుతూ – హైదరాబాద్ లో మూడేళ్ల క్రితం ఫస్ట్ బ్రాంచ్ ను గచ్చిబౌలిలో స్టార్ట్ చేశాం. ఇప్పుడు సెకండ్ బ్రాంచ్ ను కొంపల్లిలో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. మాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాం. మొత్తంగా ఇది మా క్లినిక్ కు 8వ బ్రాంచ్. మా 'హివాగ' లగ్జరీ బ్యూటీ క్లినిక్‌లో అన్ని రకాల స్కిన్, హెయిర్ ట్రీట్ మెంట్స్ ఆడ, మగవారికి అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన డెర్మటాలజిస్టుల ఆధ్వర్యంలో చికిత్సలు అందిస్తారు. రిజల్ట్ విషయంలో మీరు పూర్తి విశ్వాసంతో ఉండవచ్చు. మీకు ఇచ్చే ట్రీట్ మెంట్ ను మేము ఎంతో బాధ్యతగా భావిస్తుంటాం. పర్మినెంట్ మేకప్, బ్రైడల్ మేకప్, పర్మినెంట్ హెయిర్ రిమూవల్..ఇలా ఎన్నో రకాల ట్రీట్ మెంట్స్ మా దగ్గర అందుబాటులో ఉన్నాయి. ప్రతి కస్టమర్ కు వారి అవసరాల మేరకు ప్యాకేజ్ లు ఉన్నాయి. అందుబాటు ధరల్లో ట్రీట్ మెంట్స్ అందిస్తున్నాం. మా దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ముందు హెల్త్ కౌన్సెలింగ్ ఇస్తారు. నేను కూడా మిడిల్ క్లాస్ నుంచే వచ్చాను. మధ్య తరగతి వారు కూడా ట్రీట్ మెంట్ చేయించుకునేలా ధరలు ఉన్నాయి. మేము ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా బెస్ట్ ప్రోడక్ట్స్ వాడుతున్నాం, బెస్ట్ ట్రీట్ మెంట్స్ ఇస్తున్నాం. వైజాగ్ నుంచి మా ప్రయాణం ప్రారంభించాం. నెక్ట్స్ తిరుపతి,భీమవరం, కాకినాడలో కూడా బ్రాంచెస్ స్టార్ట్ చేయబోతున్నాం. ఎప్పుడు కొత్త బ్రాంచ్ స్టార్ట్ చేసినా స్థానిక ప్రజలు ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారు. వారికి కృతజ్ఞతలు చెబుతున్నాం అన్నారు.





## భక్తిశ్రద్ధల మధ్య సోమనాథ జ్యోతిర్లింగ దర్శనంత

**రామచంద్రాపురం, మార్చి 22 త(వుదయం)** : పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని బీహెచ్‌ఈఎల్ టౌన్షిప్‌లోని వేంకటేశ్వర ఆలయ సముదాయంలో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 1000 సంవత్సరాల ప్రాచీన సోమనాథ జ్యోతిర్లింగ దర్శనం, రుద్రాభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు సోమనాథ జ్యోతిర్లింగ దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామకృష్ణ, రఘునాథ్ రెడ్డి, భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మోసపూరితమైన బడ్జెట్

### బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**కుత్బుల్లాపూర్, మార్చి 22,(వుదయం)** : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరితమైన బడ్జెట్ అని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ మండిపడ్డారు. శంభీపూర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కూల్చివేతలు పేల్చివేతల పాలనగా మారిందని ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని తెలిపారు. బడ్జెట్లో పేదలకు రైతులకు మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. రైతు భరోసా పెంపుపై స్పష్టత ఇవ్వలేదని రూ.15 వేల హామీ అవుతుందో లేదో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పలేకపోతున్నారని మహిళలకు నెలకు 2500 ఇస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని తులం బంగారం పేరుతో పేద మహిళలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, ఎల్లుగారి సత్యనారాయణ, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కుంటి నాగరాజు, శంకర్ నాయక్, గోపాల్ రెడ్డి, భరత్ కుమార్, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, ఆనంద్ కుమార్, సుధాకర్ రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ ఎంపీటీసీ మహేష్, నాయకులు శామీర్పేట్ రంగయ్య, ఈ శ్రీనివాస్, మాదాస్ నర్సింగ్ రావు, కుంట్ల నందు, మాదాస్ నవీన్, రంజిత్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, యువ నాయకులు విష్ణు, శ్రీకాంత్ యాదవ్, ప్రవీణ్ నాయక్, భాను, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.








## రైతు భరోసా నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారం

### 58 రైతు వేదికల్లో వీక్షించిన అధికారులు, రైతులు

**రంగారెడ్డి, మార్చి 22 (వుదయం ప్రతినిధి)** : రైతు సంక్షేమం కు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లాలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో ఆదివారం భాగంగా నంగునూరు మండలం నర్మెట్టలో కొత్తగా నిర్మించిన ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో యాసంగి సీజన్‌కు పెట్టుబడి సాయంగా రైతు భరోసా విధులు మంత్రులతో కలిసి విడుదల చేశారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు 9 వేల కోట్ల రూ.లు విడతలు వారీగా రైతుల ఖాతాల్లో 45 రోజుల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం మొదటి విడత 3590 కోట్ల రైతు భరోసా విడుదల చేసినట్లు తెలిపారు.రైతులు పంట మార్పిడి చేయాలని కూరగాయలు జొన్నలు తదితర పంటలు పండించాలని అన్నారు.

ఈ సందర్భంగా ఆదివారం నాలుగు బస్సులలో, సుమారు 200 మంది రైతులను, తలకొండపల్లి, మాడుగుల, ఆమనగల్, కేశంపేట్ మరియు షాబాద్ రైతులను, ముఖ్యమంత్రి కార్యక్రమము ప్రత్యక్షంగా వీక్షించుటకు, నాలుగు బస్సులు జండా ఊపి నర్మెట్ట, సిద్దిపేట, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సందర్శనకు పంపించుట జరిగింది. జిల్లాలో 58 రైతు వేదికల్లో రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వి.సి.యూనిట్ ద్వారా రైతులు వీక్షించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉష , ఉద్యానవన శాఖ అధికారి సురేష్ అబ్దుల్లాపూర్‌మెట్ రైతు వేదిక నుంచి రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. జిల్లాలోని 2 లక్షల 89 వేల 448 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.137.11 కోట్లు మొదటి విడతగా వారి ఖాతాల్లో సోమవారం రైతు భరోసా జమ కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఉషా తెలిపారు. రైతులు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు సద్వినియోగం చేసుకుని యాసంగి పంటలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి లాభదాయకం వ్యవసాయం చేయాలని సూచించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు



## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా తిరుమల కవిత వెంకటేష్ గౌడ్

"పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన కవిత వెంకటేష్ గౌడ్." అని ఇస్తే బాగుంటుంది.
పార్టీ పట్ల ఆమె చూపుతున్న నిబద్ధత, సేవా దృక్పథాన్ని గుర్తించిన అధిష్టానం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.
నియామక పత్రం అందుకున్న అనంతరం తిరుమల కవిత గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**యాదాద్రి భువనగిరి / మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీలో మహిళా నాయకత్వానికి మరింత ప్రాధాన్యత లభించింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా తిరుమల కవిత వెంకటేష్ గౌడ్ నియమితులయ్యారు. ఆదివారం నాడు భువనగిరి హోటల్ వివేర లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిల చేతుల మీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు.

పార్టీ పట్ల ఆమె చూపుతున్న నిబద్ధత, సేవా దృక్పథాన్ని గుర్తించిన అధిష్టానం ఈ కీలక బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.
నియామక పత్రం అందుకున్న అనంతరం తిరుమల కవిత గౌడ్ మాట్లాడుతూ.
. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్తానని, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని ఆమె అన్నారు.

# అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- పస్రాలో జల మహోత్సవం, 99 రోజుల ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్



**ములుగు, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** గ్రామ అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వం ద్వారానే కాకుండా, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఆదివారం రోజున ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో '99 రోజుల యాక్షన్ ప్లాన్'లో భాగంగా నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమం, మరియు 'ప్రపంచ నీటి దినోత్సవం' పురస్కరించుకుని చేపట్టిన 'జల మహోత్సవం' ర్యాలీలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. నీటిని వృధా చేయడం మానవ మనుగడకే ప్రమాదకరం. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించాలి.

గ్రామాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత. పారిశుధ్య కార్మికులను గౌరవించాలి. చెత్తను రహదారులపై వేయకుండా కుండీల్లోనే వేయాలి.

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం రుణాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. పాల కొరత తీర్చేందుకు మహిళా సంఘాలు గేదెల పెంపకంపై దృష్టి సారించాలి.
ఇంటర్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠశాల విద్యార్థులకు పాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
రేషన్ కార్డు ఉన్నవారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించేలా 'ఇందిరమ్మ బీమా' అమలు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.
కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ జిల్లాలో వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. గిరిజన హ్యాబిటేషన్లలో ట్యాంకర్ల ద్వారా, అవసరమైతే బబుల్ క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం విజయవంతంగా జరుగుతోందని వివరించారు.
అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేసి, గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా పంచాయతీ అధికారి కే వెంకటయ్య, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ మాణిక్యరావు, డిప్యూటీ ఈ ఈ సునీత, పసర సర్పంచ్ సుమలత, ఎంపీఓ సుమలత, కార్యదర్శి శరత్, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జనగణన ప్రక్రియలో ఖచ్చితత్వం కీలకం

**జనగాం, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** జనగణన – 2027 ఫేస్ – 1 గృహాల జాబితా, గృహ గణన (HLO) నిర్వహణలో భాగంగా నూతనంగా ఎంపికైన టెక్నికల్ అసిస్టెంట్లు, జనాభా లెక్కల ఛార్జ్ క్లర్క్ లకు ఆదివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై, నూతనంగా ఎంపికైన వారికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జనగణన – 2027 ఫేస్ – 1 గృహాల జాబితా, గృహ గణన (HLO) కింద టెక్నికల్ అసిస్టెంట్, జనాభా లెక్కల ఛార్జ్ క్లర్క్ లకు శిక్షణ కార్యక్రమం నేటి నుంచి మూడు రోజుల (22 నుంచి 24) పాటు ఉంటుందని పేర్కొన్నారు.జనగణన దేశ అభివృద్ధికి ముఖ్యమైన ప్రాథమిక సమాచార సేకరణ ప్రక్రియ అని తెలిపారు. ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేసే విధానాన్ని, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు సాంకేతిక పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాలని, డేటా సేకరణలో పారదర్శకతపై, ఇతర వివరాలపై మీరందరూ ఈ శిక్షణలో ప్రతి అంశాన్ని నిశితంగా వినాలని, బాగా నేర్చుకోవాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలతో ప్రోత్సహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సీపీఓ చినకోట్యా నాయక్, శిక్షకులు రవి నాయక్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన-2027ను విజయవంతం చేయాలి



**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**వరంగల్, మార్చి 22 (వుదయం జిల్లా ప్రతినిధి) :** జనగణన కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి సరైన శిక్షణ ఎంతో కీలకమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ఆదివారం రోజున బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌లో జిల్లా కలెక్టర్ (ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి) ఆధ్వర్యంలో జనగణన–2027 నిర్వహణపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.
ఖచ్చితమైన గణాంకాలే అభివృద్ధికి ప్రాతిపదికఈ సందర్భంగా ఛార్జ్ సెన్సస్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు. జనగణన ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకుని, అంకిత భావంతో విధులు నిర్వహించాలి.ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలు, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనలో జనగణన ద్వారా సేకరించే ఖచ్చితమైన గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి ఇంటిని సందర్శించి, ఎటువంటి తప్పులు లేకుండా వాస్తవ వివరాలను సేకరించడం సిబ్బంది ప్రాథమిక బాధ్యత.శిక్షణలో భాగంగా సిబ్బందికి జనగణన విధివిధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.పాల్గొన్న అధికారులుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సెన్సస్ అధికారి (డీఆర్ఓ) విజయలక్ష్మి , ముఖ్య ప్రణాళిక అధికారి చంద్రకళ, వరంగల్ ఆర్డీఓ సుమ, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్‌తో పాటు ఎంపీఎస్‌వోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి పొదుపు – జీవకోటికి రక్షణ

- ప్రతి నీటి బొట్టునూ పొదుపుగా వాడాలి భావి తరాల కోసం ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి
- తిరుమలగిరిలో ఘనంగా అంతర్జాతీయ జల దినోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి






**హనుమకొండ/ఆత్మకూరు, మార్చి 22 వుదయం ప్రతినిధి) :** మానవ మనుగడకు నీరే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, అజాగ్రత్తగా వృధా చేస్తే రానున్న రోజుల్లో మనుగడకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. "చెట్లు పెంచకపోతే గాలిని, నీటిని పొదుపు చేయకపోతే నీటిని కొనుక్కోవాల్సిన దుస్థితి వస్తుంది. ఇప్పటికే ఆ పరిస్థితులు కనిపిస్తున్నాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు.మిషన్ భగీరథ నీటినే వాడండిగ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా ప్రభుత్వం శుద్ధమైన నీటిని అందిస్తోందని, ప్రజలు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడకుండా భగీరథ నీటినే వినియోగించుకోవాలని మంత్రి కోరారు. నీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రైతులు అధిక రసాయనిక ఎరువులు వాడటం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని, వాటి వినియోగం తగ్గించాలని కోరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పంచభూతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే భావి తరాలకు మేలు జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.మిషన్ భగీరథ నీరు వర్సెస్ ప్రైవేట్ నీటి నాణ్యతపై అధికారులు డెమో నిర్వహించారు.సర్పంచ్ దేవేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలతో కుటుంబాలకు భరోసా



**– మంత్రి సీతక్క**
**కొత్తగూడ/మహబూబాబాద్, మార్చి 22(వుదయం ప్రతినిధి) :** విధి నిర్వహణలో ఉంటూ అకాల మరణం చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ITDA గెస్ట్ హౌస్ వేదికగా జరిగిన కార్యక్రమంలో, మంత్రి కారుణ్య నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఐటీడీఏ పరిధిలో వివిధ కారణాలతో మృతి చెందిన 17 మంది ఉద్యోగుల కుటుంబాలకు గాను, ప్రాథమికంగా ముగ్గురు లబ్ధిదారులకు మంత్రి స్వయంగా నియామక పత్రాలు అందజేశారు.
ఇంటి పెద్దను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో, వారికి ఆసరాగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి పేర్కొన్నారు.
"ప్రభుత్వ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి. వారి మరణం ఆ కుటుంబాలకు తీరని లోటు. అలాంటి సమయంలో ప్రభుత్వం తోడుగా ఉంటుందని చెప్పడమే ఈ నియామకాల ముఖ్య ఉద్దేశ్యం." అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. నియామక పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

## నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని హామీ

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భీమా కంపెనీల నుంచి డబ్బు ఇప్పించండి అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశం**



**ఖమ్మం, మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని, బీమా ప్రకారం సొమ్ము వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో సుడిగాలిలా పర్యటించారు. అందులో భాగంగా మధిర మండలం ఆత్కూరులోని అగ్నిప్రమాదానికి గురైన శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రితో పాటుగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మాజీ ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అగ్నిప్రమాద ఘటన జరిగిన సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు, మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులు నుంచి సమాచారం తీసుకున్నారు. అనంతరం కోల్డ్ స్టోరేజీలో ఘటనలో నష్టపోయిన మిర్చి బాధితులతో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ శీతల గిడ్డంగిలో రికార్డు ప్రకారం ఉన్న మిర్చి సంబంధిత రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం బీమా ద్వారా అందించాలని అధికారులకు ఆదేశించారు. మధిర మార్కెట్ లో కూడా మిర్చి అమ్మకాలు, కొనుగోలు ఖమ్మం మాదిరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు.

అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో మళ్లీ మంటలు చెలరేగకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు పూర్తిగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు.

## ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా బోనాల సైదారావు

**సూర్యాపేట మార్చి 22 (వుదయం)**




సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణానికి చెందిన బోనాల సైదారావు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మోటివేషనల్ స్పీకర్‌గా సర్టిఫికెట్ పొందారు. శనివారం, ఆదివారం రోజుల్లో నల్గొండలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ నూనె సుదర్శన్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.
ఈ సందర్భంగా బోనాల సైదారావు మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు ప్రేరణ కలిగించి వారు తమ లక్ష్యాలను సాధించే విధంగా జ్ఞాన నైపుణ్యాలు అందించడం, సమాజ సేవలో పాల్గొని దేశ అభివృద్ధికి తోడ్పడటం తన కర్తవ్యం అని తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న 30 మంది ట్రైనర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రీజియన్–2 ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్, కోటా సరిత, నారాయణ కవిత, గూడూరు అంజిరెడ్డి, హర్షిత, శ్రీలత, రవీంద్ర చారి, బాలు,

సరిత తదితర ట్రైనర్లు పాల్గొన్నారు.




## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 22 (వుదయం ప్రతినిధి) :**

సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మార్చి 23వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.
ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి,
తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ఈనెల 25న 'తుడుం దెబ్బ' జిల్లా స్థాయి సమావేశం

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 22 (వుదయం జిల్లా ప్రతినిధి):**

ఈనెల 25వ తేదీన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కుడిమెత.సమ్మయ్య దొర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఆదివాసి భవనంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా కమిటీ ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా కమిటీ,ఆదివాసి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆదివాసి మహిళా సంఘం జిల్లా కమిటీ ఆదివాసి సర్పంచుల ఫోరం జిల్లా కమిటీ లతోపాటు తదితర కమిటీల ఎన్నిక ఎన్నుకోవడం జరుగుతుంది అని అధిక సంఖ్యలో ఆదివాసి మేధావులు ,నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు,
మహిళలు, ప్రజలు ప్రతి ఒక్కరు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు సమావేశానికి జాతీయస్థాయి నాయకులైన జాతీయ అధ్యక్షుడు ఈసం సుధాకర్, ఉపాధ్యక్షుడు పోడం బాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ఆదివాసి విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి గొర్నపల్లి గణేష్, మరియు ఆదివాసి కళా సమితి కోసం వెంకటేష్ మధు హాజరవుతారని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఈ యొక్క సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**నల్గొండ మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా ప్రధాన లక్ష్యమని పల్లా జ్యోతిక రవితేజ తెలిపారు. ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ డివిజన్‌లో ప్రజల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అనేక మంది ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, వారికి అందుబాటులో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలు వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నందున వారికి సేవ చేయాలనే దృక్పథంతో స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు.ఈ వైద్య శిబిరానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరై తమ ఆరోగ్య సమస్యలను పరీక్షించుకోవడం అభినందనీయం అన్నారు. గెలుపు అంటే కేవలం ఓట్లు కాదు, ప్రజల మనసులు గెలుచుకోవడమే నిజమైన గెలుపని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల ప్రేమ, నమ్మకంలో తాను ఎప్పుడూ ఓడిపోలేదన్నారు. గాంధీనగర్ ప్రజల మద్దతు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, జీవితాంతం వారి సేవలో ఉంటానని తెలిపారు.




వైద్య శిబిరంలో డాక్టర్ పల్లా సతీష్ కుమార్, డాక్టర్ పల్లా శ్వేత, డాక్టర్ పల్లా లక్ష్మీ దుర్గ సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

# ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యం

**• అందుకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుంది • రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానందవెంకటస్వామి**

**మంచిర్యాల, మార్చి 22, (వుదయం ప్రతినిధి) :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానందవెంకటస్వామి అన్నారు. ఆదివారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 200 కోట్ల రూపాయల అంచనా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 8, 9 వార్డులలో 13 లక్షల రూపాయలతో సి సి రహదారి నిర్మించడం జరిగిందని, శ్రీనివాస గార్డెన్ నుంచి అమ్మ గార్డెన్ వరకు 1 కోటి 80 లక్షల రూపాయలతో హైమాస్ లైట్ల ఏర్పాటు కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, 30 రోజులలో నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 40 కోట్ల రూపాయలు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో 51 లక్షల రూపాయల నిధులతో సిసి రహదారులు నిర్మించి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా 32 కోట్ల రూపాయల వ్యయంతో క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో రహదారులు, మురుగు కాలువలు, లైటింగ్, త్రాగునీటి పనులు చేపట్టడం జరుగుతుందని, ఇంటర్నల్ పైప్ లైన్ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం జరుగుతుందని, మున్సిపల్ పరిధిలోని ఒక్కొక్క వార్డులో దాదాపు 2 కోట్ల రూపాయల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి, చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలలోని అన్ని వార్డులలో అమృత్ పథకం క్రింద త్రాగునీటిని అందించడం జరుగుతుందని, డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో 24 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన సిసి రహదారి ప్రారంభించడం జరిగిందని, 60 లక్షల రూపాయల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో 40 హైమాస్ లైట్లను పట్టణంలో ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయని, అమృత్ పథకం పనులను 6 నెలలలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులకు ఇబ్బందులు లేకుండా స్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద 2 కోట్ల 9 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని, 3 నెలలలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యాతనపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, ఓపెన్ జిమ్, కుర్మపల్లి శివారులో రైలింగ్, చే లింక్, ఫెన్సింగ్, బోటింగ్ ఇతర అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేసే విధంగా అధికారుల సమన్వయంతో పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లను ప్రారంభించడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం బోర్ వెల్స్, హైమాస్ లైట్లు ఏర్పాటు దిశగా కృషి చేస్తామని తెలిపారు. సి సి రోడ్డు, 2 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం కింద చర్యలు తీసుకోవడంతో పాటు ఊరు మందమర్రిలో ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు 2 కోట్ల 31 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో సి సి రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి చర్యలలో భాగంగా డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగించి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టి 20 శాతం పూర్తి చేయబడి మిగతా పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా సోలార్ హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లు తగ్గించడంతోపాటు ప్రజలకు ఉపయోగకరమైన వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 21 సోలార్ హైమాస్ లైట్లు మంజూరు చేయబడి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటి కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించి నీటి లభ్యతగా కృషి చేస్తున్నామని తెలిపారు. సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి

**ఎమ్మెల్సీ దండే విఠల్**

**కోయవాగు సర్పంచ్ చింతపురి లక్ష్మీ కాంగ్రెస్‌లో చేరిక**

**కాగజ్ నగర్, మార్చి 22, (వుదయం) :** కాగజ్ నగర్ మండలం కోయవాగు సర్పంచ్ చింతపురి లక్ష్మీ మరియు మాజీ ఉప సర్పంచులు అదే రాజు మాజీ కో ఆప్షన్ సభ్యులు చౌటుభాయ్ మరియు వార్డు సభ్యులు నేడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలగాలన్న గ్రామ అభివృద్ధి చెందాలన్నా కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమవుతుందని ఆయన అన్నారు త్వరలోనే సిర్పూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధిపరిచే బాధ్యత తనదని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులను కంటికి రెప్పలా పాడుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురే శ్యామ్ రావు, నాయకులు జావిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు ఎంతో మేలు

**లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చెక్కు అందజేత**

**ఎమ్మెల్సీ దండే విఠల్**

**కాగజ్ నగర్, మార్చి 22, (వుదయం) :** కౌటాల మండలం తాటినగర్ గ్రామానికి చెందిన దొంగ్రీ శంకర్ గారి నివాసానికి వెళ్లి అనారోగ్యం తో బాధపడుతూన్న దొంగ్రే శంకర్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ రూ.60 వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆపద సమయంలో సంజీవినీలా పని చేస్తోందని పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనీ తెలిపారు ఈ కార్యక్రమంలో తాటినగర్ సర్పంచ్ అనిల్,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి,కౌటాల మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నికాడే గంగారం,డిసిసి వైస్ ప్రెసిడెంట్ దుర్గం జానకి రావు తదితరులు పాల్గొన్నారు.




## సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు ఎంతో మేలు

**ఎమ్మెల్సీ దండే విఠల్**

**లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చెక్కు అందజేత**

**కాగజ్ నగర్, మార్చి 22, (వుదయం) :** కౌటాల మండలం తాటినగర్ గ్రామానికి చెందిన దొంగ్రీ శంకర్ గారి నివాసానికి వెళ్లి అనారోగ్యం తో బాధపడుతూన్న దొంగ్రే శంకర్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ రూ.60 వేల విలువ గల సీఎం సహాయనిధి చెక్కును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆపద సమయంలో సంజీవినీలా పని చేస్తోందని పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనీ తెలిపారు ఈ కార్యక్రమంలో తాటినగర్ సర్పంచ్ అనిల్,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి,కౌటాల మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నికాడే గంగారం,డిసిసి వైస్ ప్రెసిడెంట్ దుర్గం జానకి రావు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ బడ్జెట్ అంకెల గారడి

**అన్ని వర్గాలకూ అన్యాయమే**

**వందరోజుల హామీలు ఏమ య్యాయి**

**మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి**

**ధర్మపురి,మార్చి 22(వుదయం ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను నిలువునా వంచించిందని,అన్ని వర్గాల ప్రజ లకు ఈ బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం ధర్మపురి పట్టణంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చి 840 రోజులు గడిచినా, ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,420 హామీ లను అమలు చేయడంలో పూర్తి గా విఫలమైందని ధ్వజ మెత్తారు. అధికారంలోకి వచ్చిన 100 రోజు ల్లోనే అన్ని హామీలు అమలు చేస్తా మని ప్రగల్భాలు పలికి గద్దెనెక్కిన కాంగ్రెస్,నేడు తెలం గాణ ప్రజలను మోసం చేసిందని విమర్శిం చారు.ముచ్చటగా మూ డోసారి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటి కీ,ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి స్పష్టమైన కేటాయిం పులు లేకపోవడం శోచనీ యమ న్నారు.బడ్జెట్ కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్న70 లక్షల మంది రైతులు,22 లక్షల మంది కౌలు రైతులు, కోటి మంది మహిళలులక్షలాది మంది విద్యార్థులు, దివ్యాంగులు, దళితులు,బీసీలువీరందరికీ ఈ బడ్జెట్ కేవలం నిరాశనే మిగిల్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమం గాలికొ దిలేశారని ఎద్దేవా చేశారు.ఈ కార్య క్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు ఓద్నాల మల్లేశం,సంగి శేఖర్,చిలువేరి శ్యాంసుం దర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్,చిర్నేని నర్స య్య, మండలాల అధ్యక్షులు లోక మల్లారెడ్డి,గొస్కుల జలేంధర్, రాంచం దర్ గౌడ్, సింహాచలం జగన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన సదస్సు



**కరీంనగర్, మార్చి22 (వుదయం ప్రతినిధి) :** విద్యార్థులకు విజయంతో పాటు నైతిక విలువల పట్ల ఆసక్తి ఉండాలని, తరగతి గదిలో నేర్చుకున్న నైతిక విలువలను ప్రతినిత్యం పరిరక్షించాలని తద్వారా వారికి సమాజంలో తగిన గుర్తింపు, అవకాశాలు వస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు.స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు శ్రీదేవి, డాక్టర్ సంగీత రెడ్డి,డాక్టర్ వనజా నరేందర్ రెడ్డి, యోగా గురువు లక్ష్మణ్, సంస్కృతం అధ్యాపకురాలు అరుణతో, సుపథాం వారితో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాసం అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైతిక విలువపై అవగాహన కల్పించడమే కాకుండా వాటిని అమలుపర్చే విధానాలను సైతం వారికి తెలియపరచాలన్నారు.విద్యార్థుల్లో నైతిక విలువల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, వాటి యొక్క ప్రాముఖ్యతను తెలియపరచడానికై ఈ విద్యాసంవత్సరం నుంచి భగవద్గీత శ్లోకాల పఠనం, సంగీతం, సంస్కృతం శిక్షణ నిపుణులచే ఇప్పించడం జరుగుతుందని వారు చెప్పారు.ప్రతి విద్యార్థికి ఇవి చాలా అవసరమని తెలుపుతూ వీటిని నేర్చుకోవడం ద్వారా సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు వస్తుందని చెప్పారు. చాలామంది విద్యార్థులు నేడు భగవద్గీత శ్లోకాల పఠనం పట్ల ప్రత్యేక శ్రద్ధ హిస్తున్నారని న్నారు. సంస్కృతం విద్యార్థులకు నైతిక విలువలతో ప్రత్యేకమైన గుర్తింపు వస్తుందని, సమాజంలో ఉపాధి అవకాశాలు చాలా మెరుగ్గా ఉంటాయన్నారు.నైతిక విలువలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తానని మరియు సమాజంలో గుర్తింపు రావడానికి దోహద పడుతుందని వారు అభిప్రాయపడ్డారు. 4 నుండి 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఆదివారం మే 15 వరకు కొనసాగుతుందని వారు చెప్పారు ఆసక్తిగలవారు ఈ కార్యక్రమంలో పాల్గొని సామాజిక అవగాహనను పెంపొందించుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## నర్మెట్టకు ధర్మపురి రైతుల పయనం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా బస్సు ప్రారంభం**

**ధర్మపురి, మార్చి22 (వుదయం ప్రతినిధి) :** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండ లం నర్మెట్టలో నూతనంగా నిర్మిం చిన ఆయిల్ ఫామ్ కర్మాగారం ప్రారంభోత్సవానికి ధర్మపురి నియోజకవర్గం నుంచి రైతులు భారీగా తరలివెళ్లారు. ఆదివారం ఉదయం ధర్మపురి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అత్యాధునిక సాంకేతికతతో అందుబాటులోకి వచ్చిన ఈ కర్మాగారం ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో ఈ పరిశ్రమ పని తీరును పరిశీలించడం ద్వారా రైతులకు సాగుపై మరింత అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి రైతులు ఉత్సాహంగా తరలి వచ్చారు. నర్మెట్టలో జరగనున్న భారీ బహిరంగ సభకు, కర్మాగార ప్రారంభోత్సవానికి వీరంతా హాజరుకానున్నారు.కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ వేముల. నాగలక్షి రాజేష్,మండల అధ్యక్షుడు సంఘనబట్ల దినేష్, ఎఎంసి వైస్ చైర్మన్ సంగ నరసింహులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పోలీసుల, పాత్రికేయుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

**ప్రారంభించిన సీఐ ప్రదీప్ కుమార్**

**కరీంనగర్, మార్చి22 (వుదయం ప్రతినిధి) :** కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్ఐ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, పాత్రికేయుల స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. సీఐ ప్రదీప్ కుమార్ మ్యాచ్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ ఐ నరేష్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల కోసం పాటుపడే పోలీసులు,నిర్భయంగా ప్రజా సమస్యలు, అన్యాయాలను వెలికి తీసి ప్రభుత్వం ద్వారా పరిష్కరించడానికి కృషి చేసే పాత్రికేయులు వృత్తి రీత్యా బిజీగా ఉండడం జరుగుతుందని, రోజువారీ పనిలో ఒత్తిడి తగ్గించడానికి ఆటలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, పాత్రికేయులు రవీందర్, వెంకటేష్, విజెందర్ రెడ్డి, శేఖర్, తిరుపతి, ప్రవీణ్, శ్రీనివాస్, కిషోర్, వెంకటరమణ, శ్రీనివాస్, స్కైలాబ్, సాగర్, అనిల్, అజయ్, శ్రీనివాస్, కుమార్, గుణశేఖర్, సంపత్, సాయికృష్ణ, వేణుమాధవ్, మాజీ జెడ్పిటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ వద్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్ లు రాజేందర్ రెడ్డి,ముద్దం రాజేశ్వరి తిరుపతి, ఓలుగొత్తుల సురేష్,వద్లూరి అనూష శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుంబిగించాలి

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, మార్చి22 (వుదయం ప్రతినిధి) :** వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితులు ఉన్నాయని, జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, నీటి ఎద్దడి శాశ్వత నివారణ జల సంరక్షణతోనే సాధ్యమని, నీటిని సంరక్షించే బాధ్యత ప్రజల చేతుల్లోనే ఉందని నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక వైశ్య భవన్ లో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ జలదినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా సుజలాం సుఫలాం అనే గోడ ప్రతులని ఆవిష్కరించి మాట్లాడారు. ఎండాకాలం త్రాగునీరు లేక ఎంతో మందిప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాన నీరు వృధాగా పోతున్న దానిని ఒడిసిపట్టుకోవాలనే ఆలోచన చేయకపోవడంతోనే, నేడు ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. నగరంలో ప్రతి ఒక్కరు తమ ఇంటిలో కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. వ్యవసాయ భూముల్లో కూడా ఇంకుడు గుంతలు ఉంటే సాగు నీరుకు ఇబ్బందులు ఉ ండ వ న్నారు. మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణ రావు మాట్లాడుతూ పొలాలలో ఎండిపోయిన బోరు బావి చుట్టు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవచ్చనని, గుట్టల చుట్టు, బీడు భూముల చుట్టు కాంటూరు కంధకాలు త్రావ్వుకోవాలని, ప్రతి గ్రామంలో వాగుకు అడ్డంగా వాటర్ షెడ్ ప్రాజెక్ట్ నిర్మాణం చేసుకోవటం వలన భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత తీరుతుందన్నారు. సర్వో దయ అధ్యక్షులు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కలుషిత నీరు త్రాగడం వలన లక్షలాది మంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ,చాలా మంది చిన్న పిల్లలు చనిపోతున్నారని, జలవనరులు కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో 66 వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, మానేరు పర్యావరణ సమితి బాధ్యులు గంజి స్వరాజ్య బాబు, సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.








## గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా యూకేజీ కాన్వకేషన్ వేడుక

**పెద్దపల్లి మార్చి 22 (వుదయం ప్రతినిధి) :** గాయత్రి విద్యానికేతన్‌లో యూకేజీ చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను విజయవంతంగా పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం కాన్వకేషన్ వేడుకను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల జీవితంలో మధురమైన జ్ఞాపకాలుగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పూర్వ ప్రాథమిక విద్య విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు.

చిన్నారులు ఆడుతూ పాడుతూ నేర్చుకునే ఈ దశలో బలమైన పునాది ఏర్పడుతుందని, యూకేజీ పూర్తి చేసి మొదటి తరగతిలో అడుగుపెడుతున్న ఈ సందర్భాన్ని చిరస్మరణీయంగా మార్చడం మా లక్ష్యమని తెలిపారు. అలాగే పిల్లలు తమ ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని ప్రేరేపించారు.

కార్యక్రమం ఎంతో ఆనందభరితంగా సాగింది. చిన్నారులు తమ గురువులు, తల్లిదండ్రులు మరియు స్నేహితుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ పాటలు పాడి, నృత్యాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వారి అమాయకమైన ఉపన్యాసాలు, ప్రదర్శనలు హాజరైన వారిని మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, యూకేజీ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, గాయత్రి విద్యానికేతన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆలయ కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ



**మక్తల్ మార్చి 22( వుదయం ప్రతినిధి)** ఉట్కూర్ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కమ్యూ నిటీ హాల్ నిర్మా ణానికి ఎంపీ డి కే అరుణ మంజూరు చేసి న 10లక్షల వ్యయంతో ఆది వారం ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ జి. నింగిరెడ్డి సర్పంచ్ రేణుకా భరత్,మాజీ జెడ్పీటీసీలు అరవింద్, సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాధా కృష్ణగౌడ్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 10 లక్షల నిధు లు కేటాయించిన ఎంపీ డి కే అరుణ కు కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్ర మంలో ఉప సర్పంచ్రమేష్,జనార్ధన్ రెడ్డి, నర్సింహా గౌడ్,రమేష్, లక్ష్మారెడ్డి,మంగమ్మ తది తరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో యువ గర్జన

### సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై బీఆర్ఎస్ నిప్పులు



**సిద్దిపేట, (రంగదాంపల్లి) మార్చి 22 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భం గా రాజకీయ సెగలు రేగాయి. నర్మెట్టలో జరిగిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్స వంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి - యువజన విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రంగదాం పల్లి అమరవీరుల స్థూపం వద్ద బీఆర్ఎస్ యువజన నాయకులు బత్తుల ఆకాష్ నేతృత్వంలో యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా బత్తుల ఆకాష్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మార్గదర్శకత్వంలో, మాజీ మంత్రి హరీష్ రావు అహర్ని శలు శ్రమించి ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సాకారం చేశారని గుర్తు చేశారు. "కష్ట పడి ప్రాజెక్టును నిర్మించింది హరీష్ అన్న అయితే, కేవలం రిబ్బన్ కట్ చేయడానికి వచ్చిన రేవంత్ రెడ్డి ఒక 'కటింగ్ మాస్టర్' లా వ్యవహరిస్తున్నారు" అని మండిపడ్డారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ఫ్యాక్టరీ నిర్మాణకర్త అయిన హరీష్ రావు ఫోటోను కనీసం ఫ్లెక్సీల్లో కూడా ఉంచక పోవడం దుర్మార్గమని యువజన విభాగం ధ్వజమెత్తింది. నిరసనకారులు "సీఎం డౌన్ డౌన్", "ఖబర్దార్ రేవంత్ రెడ్డి" అంటూ నినా దాలతో హోరెత్తించారు.

# తెలంగాణ బడ్జెట్.. మోసపూరిత బడ్జెట్

- భారీ బడ్జెట్ అంటూ ప్రభుత్వ గొప్పలు
- రెండేళ్లుగా తెలంగాణ ప్రజలకు సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగ పడని బడ్జెట్
- కోట్ల బడ్జెట్ ఎక్కడి కెళుతుంది.దీని పై సీఎం సమాధానం చెప్పాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**వికారాబాద్: వుదయం ప్రతినిధి :**

తెలంగాణ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటూ, గత రెండు రోజుల క్రితం,ము చ్చటగా మూడవసారి, 3లక్షల కోట్ల పై చిలుకు తో,ప్రవేశ పెట్టిన భారీ బడ్జెట్, అంకెల గారడని, పేపర్లో చూడడానికి మాత్రమే తప్ప , సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగ పడదని, పేద ప్రజలను మోసం చేసే, మోసపూరిత బడ్జెటని, కోట్ల రూపాయల బడ్జెట్ పై సీఎం సమాధానం చెప్పాలని వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ నుద్దేశించి ఎద్దేవా చేశారు. ఆదివారం కొడంగల్ మున్సిపల్ కేంద్రం లోని న్యాయవాది మధు సూధన్ రెడ్డి స్వగృహం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు.గత రెండేళ్లలో తెలంగాణ ప్రభుత్వం మూడు పర్యాయయాలు లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టి, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి ,మొండి చెయ్యి చూపిందని , సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వా నుద్దేశించి,మాజీ ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కేవలం ఉచిత బస్సు కే ప్రభుత్వ హామీలు పరిమిత మయ్యాయని మాజీ ఎమ్మెల్యే మండి పడ్డాడు. ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు, యువత కు రెండు లక్షల ఉద్యోగాలు,రాజీవ్ వికాసం,వికలాంగులకు మరియు వృద్ధులకు పింఛన్ల పెంపు, మహిళ లకు స్కూటిలు,2500 గృహ లక్ష్మి పథకం ఇలా అనేక అలవి కానీ మోసపూరిత హామీలు ఇచ్చి, ప్రజలను వంచించి,సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె నెక్కిందని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డాడు.నేటికి కనీసం తన సొంత నియోజకవర్గం ,కోడంగల్ లో సైతం ,ఇచ్చిన హామీలు అమలు చేయక ,తనను గెలిపించిన ప్రజలను సైతం సీఎం మోసం చేశాడని, అందుకే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ బడ్జెట్ తప్ప, తెలంగాణ ప్రజలకు ఉపయోగ పడేది కాదని,మాజీ ఎమ్మెల్యే మరోమారు నొక్కి వక్కా ణించారు. తరుచూ నిర్వహించే అధికారుల సమీక్ష సమావేశం లో,ఇసుక అక్రమ రవాణా పై,సంభందిత జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ ని బాద్యులను చేస్తూ సస్పెండ్ చేస్తానంటూ సీఎం చేసిన ప్రకటన పై మాజీ ఎమ్మెల్యే పట్నం తీవ్రంగా స్పందించారు. సీఎం సొంత నియో జకవర్గం లోనే, సీఎం అండ తో, అతడి సోదరుడు తిరుపతి రెడ్డి అండతో ,వారి అనుచ రులు, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ, కోట్ల రూపాయలు దోచుకొని తింటున్నారని ,మాజీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు చేశాడు.వీరికి సంభందిత అధికారులు సైతం వత్తాసు పలుకుతుండగా,బొంరాస్ పేట్, మద్దూరు,తదితర ప్రాంతాల్లో, ఇసుక మాఫియా ,ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ, కోట్ల రూపాయలు దోచుకుంటు న్నారని, దీంతో తాము నిర్మించిన చెక్ డ్యాములు మొత్తం ఖాళీ అయ్యాయనీ మాజీ ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశారు.ఇచ్చిన ప్రక టనకు కట్టుబడి, సీఎం, జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ ని సస్పెండ్ చేసే దమ్ము ఉందా అంటూ సూటిగా సీఎం నుద్దేశించి,మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించాడు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 3లక్షల కోట్ల పై చిలుకు బడ్జెట్ తెలంగాణ ప్రజలకు చేరేలా, ,ప్రభుత్వం మెడలు వంచి, సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా,ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తామని మాజీ ఎమ్మెల్యే తెలుపుతూ లేనిచో పోరాటాలు తప్పవని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమం లో కొడంగల్ బారాస మండల దామోదర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మధు సుధన్ యాదవ్, మెట్లకుంట pacas మాజీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జన్మదిన వేడుకలు

**సదాశివపేట వుదయం** సదాశివ పేట మండలంలోని తంగేడుపల్లి గ్రామం జంగమయ్య గుట్టలోని బిల్వ లింగేశ్వర స్వామి ఆశ్రమంలో శ్రీ శ్రీ శ్రీ శివయోగి శివాచార్య మహాస్వామి వారి 31వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం ఆధ్యాత్మిక వాతావరణంతో కళ కళలాడింది. ఈ వేడుకలకు నాలుగు రాష్ట్రాల నుండి పీఠాధిపతులు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారికి ఆశీస్సులు అందించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వ హించగా భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జిల్లా సమాజం అధ్యక్షులు పల్లి నరసింహులు, గౌరవ అధ్యక్షుడు అన్మిశెట్టి జయప్రకాశ్, సమాజం సభ్యులు చంద్రశేఖర్, కోశాధికారి సంతోష్ పాటిల్, మల్లికార్జున్, గదిలో రాజు, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రాంతీయ భక్తులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై వేడుక లను విజయవంతం చేశారు.

## ప్రజలకు మాట ఇచ్చి నిలబెట్టుకున్న కౌన్సిలర్ కాకర్ల



**నారాయణపేట టౌన్ మార్చి 22( వుదయం ప్రతినిధి)** గత మున్సిపల్ ఎన్నికల్లో మూడో వార్డు నుండి కౌన్సిలర్ గా పోటీ చేసిన కాకర్ల నారాయణమ్మ ప్రజలకు మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. ఆదివారం నారాయణపేట మూడో వార్డులో తన సొంత ఖర్చుతో గుంత లమైన రోడ్లను మట్టి వేసి రోడ్డును బాగు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు తాను గెలిచిన వెంటనే వార్డులో గుంతలమైన రోడ్లను మట్టి వేసి బాగు చేయిస్తానని మాట ఇవ్వడంతో రోడ్లకు మరమ్మత్తు చేయించినట్లు ఆమె తెలిపారు.దీంతో కాలనీవాసులు తన దృష్టికి తీసుకురావడంతో కాలనీలో గుంతలమైన రోడ్డును మట్టి వేసి గుంతలను పూడ్చి రోడ్డును వేయించినట్లు ఆమె తెలిపారు.

## గణేష్ గడ్డ దేవాలయంలో భజన కార్యక్రమం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి వుదయం.** రుద్రారం గ్రామంలోని శ్రీ గణపతి శివరామ భజన మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా భజన మండలి ఏర్పాటు సందర్భంగా భక్తులకు ఆహ్వానం తెలుపుతూ ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయ ప్రాంగణంలో భక్తి భావంతో జరిగింది. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు భక్తి గీతాలు, భజనలు నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వడ్ల పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి ముక్కగాళ్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు బి మల్లేశం, ఏ శివకుమార్, సంయుక్త కార్యద ర్శులు రమేష్, పుర ప్రభు, గడ్డ విశ్వనాథం, ఎం బాబురావు, కోశాధికారి గాండ్ల సత్యనా రాయణ, ప్రచార కార్యదర్శులు ఆకుల సత్త య్య, ఎం నాగిరెడ్డి, కార్యదర్శులు కే మొగుల య్య, చెరుకుపల్లి శ్రీనివాస్, పల్లటి కృష్ణ, పి శ్రీనివాస్, వనం నర్సిములు, వడ్ల గోపాల్, రాంనారాయణ పటేల్, పి అశోక్, ఎం నిరంజ న్, వడ్ల హరీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గద్వాలలో నూతన చలివేంద్రం ప్రారంభం



**గద్వాల మార్చి 22 (వుదయం ప్రతినిధి)** గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆదివారం ప్రారంభిం చారు. ఈ కార్యక్రమం ఆయన కుమారుడు యువ నాయకుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి జన్మది నాన్ని పురస్కరించుకుని నిర్వహిం చారు మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్ర మానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు తదుపరి ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం చలివేంద్రంలో ఏర్పాటు చేసిన చల్లని తాగునీ టిని పరిశీలించి ప్రజలకు స్వయంగా నీటిని అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన కుమారుడి జన్మదినం సందర్భంగా ఆర్భాటాలకు దూరంగా ఉండి ప్రజలకు ఉపయోగపడే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులను వృథా ఖర్చులతో కాకుండా పేద ప్రజలకు విద్యార్థు లకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని సూచించారు ఈ కార్యక్ర మంలో జిల్లా సీనియర్ నాయకులు గద్దం కృష్ణారెడ్డి వేణుగోపాల్ మాజీ ఎంపీపీ రాజారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు నాగులు యాదవ్ చంద్రశేఖర్ ఎం.కె. సత్యం తదితరులు పాల్గొన్నారు.



## మహిళా దినోత్సవ వేడుకలకు ఆహ్వానం

**సంగారెడ్డి వుదయం :** వీరశైవ లింగాయ త్ సమాజం సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం 29 ఆదివారం ఉదయం 11 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్స్, పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్ర మానికి జిల్లా క్రమశిక్షణ కమిటీ పెద్దలు శ్రీ అడికే జగదీశ్వర్, జిల్లా గౌరవ సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాశ్, సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గందిగా రాజు, శెట్టి విజయకుమార్‌లను ముఖ్య అతి థులుగా ఆహ్వానించారు. ఈ వేడుకల్లో వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి గౌరెగట్టు శారదతో పాటు పలువురు మహిళలు సమాజ సభ్యులు పాల్గొ ననున్నారు. ఈ సందర్భంగా మహిళల సాధి కారత, సామాజిక అభివృద్ధిలో వారి పాత్రపై చర్చలు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## బసవ దేవాన్ష్ నూతన వస్త్రధారణ కార్యక్రమం



**సంగారెడ్డి వుదయం** వీరశైవ లింగాయత్ సమాజానికి చెందిన రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పాసారం శ్రీనివాస్ కుమారుడు బసవ దేవాన్ష్ నూతన వస్త్రధారణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు, సమాజ నాయకులు హాజరై బాలుడికి ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర నాయకులు అడికే జగదీశ్వర్, బద్రీనాథ్, శ్రీశైలం, రిటైర్డ్ ఎమ్మార్వోల సంఘం మాజీ అధ్యక్షులు శివప్రసాద్, జిల్లా సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాష్‌హాజరై బసవ దేవాన్ష్ కు ఆశీస్సులు అందించారు. అలాగే సదాశివపేట పట్టణ అధ్యక్షులు గందిగారాజు, జిల్లా కోశాధి కారి సంతోష్ పాటిల్, బత్తుల శ్రీనివాస్, యువజన అధ్యక్షులు బుగ్గనగారి మల్లికార్జున్, మున్సిపల్ కౌన్సిలర్ నాయకోటి నవీన్, పట్లోళ్ల శేఖర్, శంకర్, మధు శేఖర్, సిదర్ కేర్ సతీష్, శాంతి కుమారు, రాజ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పంపల్లిలో మిన్నంటిన శివరామనామస్మరణ



**మరికల్ మార్చి 22 ( వుదయం ప్రతినిధి)** మరికల్ మండల కేంద్ర పరిధిలోని అప్పంపల్లి గ్రామంలో ఆదివారం శివ రామ నామ జప గీత జ్ఞాన యజ్ఞం వైభవంగా ప్రారంభించారు గ్రామస్తులు అందరూ ఈ హోమం కార్యక్ర మంలో పాల్గొన్నారు పూజలలో పాల్గొన్న భక్తు లు స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## బీజేపీ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం



**నారాయణపేట టౌన్ మార్చి 22( వుదయం ప్రతినిధి)** భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా లోపండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 జిల్లా కార్యశాల జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.కార్య క్రమానికి ముఖ్య వక్తలు విద్యాసాగర్ రెడ్డి , సోల్కర్ ,సీనియర్ నాయకులు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజి ,రాష్ట్ర నాయకులు రతంగ్ పాండు రెడ్డి, బీజేపీ నారాయణపేట జిల్లా ఇంచార్జ్ బొక్క బలరెడ్డి ,బీజేపీ కొడంగల్ నాయకులు పూనమ్ చంద్ లాహోటి ,బంటు రమేష్, బీజేపీ నారాయణపేట మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేతా, వైస్ చైర్మన్ మంజుల రెడ్డి ,ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, జిల్లా పదది కారులు,మండల అధ్యక్షులు, సర్పంచలు , వార్డ్ మెంబర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఉపయోగపడని బడ్జెట్ ఇది

### గద్వాలలో కాంగ్రెస్ బడ్జెట్ పై బీఆర్ఎస్ ఆగ్రహం



**గద్వాల మార్చి 22 (వుదయం ప్రతినిధి)** గద్వాల జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత బాసు హనుమంతు నాయుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్ అంకెల గారడీ తప్ప ప్రజలకు ఉపయోగపడే విధంగా లేదని ఆయన ఆరోపించారు బడుగు, బలహీన వర్గాలు, ముఖ్యంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు ఈ బడ్జెట్ న్యాయం చేయలేదని పేర్కొన్నారు. బీసీలకు ప్రతి సంవత్సరం ₹20 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, మూడు బడ్జెట్లలో కలిపి కేవలం ₹33,116 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. ప్రస్తుత బడ్జెట్‌లో బీసీలకు ₹12,511 కోట్లు మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు రైతుల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఎకరాకు ₹15 వేల రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చి, బడ్జెట్‌లో కేవలం ₹18 వేల కోట్లు మాత్రమే కేటాయిం చడం ద్వారా రైతులను మోసం చేసిందన్నారు. రూ.3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్ అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రయోజనం కలిగే చర్యలు కనిపించడం లేదన్నారు. ఈ బడ్జెట్‌లో స్పష్టత, విజన్ లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందంజలో ఉండగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో వెనుకబడుతోం దని ఆయన విమర్శించారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ సహ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ ప్రజా ప్రతినిధులకు సన్మానం

**సంగారెడ్డి వుదయం** సంగారెడ్డి లోని ముదిరాజ్ సంఘ భవనంలో పట్టణ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ముదిరాజ్ ప్రజాప్రతినిధులలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ తో పాటు కౌన్సిలర్లు సర్పంచ్ లకు ఘనంగా సన్మానం చేశారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు మాట్లాడుతూ.. ముదిరాజ్ లు రాజకీయంగా మరింత ఎదగా ల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు గెలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి లో ముదిరాజ్ సంఘ భవనం కోసం కృషి చేద్దామని చెప్పారు.

అనంతరం సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ తో పాటు కౌన్సిలర్లు సర్పంచ్ లను ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చంద్ర శేఖర్, అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్, కోశాధికారి ప్రభాకర్, నాయకులు కోట్లపూర్ శ్రీనివాస్, పూజారి ప్రభాకర్, తిరుమల్, సాయి బాషా, సుగుణా కర్, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీకి ఆహ్వానం

**సంగారెడ్డివుదయం** సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం మార్చి 29, 2026 ఆదివారం ఉదయం 11 గంటలకు పీఎస్ఆర్ గార్డెన్స్, పోతిరెడ్డి పల్లి చౌరస్తాలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ సెట్‌కార్ ముఖ్య అతిథిగా హాజర వుతారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు లు ఇప్పపల్లి నరసింహులు, మాజీ ఎంపీపీ హనుమంతరావు పాటిల్, తాలూకా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల శివ కుమార్, మండల అధ్యక్షులు,, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

**నారాయణపేట టౌన్ మార్చి 22( వుదయం ప్రతినిధి)** వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడంతో డాక్టర్ గీత విశ్వనాథ్ దంపతులను కౌన్సిలర్ రాఘవేంద్ర ప్రత్యేకంగా అభినందిం చారు. ఆదివారం సివిల్ లైన్ లో ఏర్పాటు చేసిన చలివెంద్రాన్ని అయన ప్రార ంభించారు. ఈ స ంద ర్భ ంగా మాట్లాడుతు ఎండలు ఎక్కువ అవుతు న్నందున పేదలతోపాటు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం పుణ్యసార్థకమని ప్రతి వార్డులో ప్రధాన కూడలిలో చలివెం ద్రాలు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థ లు మందుకు రావాలని అన్నారు. అనంతరం ప్రముఖ స్త్రీ వైద్య నిపుణు రాలు గీత ప్రఖ్యత ల్యాప్రో స్కోపిక్ సర్జన్ విశ్వ నాథ్ మాట్లాడుతు మంచినీరు నిమ్మరసం మజ్జిగ కొబ్బరి నీళ్లు లాంటివి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ ఖౌసిప్ ,సునీల్ సిబ్బంది రామకృష్ణ చరణ్ పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీకి అభినందనలు

### నందు నామాజీ

**నారాయణపేట మార్చి 22( వుదయం ప్రతినిధి)** ప్రజాస్వామ్య భారత దేశంలో అత్యధిక కాలం పాలించిన ప్రజా నాయకుడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ రికార్డు సృష్టించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది నందు నామాజీ ప్రధాని నరేంద్రమోడీ కి ఒక ప్రకటన లో అభినం దనలు తెలిపారు.నరేంద్రమోడీ సీఎం,పి ఎం గా మార్చి 22 ఆదివారం నాటికి ప్రభుత్వం అధినేతగా 8 వేల931 రోజులు పూర్తి చేసుకోవడం గర్వకా రణం అన్నారు.ఇది వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామిల్లింగ్ పేరున ఉన్న 8వేల930 రోజుల రికార్డును ప్రధాని మోదీ అధిగ మించారని అన్నారు. అక్టోబర్ 7,2001న మోదీ గుజరాత్ ముఖ్యమం త్రిగా ప్రస్తానం ప్రారంభించి 13 ఏళ్లపాటు తిరుగులేని నాయ కత్వాన్ని అందించి 2014 లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి మూడు సార్లు వరు సగా లోకసభ లో విజయం సాధించి రికార్డు సృష్టించడం దేశ ప్రజల సౌభాగ్యమ న్నారు.

## నేడు జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజావాణి పునఃప్రారంభం



**గద్వాల మార్చి 22 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ సోమవారం నుండి పునఃప్రారంభం కానుంది. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నారు గత సోమవారం జనాభా గణన శిక్షణ కార్యక్రమం నిర్వహణ కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరిగి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు ఇకపై జిల్లాలోని అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల్లో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రా లను సంబంధిత కార్యాలయాల్లో సమర్పించు కోవచ్చని అధికారులు తెలిపారు.

## హైదరాబాద్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు



**సంగారెడ్డి వుదయం.** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీ సజ్జనార్ గారిని జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం మాజీ ప్రధాన కార్యదర్శి అన్మిశెట్టి జయప్రకాశ్, సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు గందిగా రాజు మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సమాజానికి సంబంధించిన సమస్యలు, కార్యక్రమాలు మరియు అభివృద్ధి అంశాలపై కమిషనర్‌కు వివరించారు. సమా జానికి అవసరమైన సహకారం అందించాలని వారు వినతి చేశారు. అదేవిధంగా, సామాజిక సమైక్యతను కాపాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు కమిషనర్ సజ్జనార్ ను వారు అభినందించారు.

## కాంగ్రెస్ ప్రకటించిన పథకాలకు బడ్జెట్‌లో నిధులు శూన్యం



**వికారాబాద్ జిల్లా (వుదయం ప్రతినిధి ) మార్చి 22,** పరిగి నియోజకవర్గం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తన నివాసం లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటిం చిన పథకాలకు అధికారంలో వచ్చిన తర్వాత ఏ బడ్జెట్ లోను నిధులు సమకూర్చలేదని బిసి ఎస్సి సబ్ ప్లాన్స్ కు మరియు మైనారిటీలకు మరియు డిక్లరేషన్ల పేరుతో ప్రజలను మభ్య పెట్టారని దానికి ఇప్పటివరకు ఎటువంటి నిధులు ప్రకటించలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా పెన్షన్లలో పెరు గుదల లేదు రైతు భరోసా అధికారంలోకి వచ్చి కేవలం ఒకేసారి మాత్రమే ఇచ్చారని తెలి యజేశారు. రాకంచెర్ల ఇండస్ట్రియల్ కారిడార్ సగమే పూర్తయిందని మోమిన్ పెట్ ఇండస్ట్రి యల్ కారిడార్ కూడా ఖాళీగానే ఉందని అవి విడిచిపెట్టి కాలాపూర్ రాపోల్ పంట భూములను తీసుకొని రైతులను గోసపెడుతు న్నారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు, గడ్డమీద శ్రీనివాస్, రవి, భాస్కర్, మాజీ ఎంపీపీ అరవింద్ రావు, బిఆర్ఎస్ పార్టీ సినియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, సందీప్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల



**మహబూబ్ నగర్ మార్చి 22( వుదయం ప్రతినిధి)** యాసంగి సీజన్ కు రైతు భరోసా మొదటి విడత నిధులు మహబూబ్ నగర్ జిల్లా రైతులకు సి. ఎం.రేవంత్ రెడ్డి ఆదివారం విడుదల చేశారు. సిద్ది పేట జిల్లా లో నర్మెట్ట లో రైతు భరోసా మొదటి విడత విడుదల కార్య క్రమంను వి.సి.యూనిట్ ద్వారా మహబూబ్ నగర్ జిల్లాలో 48 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం వీక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతు సంక్షేమం కు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి సి. ఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం సిద్ది పేట జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా నంగునూరు మండలం నర్మెట్ట లో కొత్తగా నిర్మించిన ఆయిల్ ఫాం ప్యాక్టరీ సి.ఎం. రేవంత్ రెడ్డి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో యాసంగి సీజన్ కు పెట్టుబడి సాయంగా రైతు భరోసా విధులు మంత్రులతో కలిసి విడుదల చేశారు.రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు 9 వేల కోట్ల రూ.లు విడతలు వారీగా రైతుల ఖాతాల్లో 45 రోజుల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.ఆదివారం మొదటి విడత 3590 కోట్ల రైతు భరోసా విడుదల చేసినట్లు తెలిపారు.రైతులు పంట మార్పిడి చేయాలని కూరగాయలు,జొన్నలు తదితర పంటలు పండించాలని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో 48 రైతు వేదికల్లో రైతు భరోసా నిధులు విడుదల కార్యక్రమం ను ప్రత్యక్షంగా వి.సి.యూనిట్ ద్వారా రైతులు వీక్షించారు. రాజా పూర్ మండలం లో రంగారెడ్డి గూడ గ్రామంలో రైతు వేదిక నుండి జిల్లా వ్యవసాయ అధికారి బొవోల్ల వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 2 లక్షల 15 వేల 923 మంది రైతులకు ఎకరం కు 6 వేల రూ ల చొప్పున మొదటి విడతగా వారి ఖాతాల్లో సోమవారం జమ కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం లో మండల వ్యవసాయ విస్తరణ అధికారి దీపిక, రంగారెడ్డిగూడెం సర్పంచ్ కాటేపగ రేవతి ఆనంద్, గుండ్ల పొట్లపల్లి సర్పంచ్ మడమోని మాసయ్య, అగ్రహారం పొట్లపల్లి సర్పంచ్ ఆలోనిపల్లి అనిత సత్యనా రాయణ, ఖానాపూర్ సర్పంచ్ పూజారి శేఖర్, వివిధ గ్రామాల వార్డు సభ్యులు రైతులు వెంకటయ్య, యాదయ్య అంతయ్య, ఆంజనే యులు,వెంకట్రాములు పాల్గొన్నారు.

## టాటా మోటార్స్ కార్ల ధరల పెంపు

ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ 2026 ఏప్రిల్ 1 నుండి తన ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. రూపాయి అమాంతం పతనం, ముడి సరుకుల వ్యయాలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పెరిగిన ముడి సరుకుల వ్యయాలను పాక్షికంగా భర్తీ చేసేందుకు ధరలను పెంచినట్లు కంపెనీ వెల్లడించింది. పెట్రోల్ డీజిల్ వాహనాలపై సగటున 0.5 శాతం వరకు ధరలు పెరగనున్నాయి.




# టెలికాం రంగంలో కీలక పరిణామం.. వొడాఫోన్ ఐడియాలో కలవనున్న బిఎస్ఎన్ఎల్!




ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నెట్‌వర్క్ పరిధిని మరింత విస్తరించుకోవాలనే లక్ష్యంతో వోడాఫోన్ ఐడియా ప్రభుత్వ రంగ సంస్థ చేతులు కలుపబోతోంది. ఈ రెండు సంస్థలు తమ వద్ద ఉన్న టెలికాం టవర్లు, ఆప్టికల్ ఫైబర్ స్పెక్ట్రమ్ వంటి వనరులను ఒకరికొకరు పంచుకోవడంపై చర్చలు ప్రారంభించాయి. మౌలిక సదుపాయాలను పంచుకోవడం వల్ల నెట్‌వర్క్ నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని, ఇది ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రెండు సంస్థలకు ఎంతో ఊరటనిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ బలంగా ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో వొడాఫోన్ ఐడియా మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ ఒప్పందం కుదిరితే రెండు సంస్థల వినియోగదారులకు మెరుగైన సిగ్నల్, డేటా సేవలు అందుతాయి. జియో, ఎయిర్‌టెల్ వంటి దిగ్గజ సంస్థలతో పోటీ పడటానికి ఈ సహకారం అత్యంత కీలకం కానుంది. అయితే, ఈ ఒప్పందంపై తుది నిర్ణయం పూర్తిగా వాణిజ్యపరమైన అంశాలపై ఆధారపడి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వోడాఫోన్ ఐడియా సుమారు 20.5 కోట్ల మేర వినియోగదారులను కలిగి ఉంది. దేశంలో అతిపెద్ద ప్రైవేట్ టెలికాం ఆపరేటర్‌గా కొనసాగుతోంది. ఇందులో యాక్టివ్ కస్టమర్లు 19.3 కోట్లుగా ఉంగా.. మార్కెట్ వాటా 17.5 శాతం నుంచి 18 శాతం ఉంది. గత కొన్ని ఏళ్లుగా జియో, ఎయిర్‌టెల్ నుంచి ఎదురవుతున్న తీవ్ర పోటీ వల్ల వోడాఫోన్ ఐడియా ప్రతి నెలా సగటున 10 లక్షల నుంచి 20 లక్షల వరకు వినియోగదారులను కోల్పోతూ వస్తోంది. వోడాఫోన్ ఐడియా వినియోగదారులలో మెజారిటీ భాగం ఇంకా 4జీ నెట్‌వర్క్‌లోనే ఉన్నారు. ఇటీవల నిధుల సేకరణ తర్వాత 5ఉ సేవలను విస్తరించడం ద్వారా వినియోగదారులను నిలుపుకోవాలని సంస్థ ప్రయత్నిస్తోంది. ఇక ప్రభుత్వ రంగ సంస్థ అయిన కు సుమారు 9.5 కోట్ల మంది వినియోగదారులు ఉండగా, మార్కెట్ వాటా 8 శాతం నుంచి 8.5 శాతంగా ఉంది. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు 40 లక్షలకు పైగా ఉండటం విశేషం.

# ట్విటర్ కొనుగోలులో మస్క్ మోసాలు..!



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 2022లో ట్విటర్ ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు జ్యూరీ నిర్ధరించింది. ట్విటర్ కొనుగోలు చేయడానికి కొన్ని నెలల ముందు ఉద్దేశపూర్వకంగా పెట్టుబడిదార్లను గందరగోళానికి గురిచేసినట్లు తెలిపింది. దానివల్ల ట్విటర్ షేర్ల విలువ తగ్గినట్లు వెల్లడించింది. అయితే స్టాక్ విలువను తగ్గించేందుకు కూడా కుట్ర పన్నారనే ఆరోపణలను తోసిపుచ్చింది. మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేయకముందు దాఖలైన దావాపై విచారణ జరిపిన జ్యూరీ ఈ వ్యాఖ్యలు చేసింది. ట్విటర్ కొనుగోలు ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు మే 2022లో మస్క్ చేసిన రెండు ట్వీట్లు, ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు, పలు ప్రకటనలతో ట్విటర్ వాటాదారులు తమ షేర్లను అమ్ముకునేలా చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై శాన్ ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టులో మార్చి 2న విచారణ ప్రారంభమయ్యింది. దీనిపై విచారణ జరిపిన తొమ్మిది మంది సభ్యుల జ్యూరీ 2022లో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు పేర్కొంది. మస్క్ కొనుగోలు చేయడానికి ముందు ట్విటర్ షేర్లు అమ్ముకున్న వాటాదారులకు నష్టపరిహారం చెల్లించాలని టెస్లా అధినేతను ఆదేశించింది. కాగా తాను ట్విటర్‌ను కొనుగోలు చేయాలని అనుకున్నప్పుడు అందులో నకిలీ ఖాతాల సంఖ్య అధికంగా ఉందని మస్క్ తెలిపారు. దీంతో కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ట్విటర్ డెలావేర్‌లోని కోర్టును ఆశ్రయించడంతో.. తన నిర్ణయాన్ని మార్చుకున్నానన్నారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు.

# విమానయాన సంస్థలకు డీజీసీఏ ఆదేశాలు



పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్న నేపథ్యంలో 9 దేశాల గగనతలం మీదుగా ప్రయాణించడం ఆపేయాలని విమానయాన సంస్థలకు నియంత్రణ సంస్థ డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) ఆదేశించింది. బహ్రెయిన్, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైట్, లెబనాన్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మీదుగా ఈనెల 28 వరకు ప్రయాణించొద్దని కోరింది. 32,000 అడుగుల ఎత్తులోనే ప్రయాణించాలి: సౌదీ అరేబియా, ఒన్ దేశాల గగనతలం మీదుగా ప్రయాణించొచ్చు కానీ, 32,000 అడుగల కంటే కిందకు దిగరాదని పేర్కొంది. ఉద్రిక్తతలు నెలకొన్న ప్రాంతాలకూ కొన్ని అంతర్జాతీయ సంస్థలు తమ విమాన సర్వీసులు నిర్వహిస్తున్నాయి. ఆయా విమానాశ్రయాలకు కనుక మనదేశీయ సంస్థలు విమానాలు నిర్వహించాలంటే.. అన్ని పరిస్థితులను మదింపు చేసుకోవాలని, ముఖ్యంగా భద్రతా పరమైన అంచనాలు కీలకమని డీజీసీఏ స్పష్టం చేసింది. విమానాలకు రూ.కోటి యుద్ధ బీమా ప్రీమియం: పశ్చిమాసియా గమ్యస్థానాలకు వెళ్తున్న విమానం, మరికొద్ది సేపల్లో ల్యాండ్ అవుతుందనుకుంటే.. ఆ సమీప ప్రాంతాలపై జరుగుతున్న దాడులతో.. విమానాలను దారి మళ్లించాల్సి వస్తోందని క్రూసిబ్బంది చెబుతున్నారు. ఇందువల్ల, చుట్టూతిరిగి వెళ్లాల్సి వచ్చేందుకు విమాన ఇంధనం అదనంగా ఖర్చవుతోంది. ఇదికాక.. నారో బాడీ విమానం రౌండ్ ట్రిప్‌నకు రూ.30–40 లక్షలు, వైడ్ బాడీ విమానానికి రూ.90 లక్షలు – కోటి రూపాయల యుద్ధ బీమాప్రీమియం చెల్లించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికే ముడిచమురు ధరలకు అనుగుణంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర పెరగడంతో, ప్రయాణికులపై సర్‌ఛార్జీ మోత మోగుతోంది. దేశీయ పెద్ద విమానయాన సంస్థ ఇండిగో ఆదాయంలో 18% పశ్చిమాసియా మార్గాలకు నడుస్తున్న విమానాల నుంచే వస్తోంది. ప్రస్తుతం ఈ ఆదాయంపై ప్రభావం పడుతోంది.

# ఇరాన్ వార్ వేళ మసకబారుతోన్న బంగారం..



పశ్చిమాసియాలో ఘర్షణలు రోజురోజుకూ తీవ్రం అవుతున్నాయి. అనిశ్చితుల నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారం ధర పెరుగుతుందని ఆశించినా.. అంచనాలకు భిన్నంగా భారీగా పడిపోతోంది. శనివారం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4500 డాలర్ల దిగువకు పడిపోయింది. 1983 తర్వాత ఒక వారంలో పసిడి ధర ఈ స్థాయిలో పతనమవడం మళ్లీ ఇప్పుడే. కమోడిటీ ఎక్స్ఛేంజ్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్సు బంగారం ఒక దశలో 2.47 శాతం మేర పతనమై రూ.4,492 వద్ద ట్రేడయింది. ఔన్సు వెండి 5 శాతం కుంగి, 70 డాలర్ల దిగువకు చేరింది. హైదరాబాద్‌లో శనివారం పది గ్రాముల మేలిమి బంగారం (Gold) 1,49,992గా ఉంది. కొన్ని నెలల క్రితం ఫ్యూచర్స్‌లో వెండి జీవనకాల గరిష్ఠాలకు చేరి, 119 డాలర్లు పలికిన సంగతి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిణామాలతో ఈ రెండు లోహాల ధరలు ఒత్తిడికి గురవుతున్నాయి. దాంతో రేట్లు పెరిగినా.. మదుపర్లు అందులో పెట్టుబడులు కొనసాగించలేక, తమ వాటాలను ఉపసంహరించుకుంటున్నారు. 1979–1980 మధ్యలో బంగారం ధర భారీగా పెరిగింది. ఒక ఔన్సు ధర 850 డాలర్ల పైకి చేరింది. అప్పుడు కూడా ఇరాన్‌లో విప్లవం కారణంగా చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు అది ప్రచ్ఛన్న యుద్ధ సమయం. అంటే యూఎస్– యూఎస్ఎస్ఆర్ వంటి రెండు శక్తిమంతమైన దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగాయి. ఈ అనిశ్చితితో అప్పటివరకు కొన్నేళ్లపాటు పరుగులు పెట్టిన పుత్తడి బుడగ 1983లో పగిలిపోయింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించే లక్ష్యంతో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను పెంచాలని నిర్ణయం తీసుకోవడం షాకిచ్చింది. అమెరికా డాలర్‌ను బలోపేతం చేసే చర్యగా దానిని భావించారు. దాంతో ఔన్సు పుత్తడి ధర 15–20 శాతం మేర పడిపోయి, 400 డాలర్ల దిగువకు చేరింది. ప్రస్తుత ఘర్షణల వల్ల బ్యారెల్ ముడిచమురు దాదాపు 40 డాలర్ల వరకు పెరిగినా బంగారం ధర మాత్రం పెరగకపోగా.. మరింత తగ్గుతోంది. డాలర్‌కు గిరాకీ పెరగడం వల్ల, పెట్టుబడులు అటు మళ్లడమే ఈ పరిస్థితికి కారణమనే విశ్లేషణలు ఉన్నాయి. బ్యారెల్ చమురు ధర 200 డాలర్లకు చేరితే మాత్రం, బంగారం ప్రస్తుత స్థాయుల నుంచి 15–20% మేర పెరిగి ఔన్సు 5,400–6,000 డాలర్లు పలకొచ్చని అంచనాలున్నాయి. వెండి ఔన్సు ధర ప్రస్తుతం 76 డాలర్ల వద్ద ఉన్నా, ఇది 110–130 డాలర్లకు చేరొచ్చనీ పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా పలు అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటాయన్న సంగతి తెలిసిందే.




## 19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్‌కు భారత్..



ఐర్లాండ్‌తో టీమ్‌ఇండియా రెండు టీ20ల సిరీస్‌లలో తలపడనుంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత బెల్‌ఫాస్ట్ మైదానంలో భారత జట్టు మ్యాచులు ఆడనుండటం గమనార్హం. ఇంగ్లాండ్ పర్యటనకు ముందే ఐర్లాండ్‌తో టీమ్‌ఇండియా ఈ సిరీస్‌ను ఆడనుంది. టీ20 ప్రపంచ కప్, ఐపీఎల్ తర్వాత భారత్ తొలి విదేశీ పర్యటనకు ఐర్లాండ్ వెళ్లనుంది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఇంగ్లాండ్‌తో పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లను ఆడనుంది. **తొలి టీ20 మ్యాచ్: జూన్ 26న, రెండో టీ20 మ్యాచ్: జూన్ 28న**'టీమ్‌ఇండియా సీనియర్ జట్టు రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్‌కు వెళ్లనుంది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు అక్కడికి పర్యటించింది. 2018, 2022, 2023లో ఐర్లాండ్‌తో మ్యాచులు ఆడింది. అయితే, 2007 తర్వాత బెల్‌ఫాస్ట్ వేదికగా ఇప్పుడే మ్యాచ్‌లను ఆడనుంది'' అని బీసీసీఐ వెల్లడించింది. ఐపీఎల్ ముగిశాక.. భారత్ స్వదేశంలోనే అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది.

# అప్పుడు 7 కిలోలు తగ్గా: శ్రేయస్ అయ్యర్



తనను రూ.26.75 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫైనల్‌కు చేర్చాడు. బ్యాటర్‌గానూ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆర్సీబీ చేతిలో ఓటమితో రన్నరప్‌గా నిలిచినా.. పంజాబ్ కింగ్స్ పోరాటం మాత్రం అదిరిపోయింది. అయితే, శ్రేయస్‌కు భారత జట్టు తరఫున మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. గాయం వల్ల ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లోనూ చోటు దక్కలేదు. దీంతో తనకు గతేడాది చాలా కష్టంగా గడిచిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గాయం వల్ల దాదాపు ఏడు కేజీల బరువు కూడా తగ్గినట్లు తెలిపాడు. గాయం నుంచి కోలుకొని రావడం చాలా కష్టమని వెల్లడించాడు. 'గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గా. దానినుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైందే. అయితే, రెండు నెలలు తీవ్రంగా కష్టపడిన తర్వాత.. ఇప్పుడు నా శరీరాకృతి బాగుంది. కానీ, ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా ఆ పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకూ ఆడిన రోజులు ఉన్నాయి'' అని శ్రేయస్ తెలిపాడు. 'గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం. రన్నరప్‌గా నిలిచాం.
దీంతో ఈసారి మాపై భారీగానే అంచనాలు ఉంటాయి. ఎప్పుడు అడుగు వేసినా.. విజయం సాధించేందుకే ప్రయత్నిస్తాం. నా కన్ను ట్రోఫీ పైనే ఉంది. గత రెండు నెలలుగా మేమంతా ఓ కుటుంబంలా కలిసి ఉన్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. ప్రతి మ్యాచ్‌కు రెండు లేదా మూడు రోజుల ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మైదానం ఆవల ఉండే బాండింగ్‌తోనే మ్యాచ్‌లో మెరుగ్గా రాణించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది'' అని శ్రేయస్ తెలిపాడు.

# ఐపీఎల్ ఫాస్టెస్ట్ బౌలర్.. ఘనమైన కమ్‌బ్యాక్‌పై గురి!



ఐపీఎల్ చరిత్రలో 156.7 కి.మీల స్పీడ్‌తో అత్యంత వేగంగా బంతిని విసిరిన బౌలర్ మయాంక్ యాదవ్. ఇప్పటి వరకూ అతడిదే రికార్డు. ఇలాంటి పేసర్ గుర్తున్నాడా..? గాయం కారణంగా గత సీజన్ మొత్తానికి దూరమైన ఈ పేస్ సెన్సేషన్ మళ్లీ ఐపీఎల్‌లో అడుగు పెట్టేందుకు సిద్ధమయ్యాడు. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న 19వ సీజన్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. ఇప్పటికే లఖ్‌నవూ మైదానంలో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో ఉంటూ గాయం నుంచి కోలుకున్న 23 ఏళ్ల మయాంక్ తన బౌలింగ్‌కు మరింత పదును పెట్టాడు. తరచూ గాయాలతో సావాసం చేసే అతడు.. ఇప్పుడు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించడంతో లఖ్‌నవూ జట్టులో జోష్ తెప్పించినట్లైంది. మానసికంగా సిద్ధంగా ఉన్నానని మయాంక్ స్పష్టం చేశాడు. గత పది నెలల కాలంలో కేవలం రెండే మ్యాచులను మాత్రమే ఆడాడు. అదీనూ భారత్ A తరఫున కావడం గమనార్హం. అయినా, బౌలింగ్‌లో లయను అందుకొనేందుకు కష్టపడినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. ''ఇప్పుడు చాలా బాగున్నా. పూర్తిస్థాయిలో రెడీ. ఎలాంటి ఇబ్బందులు లేవు. వేగంగా వేయడంపై బయట నుంచి వచ్చే వ్యాఖ్యలను పట్టించుకోను. ఎంత ఫాస్ట్‌గా బంతిని విసురుతానో మీరూ చూద్దురు. ఆట నుంచి సుదీర్ఘమైన లేఆఫ్ తీసుకున్నా. గత పది నెలల్లో కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయా. అయితే, అప్పుడు ఎలాంటి ఉద్దేశంతో ఉన్నానో.. నా కమ్‌బ్యాక్‌లోనూ అదే దూకుడుతో బౌలింగ్ చేస్తా. గాయాలను మేనేజ్ చేయడం మన చేతుల్లో లేదు.. కానీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే చేయగలను'' అని మయాంక్ యాదవ్ నమ్మకంగా చెబుతున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో నాలుగు మ్యాచుల తర్వాత గాయంతో ఇబ్బంది పడ్డాడు. అతడిపై నమ్మకం ఉంచిన లఖ్‌నవూ మేనేజ్‌మెంట్ రూ. 11 కోట్లకు రిటైన్ చేసుకుంది. కానీ, గత సీజన్‌లోనూ కేవలం రెండు మ్యాచులకే పరిమితం కావాల్సి వచ్చింది. వెన్నునొప్పి తీవ్రత కారణంగా జాతీయ జట్టులోనూ ఆడలేకపోయాడు. దీంతో న్యూజిలాండ్‌లో శస్త్రచికిత్స చేయించుకుని మరీ వచ్చాడు.

# కేకేఆర్‌కు మరో షాక్..

ఇప్పటికే హర్షిత్ రాణా రూపంలో ఓ పేసర్‌ను కోల్పోయిన కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మరో షాక్ తగిలింది. గత వేలంలో తీసుకున్న ఆకాశ్ దీప్ కూడా లీగ్‌లో ఆడటం కష్టమేనని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో చికిత్స పొందుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌కు మరో వారం రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో అతడు కోలుకుని వచ్చి ఆడటం కష్టమేనని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఆకాశ్‌కు గాయాలు కొత్తేమీ కాదు. 2022లో తొలిసారి ఐపీఎల్‌లో అడుగు పెట్టిన అతడు.. ఇప్పటి వరకు ఆడింది కేవలం 14 మ్యాచులే కావడం గమనార్హం. గత ఐపీఎల్‌లో ఆకాశ్‌ను కేకేఆర్ రూ. కోటికే సొంతం చేసుకుంది. ఆకాశ్ దీప్ గైర్హాజరుపై కేకేఆర్ ప్రధాన కోచ్ అభిషేక్ నాయర్ స్పందించలేదు. కానీ, హర్షిత్ రాణా స్థానంలో మరొకరిని చూస్తామని వెల్లడించాడు. ''హర్షిత్ రాణా లేకపోవడం మాకు నష్టమే. జట్టులో అతడు కీలక పాత్ర పోషించాడు. గత కొన్ని రోజులుగా మేం ప్రత్యామ్నాయ బౌలర్లను చూస్తూనే ఉన్నాం. ఎవరు సరిపోతారనే దానిపై విశ్లేషిస్తున్నాం. ఇప్పటి వరకైతే మేం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తప్పకుండా ఎవరో ఒకరిని స్క్వాడ్‌లోకి తీసుకుంటాం. ఇక మతీశా పతిరన విషయంలో సమాచారం ఉంది. అతడు ఏప్రిల్ మధ్య వరకూ అందుబాటులో ఉండడు. అప్పటికే మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తాడు'' అని అభిషేక్ వెల్లడించాడు. మరోవైపు పతిరనకు ఇంకా శ్రీలంక క్రికెట్ బోర్డు ఎన్‌వోసీ ఇవ్వలేదని సమాచారం. ఫిట్‌నెస్ ఆధారంగా జారీ చేసే అవకాశం ఉంది.



# 15 ఏళ్ల క్రికెటర్.. ఒక్క సెంచరీతో రికార్డులు బద్దలు



అంతర్జాతీయ మహిళల టీ20లో రువాండా బ్యాటర్ ఫ్యానీ సరికొత్త ఘనత సృష్టించింది. నైజీరియా ఇన్విటేషనల్ మహిళల అంతర్జాతీయ టీ20 టోర్నమెంట్‌లో శుక్రవారం ఘనాతో జరిగిన మ్యాచ్‌లో ఫ్యానీ (111: 65 బంతుల్లో 17 ఫోర్లు) శతకం బాదింది. అంతర్జాతీయ టీ20ల్లో అతిపిన్న వయసులో (15 ఏళ్ల 223 రోజులు) సెంచరీ చేసిన క్రికెటర్‌గా రికార్డ్ నెలకొల్పింది. అంతేకాకుండా మహిళల అంతర్జాతీయ టీ20 చరిత్రలో అరంగేట్రంలోనే సెంచరీ చేసిన తొలి క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలకో పేరిట ఉన్న రికార్డును ఫ్యానీ అధిగమించింది. అలకో 2019లో మాలీపై 116 పరుగులు చేసింది. అప్పుడు ఆమె వయసు 16 ఏళ్ల 233 రోజులు. ఇక 2005లో టౌంటన్‌లో ఇంగ్లాండ్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ కారెన్ రోల్టన్ నెలకొల్పిన ఓ రికార్డునూ ఫ్యానీ అధిగమించింది. అరంగేట్ర మ్యాచ్‌లో కారెన్ 96 పరుగులతో అజేయంగా నిలిచింది. ఇప్పుడు సెంచరీతో ఫ్యానీ ఆ రికార్డును బద్దలు కొట్టింది. మహిళల అంతర్జాతీయ టీ20 అరంగేట్రంలో అత్యధిక స్కోరు నమోదు చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది. పురుషుల క్రికెట్‌లో అంతర్జాతీయ టీ20 సెంచరీ రికార్డు అత్యంత పిన్న వయస్కుడైన ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ పేరిట ఉంది. 18 ఏళ్ల 280 రోజుల వయసులో అతడు స్విట్జర్లాండ్‌పై సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. దీంతో ఫ్యానీ అంతర్జాతీయంగా తక్కువ వయసులోనే శతకం చేసిన క్రికెటర్‌గా అవతరించింది. మొదట బ్యాటింగ్ చేసిన రువాండా 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఘనా కేవలం 88/8 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. తన అద్భుతమైన శతక ఇన్నింగ్స్‌కు ఫ్యానీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

# వుదయం సినిమా

MOVIE TIME!

## 'కరుప్పు' విజయ్‌తోనే చేయాల్సింది.. కానీ: ఆర్జే బాలాజీ

కోలీవుడ్ నటుడు ఆర్జే బాలాజీ 'మూకుతి అమ్మన్' (అమ్మోరు తల్లి) సినిమాతో దర్శకుడిగానూ మెప్పించారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రం 'కరుప్పు'. సూర్య హీరోగా నటిస్తున్న ఈ మూవీ మే 14న విడుదల కానుంది. విజయ్ తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాలనుకున్నా సాధ్యపడలేదని బాలాజీ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "2023లో ఈ సినిమా కథ రాయడం ప్రారంభించా. రాస్తున్న కొద్దీ విస్తృతి పెరిగింది. దీంతో స్టార్ హీరో అయితేనే బాగుంటుందని అనుకున్నా. విజయ్‌ను కలిసి.. స్క్రిప్ట్ వినిపించా. షూటింగ్ వెంటనే ప్రారంభించగలవా? అని అడిగారు.

నేనేమో కొంత సమయం కావాలని చెప్పా. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లోకి వెళ్లడంతో.. ఇందులో నటించలేకపోయారు. సూర్యను ఎంపిక చేశాక.. ఆయనకు తగ్గట్లు హీరో పాత్రలో కొన్ని మార్పులు చేశా" అని తెలిపారు. 'మూకుతి అమ్మన్ 2'కు సీక్వెల్‌గా 'కరుప్పు' తెరకెక్కుతుందంటూ వచ్చిన రూమర్లపై దర్శకుడు స్పందించారు. "ఆ సినిమాకు సీక్వెల్ చేయాలన్న ఉద్దేశం నాకు లేదు. కానీ, నిర్మాతలకు చేయాలని ఉండేది. అందుకే సుందర్.సి దర్శకత్వంలో దానిని ప్రారంభించారు. 'కరుప్పు' సెపరేట్ మూవీ. దానికీ 'మూకుతి అమ్మన్' కథకు ఎలాంటి సంబంధం లేదు" అని స్పష్టత ఇచ్చారు.

## డెకాయిట్ జైన్ మేరీ ఖాన్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ రిలీజ్

### అభినందనలు తెలియజేసిన ఆమిర్ ఖాన్



బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ కజిన్ బ్రదర్ కుమార్తె జైన్ మేరీ ఖాన్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. జైన్ మారీ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఖాకీ యూనిఫామ్‌లో భుజాలపై స్టార్ ఎపాలెట్స్, హోల్స్టర్ బెల్ట్‌తో తుపాకీ పట్టుకుని ముందుకు గురిపెట్టిన ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ఈ పోస్టర్‌లో జైన్ పాత్ర ఇంటెన్సిటీ స్పష్టంగా కనిపిస్తోంది. వెనుక వైపు ఇతర పోలీస్ అధికారులు ఉండటం ఈ సన్నివేశానికి మరింత బలం చేకూర్చింది.

ఈ పోస్టర్‌ను చూసిన ఆమిర్ ఖాన్ వెంటనే స్పందించి అభినందనలు తెలుపుతూ మొత్తం టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిందీ ప్రేక్షకుల్లో సినిమాకు మరింత హైప్‌ను తెచ్చింది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ ఫుల్ స్వింగ్‌లో కొనసాగుతున్నాయి. పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ 'రుబారు'.. అన్నీ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ఈ మూవీని ట్రూ బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న 'డెకాయిట్''కి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ దనుష్ భాస్కర్ రగ్డ్ విజువల్స్‌ను అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో బ్లాక్ బస్టర్ ఆల్బమ్ అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది. ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతున్న 'డెకాయిట్', లవ్, హార్ట్‌బ్రేక్, అద్భుతమైన యాక్షన్ తో ఆడియన్స్ కి సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.

## మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా బ్యాండ్ మేళం ట్రైలర్

### మార్చి 26న మూవీ గ్రాండ్ రిలీజ్




మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్ రూపొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. మార్చి 26న రిలీజ్ అవుతోన్న ఈ సినిమా ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. యూత్ అండ్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యే లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించారు. హీరో హీరోయిన్ మధ్య ఉండే ప్రేమ, గిల్లికజ్జాలను హత్తుకునేలా రూపొందించారు. హీరో హర్ష్ రోషన్ తన మరదలైన హీరోయిన్ ప్రేమను గెలవటానికి ఏం చేశాడు? తనకు ఎదురైన ఇబ్బందులేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అనే అంశాలతో బ్యాండ్ మేళం సినిమా రూపొందినట్లు తెలుస్తోంది. బ్యాండ్ మేళం సినిమా నుంచి ఇప్పటి వరకు విడుదలైన టీజర్, సాంగ్స్, తాజాగా ట్రైలర్‌తో సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. శివరాజు ప్రణవ్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించారు. సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ సినిమాకు సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ అందించారు. శివ ముప్పరాజు స్క్రీన్ ప్లే, ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహించారు. మార్చి 26న సినిమాను గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.

## 3డీ టెక్నాలజీలో కోరగజ్జ





తులునాడు ప్రాంతంలో అత్యంత పవిత్రంగా పూజించబడే దైవం కొరగజ్జ కథ ఆధారంగా ఓ శక్తివంతమైన సినిమా రాబోతోంది. 'కొరగజ్జ' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని త్రివిక్రమ సినిమాస్, సక్సెస్ ఫిల్మ్స్ బ్యానర్లపై త్రివిక్రమ్ సాపల్య నిర్మిస్తున్నారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సుధీర్ అత్తవర్ ఈ చిత్రానికి దర్శకత్వం, కథా రూపకల్పన, స్క్రీన్‌ప్లే, సంభాషణలను స్వయంగా అందిస్తున్నారు. అయితే ఈ మూవీని రీసెంట్‌గానే విడుదల చేయాలని అనుకున్నారు. కానీ చివరి నిమిషంలో ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. 'కొరగజ్జ' చిత్రాన్ని చూసిన అంతర్జాతీయ బృందం ఇచ్చిన సలహా మేరకు వాయిదా వేశారట. ఈ మూవీని త్రీడీ ఫార్మాట్‌లోకి మార్చితే ఇంకా ఎక్కువ ప్రభావవంతంగా ఉంటుందని, ఇంకా ఎక్కువ మందికి రీచ్ అవుతుందని చెప్పారట. 'కొరగజ్జ'ను 'ప్రపంచ స్థాయి చిత్రం'గా వారు అభివర్ణించారట. సినిమాలోని లొకేషన్లు, నిర్మాణ నాణ్యత, సినిమాటిక్ స్థాయిని మెచ్చుకున్నారట. ఈ మూవీని త్రీడీ ఫార్మాట్‌లోకి మార్చాలని వారు ఇచ్చిన సలహాతోనే వాయిదా వేశారట. సినిమాని 2డీ నుంచి 3డీకి మార్చేందుకు టీంకి చాలా టైం కావాల్సి వస్తోంది. ఈ అప్‌గ్రేడ్‌పై దర్శకుడు సుధీర్ అత్తవార్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం దాదాపు 40 మంది నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక బృందం ఈ త్రీడీ ఫార్మాట్ కోసం పనిచేస్తోంది. దృశ్య అనుభవాన్ని మరింత మెరుగుపరచడానికి, క్లైమాక్స్‌ను నీటి అడుగున తిరిగి చిత్రీకరించారు. ఈ సన్నివేశాన్ని కేరళలోని తిరువనంతపురంలో ఉన్న మలయాళ స్టార్ మోహన్‌లాల్‌కు చెందిన 'విస్మయ' స్టూడియోలో చిత్రీకరించారు. ఈ షూట్ కోసం ప్రత్యేకంగా నీటి అడుగున సెట్‌ను నిర్మించగా, సినిమాటోగ్రాఫర్ మనోజ్ పిళ్ళై నాలుగు కెమెరాలను ఉపయోగించి ఈ సన్నివేశాలను చిత్రీకరించారు.

డాక్టర్ రాజ్‌కుమార్ తర్వాత కన్నడ చిత్రసీమలో అరుదైన సంఘటనగా నటి శృతి నీటి అడుగున సన్నివేశాలలో స్వయంగా నటించారు. అత్యంత ప్రమాదకరమైన ఈ స్టంట్స్ చేయడానికి ముందు ఆమె దాదాపు 15 రోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. షూటింగ్ అంతటా స్కూబా డైవర్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్‌తో సహా భద్రతా బృందాలు అందుబాటులో ఉన్నాయి. శృతి దాదాపు 30 అడుగుల ఎత్తు నుండి హార్నెస్ ధరించి నీటిలోకి దూకి, కెమెరా ముందే పైకి తేలడం అనేది ఈ చిత్రంలోని ప్రధాన ఆకర్షణలలో ఒకటి. ఆమె ఆక్సిజన్ సహాయం లేకుండా 22 సెకన్ల పాటు నీటిలోపల చిత్రీకరణలో పాల్గొని, తన అద్భుతమైన నిబద్ధతను ప్రదర్శించింది. ఈ మార్పులు, చేర్పుల వల్ల సినిమా బడ్జెట్ గణనీయంగా పెరిగింది. కేవలం నీటి లోపలి సన్నివేశం కోసమే నిర్మాత త్రివిక్రమ్ సపల్య అదనంగా 12 కోట్లు పెట్టుబడి పెట్టారని ఎగ్జిక్యూటివ్ నిర్మాత విద్యాధర్ శెట్టి తెలిపారు.

## తిమ్మరాజుపల్లి టీవీ ఎంటర్ టైన్ చేస్తుంది

### • చిత్ర నిర్మాత, హీరో కిరణ్ అబ్బవరం • ఏప్రిల్ 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్




న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయితేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్‌లో 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా గ్రాండ్ రివీల్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు తేజ విహాన్ మాట్లాడుతూ.. ఇలా కొత్త వాళ్లతో మూవీ చేసి వాళ్లను ప్రోత్సహించాలనేది కిరణ్ అన్న కల. ఆయన ఎస్ ఆర్ కళ్యాణమండపం సినిమా రిలీజ్ ముందే కొత్త వాళ్లతో మూవీ చేయాలని నిర్ణయించుకున్నారు. కిరణ్ అన్న ఇంకా ఇండస్ట్రీలో సెటిల్ కాని టైమ్ అది. కొత్త వాళ్లతో సినిమా చేసే గుండె ధైర్యం ఆయనలో ఉంది. ఇండస్ట్రీలో కిరణ్ అన్న సక్సెస్, ఫెయిల్యూర్స్ చూశారు. తను నిలబడి తనతో పాటు మరికొంత మందిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమాలో టీవీ కుమార్ గా మిమ్మల్ని ఎంటర్ టైన్ చేయబోతున్నా అన్నారు.

చిత్ర నిర్మాత, హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. నా చిన్నప్పుడు మా ఊరిలో ఒకే టీవీ ఉండేది. ఊరి వాళ్లంతా ఆ ఇంటికి వెళ్లి టీవీ చూసేవారు. అలాంటి సంఘటన ముని వాళ్ల ఊరిలో ఒకటి జరిగింది. శివరాత్రి పండక్కి మూడు రోజులు టీవీ అద్దెకు తీసుకొచ్చి ఊరి వాళ్లంతా కలిసి సినిమాలు చూస్తూ సెలబ్రేట్ చేసుకున్నారట. ఈ కథంతా 95 సంవత్సరంలో జరుగుతుంది. ఈ కథ చెప్పినప్పుడే ముని క్లియర్‌గా చెప్పాడు. సార్ నేను ఎంటర్ టైన్‌మెంట్, కమర్షియల్ మూవీ చేయాలనుకోవడం లేదు. మా ఊరిలో నేను చూసిన మనుషులు ఇన్నోసెన్స్, వాళ్ల మధ్య జరిగే డ్రామా, టీవీకి అప్పట్లో ఉన్న ప్రాధాన్యత నేపథ్యంగా సినిమా చేస్తానని చెప్పాడు. ఇది ప్యూర్‌గా హానెస్ట్‌గా మేమంతా చేసిన ప్రయత్నం. చిన్న బడ్జెట్ లో చిన్న స్టోరీ లైన్ తో మేము చేసిన చిత్రమిది. ఏప్రిల్ 17న సినిమా రిలీజ్ చేస్తున్నాం. ఈ సమ్మర్ హాలీడేస్ లో మీరు మా మూవీ చూస్తూ ఆ ఊరు ప్రజల క్యారెక్టర్స్‌తో కనెక్ట్ అవుతారు, వారి ఇన్నోసెన్స్ ఫీల్ అవుతారు. టీవీ ఇంపార్టెన్స్ ఇంత ఉండేదా అని అనుకుంటారు. 90 కిడ్స్ కు అయితే వారి గతమంతా గుర్తుకు వస్తుంది. ఊరిలో జరిగే సస్పెన్స్ డ్రామా చిత్రమిది. ఇంత హానెస్ట్ గా, ఇంత టెక్నికల్ క్వాలిటీగా ఎలా తీశారా అనిపిస్తుంది. మీ ఫ్యామిలీ అందరితో కలిసి థియేటర్స్ కు వెళ్లండి అని కోరారు.అలాగే మా సంస్థలో మరో రెండు చిత్రాలు చేస్తున్నాం. ఆ సినిమాలతో హీరోలుగా, నటీనటులుగా కొత్త వాళ్లకు అవకాశాలు కల్పిస్తున్నాం. చిన్న స్థాయిలో ఉన్న వారికి నాకు వీలైనంత అవకాశం కల్పించాలని అనుకుంటున్నా. అన్నారు.

## ఇండియా మాట్లాడుకునే బైకర్‌ను తీశాం

### చార్మింగ్ స్టార్ శర్వా



చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్‌రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హై-ఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. డాల్బీ సినిమా, ఎపిక్, 4డీఎక్స్, పీసీఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో ఈ చిత్రాన్ని ఘనంగా విడుదల కానుంది. దీంతో ఈ యాక్షన్-ప్యాక్డ్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. పాటలు, ఇతర ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ను సృష్టించాయి. ఆదివారం మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఇండియన్ రేసర్లు ప్రపంచ స్థాయి ప్రతిభావంతులతో సమానంగా నిలబడగలరా అని ఒక ఫారిన్ స్పోర్ట్స్ యాంకర్ ప్రశ్నించడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. క్రమశిక్షణ వున్నప్పటికీ, పరిష్కారం కాని సంఘర్షణలు ఉన్న రైడర్‌గా విక్కీ పరిచయం అవుతాడు. అతని పోరాటాలు ట్రాక్‌పైనే కాదు, అతన్ని పెంచి, శిక్షణ ఇచ్చిన తండ్రితో. వారి మధ్య ఉన్న బాండింగ్ కథకు అద్భుతమైన ఎమోషన్ ని యాడ్ చేస్తోంది. శర్వ ఈ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయారు. రేసర్‌గా ఆయన ప్రజెన్స్ అదిరిపోయింది. ఈ పాత్ర కోసం ఆయన ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ మెస్మరైజ్ చేస్తోంది. శర్వా ఇంటెన్స్ యాక్టింగ్ నెక్స్ట్ లెవల్ లో ఉంది. రాజశేఖర్ రాజీపడని తండ్రి-గురువుగా పాత్రకు బలాన్ని చేకూర్చారు. ఆయన రీఎంట్రీలో ఇంతటి ఇంటెన్స్ పాత్రలో అతన్ని చూడటం కొత్తగా వుంది. అలజడితో కూడిన విక్కీ ప్రపంచంలో మాళవిక నాయర్ ప్రశాంతతను అందిస్తుంది. అతుల్ కులకర్ణి విలన్ ఛాయలున్న పాత్రను పోషించారు. వీరందరూ కలిసి అత్యంత ఉత్కంఠభరితంగా అనిపించే ఒక డ్రామాను అందించారు. యువరాజ్ కెమెరా వర్క్ మోటోక్రాస్‌లోని ప్రమాదం, వేగాన్ని అత్యంత అద్భుతంగా చిత్రీకరించగా, గిబ్రాన్ అందించిన ఉత్కంఠభరితమైన సంగీతం ప్రతి రేసును ఒళ్లు గగుర్పొడిచే అనుభవంగా మారుస్తుంది. యూవీ క్రియేషన్స్ వారి నిర్మాణ విలువలు ప్రతి ఫ్రేమ్‌లోనూ అద్భుతంగా కనిపిస్తూ గొప్ప థియేటర్ అనుభూతిని చ్చేలా వున్నాయి.

ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో హీరో శర్వా మాట్లాడుతూ.. మీడియా మిత్రులకు ప్రేక్షకులకు నమస్కారం. మొన్న ప్రభాస్ అన్న చెప్పాడు.. సీనియర్స్ తర్వాతే మేము. సీనియర్స్ ముందు నడుస్తుంటారు. వారి వెనక మేము నడుస్తాం. రాజశేఖర్ ఈ సినిమా చేసినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఆయనతో కలిసి నటించడం చాలా మంచి ఎక్స్‌పి రియన్స్. దిల్ రాజు గారు చెప్పినట్లు నిర్మాతలు దగ్గరుండి కథలు రాయించి సినిమాలు చేస్తే ఖచ్చితంగా మంచి విజయవంతమైన చిత్రాలు వస్తాయి. బైకర్ సినిమా గురించి ఒకటే మాట చెప్తాను.. మొన్న చెప్పి హిట్టు కొట్టాను.(నారీ నారీ నడుమమురారి) ఇప్పుడు మళ్లీ చెప్తున్నాను. ఈసారి బైకర్‌తో బంపర్ బ్లాక్ బాస్టర్ కొడుతున్నాను. ఇండియా మొత్తం మాట్లాడుకునే గొప్ప సినిమా తీశామన్నారు. డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత డైరెక్టర్ అభిలాష్ ఈ కథ చెప్పారు. ఇందులో క్యారెక్టర్ నాకు చాలా నచ్చింది. సినిమా అద్భుతంగా వచ్చింది. అందరికీ రిక్వెస్ట్ చేస్తున్నాను. మంచి పాత్రలు ఉంటే నన్ను గుర్తు పెట్టుకోండి. నాకోసం మంచి క్యారెక్టర్స్ తీసుకుని రమ్మని కోరారు. శర్వా గారు వెరీ నైస్ పర్సన్.

ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. కచ్చితంగా ఈ సినిమా సూపర్ హిట్ అవుతుంది. శర్వా పెర్ఫార్మెన్స్ సూపర్. రాజశేఖర్‌ని ఒక కోచ్‌గా ఫాదర్‌గా చేసిన పర్ఫామెన్స్ చాలా అద్భుతంగా ఉంటుంది. వంశీ ఈ సినిమాతో ఇండస్ట్రీకి చాలా మంచి ఫిల్మ్ ఇస్తున్నారని అన్నారు.

## ఘనంగా అరెరే.. అరెరే.. మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల



హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సింగర్, నటి దియా అందించిన 'అరెరే.. అరెరే..' మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. బటర్‌ఫ్లై మ్యూజిక్ బ్యానర్‌పై రూపొందిన ఈ మ్యూజిక్ వీడియో విడుదల వేడుకకు సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, హీరో పూరి ఆకాష్, సినీ ప్రముఖులు సమీర్, సాగర్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, నటుడు, మిమిక్రి శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు ఆడియోను విడు దల చేసి చిత్రబృందానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ..."దియా ఒక వండర్‌ఫుల్ టాలెంట్. ఈ అరెరే.. అరెరే.. మ్యూజిక్ ఆల్బమ్ చాలా హృద్యంగా ఉంది. ఆమె గాత్రం, నటన రెండింట్లోనూ ప్రతిభ స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి కొత్త ప్రతిభలు ముందుకు రావడం తెలుగు సంగీత రంగానికి మంచి సంకేతం. ఈ ఆల్బమ్ పెద్ద విజయం సాధించాలని ఆశిస్తున్నాను" అని అన్నారు. ఈ మ్యూజిక్ వీడియోకు క్రాంతి వర్మ దర్శకత్వం వహించగా, కె & ఎం రైటింగ్స్ కథను అందించారు. నిర్మాతగా నూతన్ చెకురి, సంగీతాన్ని శరవణ వాసుదేవన్ సమకూర్చారు. డీఓపీగా చందు ఏజే, ఎడిటర్‌గా ఆర్.ఎం. విశ్వనాథ్ కుచనపల్లి పనిచేశారు. పోస్టు ప్రొడక్షన్ పనులను పిక్సెల్‌పారెట్ పోస్టు నిర్వహించింది. త్వరలోనే ఈ మ్యూజిక్ వీడియో యూట్యూబ్‌తో పాటు స్పాటిఫై, ఆపిల్ మ్యూజిక్, అమెజాన్ మ్యూజిక్ వంటి ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లలో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది.

## తెరచాప చిత్ర ట్రైలర్ లాంచ్

### విలేజ్ పొలిటికల్ డ్రామా



అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మాతగా తెరకెక్కుతున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించగా రాజీవ్ కనకాల, పృధ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, ఫిష్ వెంకట్, జబర్దస్త్ అశోక్, నాగి, అప్పారావు, రైసింగ్ రాజు, రాజేష్ భూపతి, నాగ వంశీ, శ్రీనివాస్ నేస, చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషించారు. అజీమ్, వెంకట్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేసిన ఈ చిత్రానికి ప్రజల్ క్రిష్, ఎం.ఎల్ రాజా సంగీతాన్ని అందించారు. రాజు బొడసింగి ఎడిటింగ్ చేయగా జీవన్ జార్జ్ కోరియోగ్రఫీ చేశారు. విడుదల తేది దగ్గరవుతున్న సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేయడం జరిగింది.

తెరచాప ట్రైలర్ చూస్తుంటే ఆహ్లాదకరమైన బ్యాగ్రౌండ్ మ్యూజిక్ తో మొదలై సముద్రతీరంలో ఉండే ఒక ఊరి కథలా అనిపిస్తుంది. ఊరంటే మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలుతో పాటు రాజకీయాలు, భేద భావాలు ఉండడం కూడా సహజమే. అటువంటి పరిస్థితుల మధ్య ఒక యువకుడు తన ఊరిలో ఉన్న పరిస్థితుల పట్ల పోరాడుతున్నట్లు అర్థమవుతుంది. డైలాగ్స్ ఇంకా టేకింగ్ చాలా బాగున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక బెంచ్ మార్క్ సృష్టించే విలేజ్ పొలిటికల్ డ్రామాలా అనిపిస్తుంది.

తారాగణం: నవీన్‌రాజ్ శంకరపు, పూజా సుహాసిని, శ్రీలు, జగదీష్ ప్రతాప్ బండారి, రాజీవ్ కనకాల, రాకీ, నాగ మహేష్, పృధ్వీ రాజ్, ఫిష్ వెంకట్, అశోక్ జబర్దస్త్, నాగి జబర్దస్త్, అప్పారావు జబర్దస్త్, రైజింగ్ రాజు, రాజేష్ భూపతి, శ్రీనివాస్ నేస, మాయ మచంద్ర, సకారం తదితరులు.

## ఎమోషనల్ రివెంజ్ డ్రామా డైమండ్ డెకాయిట్

### ఘనంగా ఆడియో రిలీజ్ ఫంక్షన్ చిత్రంలోని పాటకు హుక్ స్టెప్ వేసిన వారికి రూ.లక్ష బహుమతి ప్రకటన



తెలుగు తెరపై సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఎమోషనల్ రివెంజ్ డ్రామా 'డైమండ్ డెకాయిట్'. పార్థ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి యాదవ్ దర్శకత్వంలో, పార్థ గోపాల్ - మేఘన జంటగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. ప్రముఖ మ్యూజిక్ సంస్థ మధుర ఆడియో ద్వారా ఈ పాటలను ముఖ్య అతిథిగా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య పాల్గొని విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఓ వినూత్న పోటీకి తెర లేపింది. ఈ చిత్రంలోని "మరదలివే" పాటకు హుక్ స్టెప్ ఛాలెంజ్ ను ప్రకటించింది. ఆసక్తిగల వారు వారు ఆ పాటకు తమ హుక్ స్టెప్‌తో రీల్స్ రూపొందించి, ఆ రీల్స్ లింక్‌ను 8074801661 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు. అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి: మొదటి బహుమతి రూ.1,00,000, రెండవ బహుమతి రూ.50,000 కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించదానికి ఈ ఛాలెంజ్ ను ప్రకటించామని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ.. "సినిమా పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. పెద్దపల్లి రోహిత్ అందించిన సంగీతం వినసొంపుగా ఉంది. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందనే నమ్మకం ఉంది. చిత్ర యూనిట్ మంచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అన్నారు.

చిత్ర నిర్మాత, హీరో పార్థ గోపాల్ మాట్లాడుతూ.. దర్శకుడు సూర్య జి. యాదవ్ గత మూడున్నరేళ్లుగా ఎన్నో కష్టాలు, ఎత్తుపల్లాలు ఎదుర్కొంటూ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ప్రశంసలు వస్తున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం" అని తెలిపారు. దర్శకుడు సూర్య జి. యాదవ్ మాట్లాడుతూ.. 5 పాటలు, మ్యూజిక్ నిజంగా అద్భుతంగా వచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్ మా సినిమాకు అదృష్టం. మా హీరో, నిర్మాత పార్థ గోపాల్ గారు పూర్తి సపోర్టు ఇచ్చారు. ఎక్కడా రాజీ పడకుండా నిర్మాణం చేస్తున్నారు . సినిమా ఫ్యామిలీ ఎమోషన్, రివెంజ్ డ్రామా మేళవింపుతో ఉంటుంది. పాటలు, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా చాలా బాగా వచ్చాయి. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం" అన్నారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.